# భగవద్గీత పరిచయము



వ్యాసుడు &



భీష్ముడు



ద్రోణాచార్యుడు



కర్ణుడు



గాంధారి



యుధిష్ఠిరుడు & ధర్మరాజు



భీముడు & భీమసేనుడు వృకోదరుడు



అర్జునుడు & విజయుడు



నకులుడు & సహదేవుడు







అమరానాథ్ అమర్

# Srimad Bhagavad Gita

# శ్రీమద్భగవద్గీత

## శ్రీమద్భగవద్గీత పరిచయము


SANATANADHARM ™

Bharathiya Sanatana Dharmam

bhagavathamar@gmail.com
SANATANADHARM.COM



అమరానాథ్ అమర్

# Srimad Bhagavad Gita –
# శ్రీమద్భగవద్గీత పరిచయము



* గీత ఒక ప్రత్యేక గ్రంథముగా భావింపబడుతుంది. సాక్షాత్తు కృష్ణ భగవానుడు బోధించిన జ్ఞానము గనుక ఇది భారతీయులు పరమ పవిత్ర గ్రంథాలలో ఒకటి.

* భగవద్గీత, మహాభారత ఇతిహాసములోని భీష్మ పర్వము 25వ అధ్యాయము మొదలు 42వ అధ్యాయము వరకు 18 అధ్యాయములు భగవద్గీతగా ప్రసిద్ధము. కాని గీత ఒక ప్రత్యేక గ్రంథముగా భావింపబడుతుంది. సాక్షాత్తు కృష్ణ భగవానుడు బోధించిన జ్ఞానము గనుక ఇది హిందువుల పరమ పవిత్ర గ్రంథాలలో ఒకటి.

* పరమ పావనమైన ఈ గీతా శాస్త్రమును ఎవడు ప్రయత్నపూర్వకముగ పఠించునో అట్టివాడు భయము, శోకముల నుండి విముక్తి పొంది విష్ణుపదమును పొందును.

* మన దేహములో పది ఇంద్రియములు, ఐదు ప్రాణములు, మనస్సు, బుద్ధి, అహంకారము= 18. భగవద్గీతలో 700 శ్లోకాలు ఉన్నాయి. వాటిలో శ్రీకృష్ణుడు చెప్పినవి 574, అర్జునుడు చెప్పినవి 84, సంజయుడు చెప్పినవి 41, ధృతరాష్ట్రుడు చెప్పినది 1 మొత్తము 700. కొన్ని ప్రతులలో 701 ఉన్నాయి.

* గీతనే బాగా గానము చేయవలెను. ఇతర శాస్త్రముల వలన ప్రయోజనము ఏమిటి ? ఎందుకంటే గీత స్వయముగ శ్రీకృష్ణ భగవానుని ముఖ పద్మము నుండి చెప్పబడినది. గీతా శాస్త్రమును చదువు వారి మరియు వినువారి పుణ్యము అభివృద్ధి చెందును. వారి పాపము తొలగిపోవును, దు:ఖము నశించిపోవును.

* ఎవరు గీతా శాస్త్రమును ఎల్లప్పుడు చదువుచూ, వినుచూ, ఆచరిస్తూ ఉంటారో అలాంటి వారిని మానవులుగా తలంపరాదు వారు నిస్సంశయముగా దైవస్వరూపులే అగుదురు. ఎవడు గీతార్ధమును శ్రవణము చేయునో, ఇతరులకు వర్ణించి చెప్పునో మరియు అందులో ఉన్న ఉత్తమ భావములను పరులకు వినిపించునో అట్టి వాడు పరమ పదమును పొందును. గీతార్ధమును చదివి అర్ధం చేసుకొని ఎవడు వంద గీతా గ్రంథములను ఇతరులకు దానము చేయునో అట్టి వాని కోరికను భగవంతుడు నెరవేర్చును.

* భగవద్గీతను చదివే విషయంలో చిన్న, పెద్ద అను తేడా ఏమియు లేదు . గీతా జ్ఞానము సమరూపమైనది మరియు బ్రహ్మస్వరూపిణి అయి ఉన్నది.

* మహా పాపాత్ముడు అయినప్పటికి గీతార్ధమును చదివినా, వినినా వైకుంఠము పొంది అచట మహావిష్ణువుతో సహా ఆనందము అనుభవించును.

అమరానాథ్ అమర్

# Srimad Bhagavad Gita –
# శ్రీమద్భగవద్గీత పరిచయము





Sri. Chinna.c. Amaranath
Punganur, Chittoor-517247
Andhra predesh
South India
Mobile:- 9596483440
Email:-
BHAGAVATHAMAR@GMAIL.COM

అమరానాథ్ అమర్

# Srimad Bhagavad Gita – శ్రీమద్భగవద్గీత పరిచయము



భక్తుడైన అర్జునునికి శ్రీకృష్ణ పరమాత్మ రూపమున శ్రీమన్నారాయణుడే స్వయముగా భవద్గీతను బోధించినాడు. పురాణమునియైన వేదవ్యాస భగవానుడు ఆశువుగా ప్రవచించగా విఘ్నేశ్వరుడు మహాభారత మధ్య భాగమైన భీష్మపర్వంలో భగవద్గీతను పొందుపరచినాడు.

## భగవద్గీత ఎవరికి అవసరం ?

కొత్త జీవితాన్ని ప్రారంభించాలనుకునే ప్రతి ఒక్కరికితన భవిష్యత్తు గురించి కలలుగనే ప్రతి ఒక్కరికి

తాను నిర్ణయించుకున్న లక్ష్యాన్ని సాధించుకోవాలనుకునే ప్రతి ఒక్కరికి నిజమైన సుఖం అంటే ఏమిటో తెలుసుకొని ఆనందించాలనుకునే ప్రతి ఒక్కరికి మానవుని పుట్టుక, మరణానికి కారణం తెలుసుకోవాలనుకునే ప్రతిఒక్కరికి నా జీవితంలో తారసపడే ప్రతిఒక్క సమస్యకు భగవద్గీత ఏలాంటి పరిష్కారం చూపుతుందో చూద్దాం అనే దృష్టితో వచనంలో భగవద్గీతను చదవడం మొదలు పెడితే ఖచ్చితంగా సమాధానం దొరుకుతుంది.

ఈ జ్ఞానం సృష్టి ఆది యందు దేవదేవునిచే సూర్యునికి చెప్పబడింది. తిరిగి మరల ఆ జ్ఞానమే దేవుని మానవరూపము అయిన భగవంతుడు శ్రీకృష్ణపరమాత్మ చే ద్వాపరయుగములో పరమ పవిత్ర పరిశుద్ధ భగవద్గీత రూపములో శ్రీ అర్జనుని కారణంగా చేసుకుని మరల ఈ లోకానికి చెప్పబడింది.















Srimad Bhagavad Gita



# శ్రీమద్భగవద్గీత

## పరిచయము


| | |
|---|---|
| 1. ప్రథమోఽధ్యాయః - అర్జునవిషాదయోగః | 2 - 5 |
| 2. ద్వితీయోఽధ్యాయః - సాంఖ్యయోగః | 6 - 14 |
| 3. తృతీయోఽధ్యాయః - కర్మయోగః | 15 - 21 |
| 4. చతుర్థోఽధ్యాయః - జ్ఞానయోగః | 22 - 28 |
| 5. పంచమోఽధ్యాయః - సన్న్యాసయోగః | 29 - 32 |
| 6. షష్ఠోఽధ్యాయః - ధ్యానయోగః | 33 - 39 |
| 7. సప్తమోఽధ్యాయః - జ్ఞానవిజ్ఞానయోగః | 40 - 44 |
| 8. అష్టమోఽధ్యాయః - అక్షరబ్రహ్మయోగః | 45 - 49 |
| 9. నవమోఽధ్యాయః - రాజవిద్యా రాజగుహ్యయోగః | 50 - 54 |
| 10. దశమోఽధ్యాయః - విభూతియోగః | 55 - 58 |
| 11. ఏకాదశోఽధ్యాయః - విశ్వరూపదర్శనయోగః | 59 - 66 |
| 12. ద్వాదశోఽధ్యాయః - భక్తియోగః | 67 - 70 |
| 13. త్రయోదశోఽధ్యాయః - క్షేత్రక్షేత్రజ్ఞవిభాగయోగః | 71 - 74 |
| 14. చతుర్దశోఽధ్యాయః - గుణత్రయవిభాగయోగః | 75 - 78 |
| 15. పంచదశోఽధ్యాయః - పురుషోత్తమయోగః | 79 - 82 |
| 16. షోడశోఽధ్యాయః - దైవాసురసంపద్విభాగయోగః | 83 - 85 |
| 17. సప్తదశోఽధ్యాయః - శ్రద్ధాత్రయవిభాగయోగః | 86 - 88 |
| 18. అష్టాదశోఽధ్యాయః - మోక్షసన్న్యాసయోగః | 89 - 98 |

భగవద్గీత

# మొదటి అధ్యాయము
# అర్జున విషాదయోగము



* ఓ సంజయా! ఈ ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమునందు యుద్ధము చేయవలెనని కోరిక బలంగా కలిగిన వాళ్లు అయిన నా కుమారులు, మరియు నా తమ్ముడు పాండురాజు కుమారులు, ఏమి చేస్తున్నారు. వివరంగా చెప్పు అని ధృతరాష్టుడు సంజయుని అడగడంతో గీతాశాస్త్రము ప్రారంభం అవుతుంది.




యుద్ధరంగంలోని మహావీరుల వర్ణన

* అప్పుడు సంజయుడు మహారాజా ! వ్యూహంగా ఏర్పడిన పాండవ సైన్యాన్ని దుర్యోధన మహారాజు చూసి వెంటనే గురువుగారయిన ద్రోణాచార్యుని వద్దకు వెళ్ళి, ఆచార్యా! పాండవుల సైన్యము ఎంత గొప్ప వ్యూహంతో నిలబడి ఉందో చూడండి. దానిని నిర్మించింది ద్రుపదుని కొడుకైన ధృష్టద్యుమ్నుడు.

* పాండవ సైన్యములో భీమార్జునులతో సమానులైన శూరులు గొప్ప ధనస్సులు ధరించి ఉన్నారు. సాత్యకి, విరాటరాజు, మహారథుడైన ద్రుపదుడు, ధృష్టకేతువు, చేకితానుడు, బలవంతుడైన కాశీరాజు పురుజిత్తు, కుంతిభోజుడు, పురుష శ్రేష్ఠుడైన శైబ్యుడు, పరాక్రమవంతుడైన యుధామన్యుడు, బలవంతుడైన ఉత్తమౌజుడు సుభద్రకుమారుడు, ద్రౌపది కుమారులు వీళ్ళందరూ మహారథులే. ఓ బ్రాహ్మణోత్తమా


అమరానాథ్ అమర్

భగవద్గీత

# మొదటి అధ్యాయము
# అర్జున విషాదయోగము



! ఇక మన పక్షంలోని గొప్పవాళ్ళు, సేనా నాయకులెవ్వరో మీకు తెలియాలని చెబుతున్నా వారిని కూడా గమనించండి. మీరు (ద్రోణాచార్యుడు), భీష్ముడు, కర్ణుడు, సమరవిజయుడైన కృపాచార్యుడు, అశ్వత్థామ, వికర్ణుడు, సోమదత్తుని పుత్రుడు వీళ్ళేకాక నా కొరకు ప్రాణాలను ఫణంగా పెట్టి వచ్చిన వారు ఇంకా చాలా మంది ఉన్నారు. మన సైన్యము 11 అక్షౌహిణీలు. దానిని భీష్ముల వారు రక్షిస్తారు. ఇక పాండవుల సైన్యమంటారా 7 అక్షౌహిణీలు అది చాలా పరిమితం. దానిని భీముడు కాపలా కాస్తున్నాడు.ఆ తరువాత దుర్యోధనుడు సైనికులతో ఇలా అన్నాడు. మీరు ఉండవలసిన స్థానాలను విడిచిపెట్టకుండా ఉండి కురువృద్ధుడు, పరాక్రమ వంతుడైన భీష్మ పితామహులవారిని రక్షిస్తూ ఉండాలి.




యుద్ధ ప్రారంభము సందర్భముగా శంఖనాదాలు







అమరనాథ్ అమర్



# మొదటి అధ్యాయము
# అర్జున విషాదయోగము

శిఖండి, ధృష్టద్యుమ్నుడు, విరాటుడు, సాత్యకి, ద్రుపదరాజు, ద్రౌపది కొడుకులు, అభిమన్యుడు మొదలగు వారందరూ వారి వారి శంఖాలను పూరించారు. ఆ శబ్దాలు భూమి, ఆకాశాలను ప్రతిధ్వనింపచేస్తూ కౌరవుల గుండెల్లో దడపుట్టించాయి. ఓ ధృతరాష్ట్ర మహారాజా! హనుమంతుని జెండాకలిగిన రథంలో ఉన్న అర్జునుడు కౌరవులను చూసి ధనస్సు పైకెత్తి శ్రీకృష్ణ భగవానునితోఓ కృష్ణా ! నేను ఎవరితో యుద్ధం చేయాలి? యుద్ధానికి ఎవరెవరు సిద్ధంగా ఉన్నారు? వారందరూ కనిపించే విధంగా మన రథాన్ని రెండు సేనల మధ్య నిలుపు. దుర్యోధనుడి పాడుబుద్ధికి సహకరించడం కోసం యుద్ధానికి వచ్చిన వారందరిని నేను చూడాలి అని అనగా అప్పుడు కృష్ణుడు భీష్ముడు, ద్రోణులకు ఎదురుగా రథాన్ని నిలిపి యుద్ధానికి సిద్ధంగా ఉన్న కౌరవసేనను చూడు అన్నాడు.అర్జునుడు సైన్యం మధ్య నుండి ఇరు వర్గాలలో యుద్ధానికి సిద్ధముగా ఉన్న తన తండ్రులు, తాతలు, గురువులు, మేనమామలు, అన్నదమ్ములు, కొడుకులు, మనుమలు, స్నేహితులు, మామలు మొదలగు బంధువులందరినీ చూసి అపారమైన కరుణతో చలించిపోయి, బాధపడుతూ.....

అర్జునుడిలో తెలియని ఆవేదనఓ కృష్ణా! యుద్ధం చేయాలని వచ్చిన నా బంధువుల్ని చూసిన తరువాత నా అవయవములు పట్టు తప్పుతున్నాయి. నోరు ఎండిపోవుచున్నది, దేహంలో దడ, గగుర్పాటు కలుగుతున్నాయి. గాండీవం చేతినుండి జారిపోతుంది. నా తల తిరుగుతున్నది నిలబడలేకపోతున్నాను.ఓ కేశవా! నాకు అపశకునాలు కనిపిస్తున్నాయి. యుద్ధంలో బంధువులందరిని చంపుకొని నేను అనుభవించేది ఏమిటో ఊహించలేకున్నాను. నేను విజయం కోరడం లేదు, రాజ్యాన్ని ఆశించడం లేదు, నాకు సుఖాలు కావాలనే ఆరాటం లేదు. హే గోవిందా! రాజ్యము వలనగాని, భోగాలవలన గాని నాకు ఒరిగేది ఏముంది? బ్రతకడమే నిరర్థకం అనిపిస్తుంది నాకు. ఎవరికోసం రాజ్యాన్ని, భోగాలను, సుఖాలను ఆశించామో వాళ్ళే యుద్ధంలో సంపదలు వదిలేసి, ప్రాణాలను కూడా లెక్కచేయకుండా ఎదురుగా నిలబడి ఉన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ముల్లోకాల రాజ్యాధిపత్యము లభించినా నేను వీళ్ళనెవ్వరినీ చంపను. ఇక భూమికోసం చంపుతానా? ఓ మధుసూదనా! ఒకవేళ వీళ్ళలో ఎవరైనా నన్ను చంపాలని ప్రయత్నించినా నేను మాత్రం వాళ్ళను చంపను. ఓ జనార్ధనా! ధృతరాష్ట్రుని కొడుకులు పాపాత్ములు. పాపుల్ని చంపితే మనకు కూడా పాపమే చుట్టుకుంటుంది. వాళ్ళను చంపడం నా వల్లకాదు. మన వాళ్ళను చంపి మనము మాత్రం సుఖంగా ఎలాఉండగలము.?

అమరానాథ్ అమర్

భగవద్గీత

# మొదటి అధ్యాయము
# అర్జున విషాదయోగము



## కులము నాశనము అయితే కలిగే అరిష్టాలను గురించి అర్జునుడు వివరించుట ?

కులం నశిస్తే కలిగే చెడు ఏమిటో? మిత్రద్రోహము వలన ఏర్పడే పాతకం ఎలాంటిదో? వాళ్ళకు తెలియక పోవచ్చు కాని మనకు తెలుసుకదా? అలాంటప్పుడు ఆ పాపం నుండి మనం తప్పించుకొన వచ్చుకదా. ?

కుల నాశనం జరిగితే అనాదిగా, ఆచారంగా వస్తున్న కులధర్మాలు నశిస్తాయి. ధర్మం నశిస్తే అధర్మం పెరుగుతుంది. అధర్మం వ్యాప్తి చెందితే స్త్రీలు పాడైపోయి వర్ణసంకరం జరుగుతుంది. దానివలన కులవ్యవస్థ భ్రష్టుపట్టి వారి పితృదేవతలు శ్రాద్ధతర్పణాలకు కూడా నోచుకోకుండా అధోగతి పాలయ్యి నరకానికి పోతారు.

ఈ విధంగా వర్ణసంకరానికి కారకులైన వ్యక్తులదోషంవల్ల శాశ్వతమైన జాతిధర్మాలు, కులధర్మాలు నశించిపోతాయి.

బంధువుల్ని హతమార్చి, పాపాన్ని మూటగట్టుకోవడానికి నడుం బిగించాము. ఇదంతా రాజ్య సుఖాలపై ఆశతోనేకదా. అయ్యో! నేను వాళ్ళను ఎదిరించను, ఆయుధం పట్టను. అయినా ధృతరాష్ట్రుని కొడుకులు ఆయుధాలతో నన్ను చంపుతారా? చంపనీ! అదే నాకు మంచిది. అని అంటూ అర్జునుడు ధనుర్బాణములను వదిలేసి దు:ఖంతో కుమిలిపోతూ రథం మధ్యలో కూలపడ్డాడు.




ఈ విధంగా ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు అర్జున విషాద యోగం అనే మొదటి అధ్యాయము సమాప్తము.

భగవద్గీత

# రెండవ అధ్యాయము
# సాంఖ్యయోగము




కరుణార్ద్ర హృదయుడైన అర్జునుడి కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి. దుఃఖిస్తున్న అర్జునుడిని చూసి శ్రీ కృష్ణభగవానుడు మొదటిసారి అర్జునుడితో ఇలా అన్నాడు.

సంక్లిష్టమైన సమయంలో ఈ మనోవ్యధ నీకు ఎలా దాపురించింది, ఇది ఆర్యులకు రాకూడనిది, అధైర్యపడి పౌరుష హీనుడిగా (నపుంసకుడిగా) మాట్లాడకు. నీచమైన హృదయ దౌర్బల్యాన్ని విడిచిపెట్టి యుద్ధము చెయ్యి.

అప్పుడు అర్జునుడు ఓ మధుసూధనా! మహానుభావులైన భీష్మ, ద్రోణులపై బాణాలను ఎలా ప్రయోగించను? ఎలా ఎదిరించేది? వారు నాకు గురువులు. వారిని చంపి ఆ నెత్తుటి కూడు తినటంకన్నా భిక్షమెత్తుకొని జీవించడం శ్రేయస్కరము అని నాకు అనిపిస్తుంది. ఈ యుద్ధంలో వారు గెలుస్తారో, మనము గెలుస్తామో తెలియదు. మనతో పోరాడడానికి కౌరవసేన మన ఎదురుగా ఉంది. వాళ్ళను చంపి మేము జీవించడం వ్యర్థం.

ధర్మనిర్ణయం చేసే శక్తిని నా మనస్సు కోల్పోయింది. శోకంతో కుమిలిపోతున్నాను. అందుకే నిన్ను శరణువేడుతున్నాను. ఏది చేయడంవల్ల నాకు శ్రేయస్సు కలుగుతుందో అది నాకు తెలుపు. నాకు మరోమార్గం లేదు. నన్ను శిష్యుడిగా స్వీకరించు. నేను యుద్ధం చేయలేను అని గోవిందుడితో పలికి ఉభయ సేనల మధ్య దిగులుతో, దు:ఖితుడై ఉన్నాడు అర్జునుడు.




అమరానాథ్ అమర్

భగవద్గీత

# రెండవ అధ్యాయము
# సాంఖ్యయోగము



**అప్పుడు శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వుతూ...**

అర్జునా! నీవు ఏడవకూడని వాళ్ళకోసం ఏడుస్తున్నావు, పైగా పండితుడిగా మాట్లాడుతున్నావు. జ్ఞానులు బ్రతికి ఉన్నవారి గురించి కాని, చనిపోయిన వారి గురించి కాని శోకించరు. నీవు, నేను లేని కాలం లేదు. రాజులందరూ కూడా ఒకప్పుడు ఉన్నవారే భవిష్యత్తులో కూడా మనందరం ఎక్కడికీ వెళ్ళము ఇక్కడే ఉంటాము.


జీవుడికి ప్రస్తుత దేహంలో బాల్యము, యవ్వనము, ముసలితనము అనే మార్పు ఎలా కనిపిస్తూ ఉందో అలాగే చనిపోయిన తరువాత మరొక దేహం లభిస్తుంది. ఈ విషయంలో జ్ఞానులు మోహానికి గురికారు. ఇంద్రియాలతో సంబంధం ఏర్పడినప్పుడు శీతోష్ణాలు, సుఖదు:ఖాలు కలుగుతుంటాయి. అవి స్థిరంగా ఉండక వస్తూ పోతూ ఉంటాయి. వాటిని నీవు ఓర్చుకోవాలి.

ఓ పురుష శ్రేష్ఠా! సుఖ దు:ఖాల యందు సమబుద్ధి కలిగి ఉంటే అవి అతనిని కష్టపెట్టవు. అలాంటివాడు మోక్షానికి అర్హుడు.

**ఆత్మతత్వం గురించి శ్రీకృష్ణ భగవానుడు ఏమి చెప్పాడు ?**

ఈ జగత్తు అంతటా వ్యాపించి ఉన్న ఆత్మ నశించేది కాదు. ఆత్మని నాశనం చేసేవారు ఎవ్వరూలేరు. శరీరాలను ధరించే ఆత్మ నిత్యమైన, ఊహకు అందనిది. కాని, ఈ శరీరాలు అంతరించిపోతాయి.

దేహాన్ని ధరించిన ఆత్మ చంపుతుందని భావించే వాడికి సత్యం తెలియదు. అలాగే ఆత్మ చంపబడుతుందని భావించేవాడికీ యథార్థం తెలియదు. ఆత్మ చంపేది, చంపబడేది కాదు. ఆత్మ పుట్టుక లేనిది, నిత్యమైనది, పురాతన మైనది. శరీరం నశించినా ఆత్మ నశించదు. ఆత్మ పుట్టేది, చచ్చేది కాదని, నిరంతరం ఉండేదని తెలుసుకున్నవాడు ఎవరిని అయినా ఎలా చంపిస్తాడు? ఎట్లా చంపగలడు? మానవుడు చినిగిపోయిన వస్త్రాలను వదిలి, నూతన వస్త్రాలు ధరించినట్టే ఆత్మ కూడా శిథిలమైన శరీరాలను విడిచి క్రొత్త శరీరాలను పొందుతూ ఉంటుంది.



భగవద్గీత

# రెండవ అధ్యాయము
# సాంఖ్యయోగము






**ఆత్మను శస్త్రాలు ఖండింపలేవు. అగ్ని కాల్చలేదు. నీరు తడపలేదు. గాలి ఎండింపజాలదు.**

ఆత్మ సర్వవ్యాపి, మన కంటికి కనిపించదు, మనస్సు ఊహించలేదు. కనుక ఈ విధంగా ఆత్మను అర్థం చేసుకుంటే దు:ఖించవలసిన అవసరం లేదు. ఓ అర్జునా ఒక వేళ నీవు ఆత్మ ఎప్పుడూ పుడుతూ, చస్తూ ఉంటుందని భావించినప్పటికి నువ్వు దు:ఖించవలసిన అవసరం లేదు. ఎందుకంటే పుట్టినవానికి, మరణం తప్పదు, మరణించినవారికి మరలా జన్మమూ తప్పదు. అనివార్యమైన ఈ విషయం గురించి నీవు దుఃఖించడమెందుకు? సర్వ ప్రాణుల శరీరాలు మొదట్లో లేవు, మధ్యలో కనిపిస్తాయి, గతించిన తరువాత మళ్ళీ లేకుండాపోతాయి. అలాంటి విషయంలో దు:ఖించవలసిన పని ఏముంది? ఒకడు ఆత్మను ఆశ్చర్యంగా చూస్తాడు, మరొకడు చిత్రంగా చెబుతాడు, ఇంకొకడు విచిత్రంగా వింటాడు. అయినా ఒక్కడు కూడా ఆత్మ గురించి పూర్తిగా తెలుసుకోలేడు.

అమరానాథ్ అమర్

భగవద్గీత

# రెండవ అధ్యాయము
# సాంఖ్యయోగము



అందరి శరీరాలలో ఉన్న ఈ ఆత్మ ఎప్పుడూ చంపబడదు. కనుక ఏ ప్రాణి గురించీ నువ్వు దుఃఖించ వలసిన అవసరం లేదు.

**యుద్ధం చేయడం క్షత్రియ ధర్మం**

యుద్ధం చేయుట క్షత్రియుల స్వధర్మం. కాబట్టి అర్జునా! నీకు యుద్ధం చేయడం కన్నా శ్రేయస్కర మార్గం మరొకటి లేదు. ఈ యుద్ధము నీవు కోరుకున్నది కాదు. ఇలాంటి యుద్ధాల వలన స్వర్గ ద్వారాలు తెరుచుకుంటాయి. ఈ అవకాశము క్షత్రియులకు మాత్రమే లభిస్తుంది. అర్జునా! ధర్మ సమ్మతమైన ఈ యుద్ధం చేయకపోతే నీవు కీర్తిని పోగొట్టుకొని పాపమును పొందుతావు. పూర్వం మహారథులందరూ నిన్ను ఎంతగానో గౌరవించారు. ఇప్పుడు నీవు వాళ్ళ దృష్టిలో చులకనై పోతావు. కేవలం భయం వల్లనే నువ్వు యుద్ధం మానేశావని భావించి, ప్రజలు నీ అపకీర్తిని చాలా కాలం చెప్పుకుంటారు. మహనీయులకు అపకీర్తి మరణం కంటే ఎక్కువ. నువ్వంటే గిట్టని వాళ్ళు నీ సామర్థ్యాన్ని నిందిస్తూ అనరాని మాటలు అంటారు. అంతకు మించిన బాధ మరొకటి ఉంటుందా?

కౌంతేయా! యుద్ధంలో మరణిస్తే స్వర్గాన్ని పొందుతావు, జయించావా రాజ్యాన్ని అనుభవిస్తావు. అందుకని ధృడ నిశ్చయము కలిగిన వాడివై యుద్ధమునకు సిద్ధపడు. సుఖ దుఃఖాలు, లాభ - నష్టాలు, జయ అపజయాలను సమానంగా భావించి యుద్ధం చేస్తే నీకు పాపం అంటదు.




అమరనథ్ అమర్

భగవద్గీత

# రెండవ అధ్యాయము

# సాంఖ్యయోగము



అర్జునా సాంఖ్యం అనబడే పరమార్థతత్త్వం మరియు జ్ఞానాన్ని గురించి చెప్పాను. ఇప్పుడు కర్మయోగ విషయాన్ని చెబుతాను విను. ఈ యోగశాస్త్ర జ్ఞానము తెలుసుకొని నీవు కర్మబంధం నుండి బయటపడగలవు. కర్మయోగంలో రెండు సుగుణాలు ఉన్నాయి. మొదటిది ప్రారంభించిన దానికి నాశనము లేదు. రెండవది విపరీత ఫలితాలు ఉండవు.

ధర్మ రూపమైన ఈ యోగాన్ని కొంచమైనా ఆచరించినా అది గొప్ప భయం నుండి నిన్ను రక్షిస్తుంది. కర్మ యోగంలో 'బుద్ధి ఏకమై, స్థిరమై ఉంటుంది. నిశ్చయబుద్ధి లేనివారి ఆలోచనలు అనేక భేదాలతో అంతం లేకుండా సాగుతూ ఉంటాయి. స్వర్గమునకు మించినది మరొకటి లేదని భోగాలను, సంపదలను పొందే మార్గాన్ని చెబుతూ ఉంటారు. అవి మరోజన్మ అనే కర్మ ఫలాన్ని అందిస్తాయి. కొందరు భోగమునందు, ఐశ్వర్యమునందు ఆసక్తులై, ఇతరుల తియ్యటి మాటలకు ఆకర్షితులై తమ బుద్ధిని జారవిడుచుకుంటారు. వారి బుద్ధి అంతఃకరణములందు నిలవదు.

వేదాలు సత్వగుణం, రజోగుణం, తమోగుణం అనే త్రిగుణాత్మకమైన కర్మ కాండలను గురించే చెబుతాయి. అర్జునా ! నువ్వు ఆ మూడు గుణాల నుండి బయటపడు. ద్వంద్వాలను దాటిపో. నీ యోగ, క్షేమములను లెక్కచేయక ఆత్మజ్ఞానివి కమ్ము. అంతటా నీరు నిండి ఉన్న జలాశయాల దగ్గర బావుల వలన ఎలాంటి ప్రయోజనం ఉంటుందో, పరమార్థ జ్ఞానం కలిగిన బ్రహ్మజ్ఞానికి వేదాల వలన అలాంటి ప్రయోజనమే ఉంటుంది.



మర్

భగవద్గీత

# రెండవ అధ్యాయము

# సాంఖ్యయోగము



అర్జునా! కర్మలు చేయుట యందే నీకు అధికారం ఉంది కాని ఫలితము పై కాదు. నీవు ఫలితం ఆశించి పని చేయవద్దు. అలాగని కర్మలు చేయడం మానకూడదు. ఫలమును, ఆసక్తిని విడిచి, ఫలము సిద్ధించినా, సిద్ధించక పోయినా సమబుద్ధితో ఉండు. ఇలాంటి సమబుద్ధినే యోగమని చెప్పబడింది. యోగనిష్ఠలో ఉండి కర్మలను ఆచరించు. ఫలితం ఆశించి చేసే పని అత్యంత హీనమయినది. సమత్వబుద్ధి కలవాడు పుణ్య, పాపాలను ఈ లోకంలోనే విడిచి పెడతాడు. అందుచేత నీవు నిష్కామ కర్మ యోగాన్నే ఆచరించు.

సమబుద్ధి కలవారు తాము చేసిన పనులవలన వచ్చిన ఫలితమును విడిచి జన్మ బంధాల నుండి విముక్తులై దుఃఖ రహితమైన స్థానమును పొందుచున్నారు. నీ బుద్ధిని ఆత్మ యందు నిశ్చలంగా నిలపాలి. అప్పుడే యోగాన్ని
పొందగలవు.

## నీ స్థితప్రజ్ఞుడు ఎలా ఉంటాడు? అతని లక్షణాలు ఏమిటి?

అప్పుడు అర్జునుడు

హే కృష్ణా! సమాధి యందు స్థిరబుద్ధి గలవారు ఎలా మాట్లాడతారు? ఎలా కూర్చుంటారు? ఎలా సంచరిస్తారు? అసలు స్థితప్రజ్ఞుని లక్షణాలు ఏమిటి ? అని అడిగాడు.

## భగవానుడు చెబుతున్నాడు.

ఓ పార్థా! ఎవరైతే మనస్సులోని సమస్త కోరికలను విడిచిపెట్టి ఆత్మ చేత, ఆత్మ లోనే సంతోషిస్తూ ఉంటాడో అలాంటి వాడిని స్థితప్రజ్ఞుడు అంటారు.



భగవద్గీత

# రెండవ అధ్యాయము
# సాంఖ్యయోగము



దుఃఖం వచ్చినప్పుడు కలతచెందని వాడు, సుఖాలపై ఆసక్తి లేనివాడు, అనురాగము, భయము, క్రోధము లేని వాడిని స్థితప్రజ్ఞుడు అంటారు. అతడికి దేనితోను అనుబంధం ఉండదు. శుభం కలిగినప్పుడు సంతోషం, అశుభం పొందినప్పుడు ద్వేషం కలగదు. అతడి జ్ఞానం స్థిరమైనది. తాబేలు తన అవయవాలను లోనికి ముడుచుకున్నట్లు స్థితప్రజ్ఞుడు కూడా తన ఇంద్రియాలను విషయాల నుండి వెనుకకు మరల్చుకుంటాడు. అతని జ్ఞానం చలించనిది. ఇంద్రియాలను నిగ్రహించుకున్న మనిషిని ఇంద్రియ విషయాలు అంటకపోయినా అతడికి వాటి పట్ల ఆసక్తి పోదు. కాని పరమాత్ముడిని తెలుసుకున్నప్పుడు అవి తొలగిపోతాయి.

## ఇంద్రియాలను నిగ్రహించుకోవడం వలన ఉపయోగం ఏమిటి?

కౌంతేయా! ఎంత ప్రయత్నించినా విద్వాంసుడైన పురుషుని ఇంద్రియాలు (కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మము) మనస్సును బలవంతంగా ఆకర్షిస్తూ ఉంటాయి. అలాంటప్పుడు ఇంద్రియాలనన్నింటినీ నిగ్రహించి ఏకాగ్ర బుద్ధికలిగి నా యందే దృష్టి నిలిపి నిశ్చలమైన మనస్సు కలిగి ఉండాలి. ఎందుకంటే ఎవరికి ఇంద్రియాలు వశపడతాయో వారి జ్ఞానము సుస్థిరమైనది.

ఇంద్రియ విషయముల గురించి అదే పనిగా ఆలోచిస్తూ ఉంటే వాటి యందు మనిషికి ఆసక్తి ఏర్పడుతుంది. ఆసక్తి వల్ల కోరిక పుడుతుంది. కోరిక వలన క్రోధం జనిస్తుంది. క్రోధం వల్ల మోహం కలుగుతుంది. మోహం వల్ల స్మృతి నశిస్తుంది. దాని వలన బుద్ధి నశించి చివరికి మనిషి నాశనమైపోతాడు.

రాగద్వేషాల నుండి విడివడి మనస్సును స్వాధీనపరచుకొని తనకు వశమైన ఇంద్రియములచేత సుఖాన్ని అనుభవిస్తూ ఉండేవాడు ప్రశాంతంగా ఉండి శాంతిని పొందును. అలాంటి వానికి సమస్త దుఃఖాలు అంతరిస్తాయి.

అమరానాథ్ అమర్

# రెండవ అధ్యాయము
# సాంఖ్యయోగము






నిర్మలమైన మనస్సు గల వాని బుద్ధి వెంటనే ప్రశాంతతను పొందుతుంది. ఇంద్రియ నిగ్రహం లేనివానికి బుద్ధి నిలకడగాఉండదు. సంయమన శక్తి లేనివానికి ఆత్మ నిష్ఠ ఉండదు. ఆత్మ భావన లేనివానికి శాంతి మిగలదు. శాంతి లేని వానికి సుఖం ఎలా లభిస్తుంది? (అనగా లభించదు).

ఎవరి మనస్సు ఇంద్రియ విషయాల వైపు పరుగు పెడుతూ ఉంటుందో అట్టి మనస్సు ఆ మానవుని యొక్క బుద్ధిని హరించి వేస్తుంది.ఎలాగంటే నీటిలో పయనించే నావను గాలి పెడదారి పట్టించినట్లు. కాబట్టి ఎవని ఇంద్రియాలు ఇతర విషయాల నుండి నిగ్రహింపబడునో వాని బుద్ధి సుస్థిరంగా ఉంటుంది. సర్వ ప్రాణులకు ఏది రాత్రియో అప్పుడు యోగి మేల్కొని ఉంటాడు. ఎప్పుడు సర్వ ప్రాణులు మేల్కొని ఉంటాయో అది పరమార్థ తత్వాన్ని చూస్తున్న మునికి రాత్రి.

ఎంత నీరు ప్రవేశిస్తున్నా సముద్రం స్థిరంగా ఉంటుంది. అలాగే ఎన్ని కోరికలు తనలోకి


అమరానాథ్ అమర్

భగవద్గీత

# రెండవ అధ్యాయము
# సాంఖ్యయోగము



**ప్రవేశిస్తున్నా ముని యొక్క మనస్సు చలించదు. విషయ లోలుడికి శాంతి ఉండదు. కాబట్టి ఏ పురుషుడు సమస్తములైన కోరికలను విడిచి వాటి యందు స్పృహ లేకుండా, మమకారం, అహంకారం లేకుండా ఉంటాడో అతడే శాంతిని పొందుతాడు.**




పార్థా! దీనినే బ్రహ్మ రూపస్థితి అంటారు. దానిని పొందిన వాడు తిరిగి మోహం పొందడు. మరణ సమయంలో కూడా ఆ బ్రహ్మ స్థితిలో నిలచి బ్రహ్మానందమును పొందుతాడు.

**ఈ విధంగా ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు సాంఖ్యయోగము అనే 2 వ అధ్యాయము సమాప్తము.**

భగవద్గీత

# మూడవ అధ్యాయము
# కర్మయోగము



**అర్జునుడు ఇలా అడుగుతున్నాడు.**

జనార్ధనా! కర్మ కంటే జ్ఞానం శ్రేష్ఠమని నీ అభిప్రాయమా? మరి భయంకరమైన యుద్ధము చేయమని నాకెందుకు చెబుతున్నావు. సందేహంగా వున్న నీ మాటలు నా బుద్ధిని కలవరపెడుతున్నవి. నేను దేనివలన శ్రేయస్సు పొందుతానో ఆ ఒక్క దానినే నిర్ణయించి చెప్పు.

**అప్పుడు భగవానుడు**

పార్థా! జ్ఞానులకు జ్ఞాన యోగము, యోగులకు కర్మ యోగము అనే రెండు అనుష్ఠాన పద్ధతులను నేను పూర్వమే చెప్పియున్నాను. మానవుడు తాను చేయవలసిన పనులను మానేసినంత మాత్రాన అతడు నిష్క్రియమైన స్థితిని పొందడు. అలా అని సన్యసించినంత మాత్రమున సిద్ధిని పొందలేడు. సహజంగా ఏ కర్మ చేయకుండా ఎవ్వడూ ఒక్కక్షణం కూడా ఉండలేడు. ప్రకృతి సిద్ధమైన గుణముల చేత ప్రతివాడు అస్వతంత్రుడై కర్మలు చేస్తున్నాడు.




అమరనాథ్ అమర్

భగవద్గీత

# మూడవ అధ్యాయము
# కర్మయోగము



## కర్మలను ఎందుకు చేయాలి?

కర్మేంద్రియములను అణచి పెట్టానని చెప్పుకుంటూ మనస్సులో మాత్రం ఇంద్రియ విషయాలనే చింతిస్తూ ఉంటాడో అలాంటి వాడు వివేకశూన్యుడు, కపటి అని చెప్పబడు తున్నాడు. కాని ఎవడైతే తన మనస్సు చేత ఇంద్రియాలను నియంత్రించి ఆసక్తి లేకుండా పనులు (కర్మలు) చేస్తాడో అతడు శ్రేష్ఠుడు. నీవు చేయవలసిన పనులను చెయ్యి. పని చేయకుండా ఉండే కన్నా పనిచేయటం శ్రేష్ఠము. నీవు పనులు చేయక పోతే శరీర యాత్ర కూడా జరగదు. అర్జునా ! భగవంతుని కొరకు చేసే కర్మలు తప్ప మిగిలిన ఏ కర్మ చేసినప్పటికి ఆ పనులన్నీ బంధాలకు కారణమవుతాయి. కాబట్టి ప్రతి పని భగవంతునికి అర్పించి అనాసక్తుడవై కర్మలను ఆచరించు.

## యజ్ఞం ఎందుకు చేయాలి?

పూర్వము బ్రహ్మదేవుడు యజ్ఞములతో సహా ప్రజలను సృష్టించి, యజ్ఞముల చేత మీరు వృద్ధిని సాధించండి. అవి మీ కోరికలను తీరుస్తాయి అని చెప్పినాడు. యజ్ఞము చేత మీరు దేవతలను తృప్తి పరచండి. ఆ దేవతలు కోరిన వరాలనిచ్చి తిరిగి మిమ్మల్ని తృప్తి పరుస్తారు. ఇలా పరస్పరము తృప్తి పరచుకొంటూ ఉంటే పరమ శ్రేయస్సును పొందుతారు.యజ్ఞము చేత తృప్తి చెందిన దేవతలు మీ కోరికలను తీరుస్తారు. వారిచేత ప్రసాదించబడిన వాటిని తిరిగి దేవతలకు సమర్పించకుండా ఎవడైతే భుజిస్తాడో వాడు దొంగ అవుతాడు. ఎవరైతే తమ శరీర పోషణకు మాత్రమే వండుకుతింటున్నారో వారు పాపాత్ములు, వారు తినేది కూడా పాపాన్నే. యజ్ఞశేషమును (యజ్ఞ ప్రసాదము) ఆరగించు సత్పురుషులు సమస్త పాపముల నుండి ముక్తులౌతారు.





ఫ్ అమర్

భగవద్గీత

# మూడవ అధ్యాయము
# కర్మయోగము






ఆహారము వలన సమస్త ప్రాణులు జన్మిస్తున్నాయి. వర్షం వలన ఆహారం ఉత్పన్నం అవుతుంది. యజ్ఞము వలన వర్షం పుడుతుంది. యజ్ఞము కర్మ వలననే సాధ్యపడుతుంది. ఆ కర్మ వేదముల వలన కలుగుతుంది. వేదములు అక్షర రూపుడైన పరమాత్మ నుండి ఉత్పన్నమైనాయి. అందువలన సర్వవ్యాపకమైన పరమాత్మ ఎల్లప్పుడు యజ్ఞమునందు ప్రతిష్ఠితమై ఉంటుంది.

అర్జునా! ఈ విధంగా తిరుగుతున్న సృష్టి చక్రమును ఈ లోకములో ఎవడు అనుసరించి జీవించడో వాడు పాప జీవనుడై, ఇంద్రియలోలుడై వ్యర్థముగా జీవించుచున్నాడు.
ఏ మానవుడైతే తన ఆత్మ యందే ప్రీతి కలవాడై, ఆత్మ చేతనే తృప్తి పొందుతూ, ఆత్మ యందే సంతోషపడుతూ ఉంటాడో అతనిని ఆత్మజ్ఞాని అంటారు. అతను ఈ లోకములో కర్మలు చేయుట వలన కాని, కర్మలు చేయకుండుటవలన కాని అతనికి ప్రయోజనం ఏమీ ఉండదు. అతను సర్వ ప్రాణుల యందు లాభాన్ని ఆశించి ఆశ్రయించడు.
అందుచేత నువ్వు ఫలాపేక్ష లేకుండా చేయదగిన పనులను చక్కగా ఆచరించు.

భగవద్గీత

# మూడవ అధ్యాయము

# కర్మయోగము



ఫలాపేక్ష లేకుండా కర్మలను ఆచరించేవాడు మోక్షమును పొందుతాడు. జనకుడు మొదలైనవారు కర్మల చేతనే సిద్ధిని పొందారు కదా. నీవు కూడా లోకహితమును దృష్టిలో ఉంచుకొని కర్మలను ఆచరించడమే మంచిది.

శ్రేష్ఠులు దేనిని ఆచరిస్తారో ఇతరులు కూడా దానినే ఆచరిస్తారు. శ్రేష్ఠులు దేనిని ప్రమాణముగా గ్రహిస్తారో దానినే లోకము కూడా ప్రమాణంగా అనుసరిస్తుంది.




పరమాత్మ కూడా కర్మలను ఎందుకు అచరిస్తున్నాడు ?

అమరానాథ్ అమర్

# భగవద్గీత

# మూడవ అధ్యాయము

# కర్మయోగము



పార్థా! ముల్లోకాలలో నేను చేయవలసిన పని అంటూ ఏదీలేదు. నేను పొందనిది, పొందవలసినదీ కూడా లేదు. అయినా నేను నిరంతరం కర్మలను చేస్తూనే ఉంటాను. కాని నేను ఎప్పుడైతే కర్మలను ఆచరించకుండా ఉ ంటానో మనుషులు కూడా ఏ పని చేయకుండా నా మార్గమునే అనుసరిస్తారు. నేను కర్మలు చేయనిచో ఈ లోకములు నశిస్తాయి. ఈ ప్రజలను చెడగొట్టిన వాడనవుతాను. అర్జునా! అవివేకులు ఏవిధంగా ఫలాపేక్షతో కర్మలను ఆచరిస్తారో అలాగే జ్ఞానులు లోకకళ్యాణం కొరకు ఫలాపేక్ష లేకుండా పనులు చెయ్యాలి.

జ్ఞాని అయినవాడు అజ్ఞానులు బుద్ధిని కలత పెట్టకుండా, తాను సమస్త కర్మలను నేర్పుతో ఆచరిస్తూ అజ్ఞానులు కూడా ఆచరించేటట్లు చూడాలి. మన చేత చేయబడే కర్మలన్నీ ఏ విధంగా చూచినా ప్రకృతి యొక్క గుణముల చేతనే చేయ బడుతున్నవి. కానీ అహంకారి, వివేకహీనుడు అయినవాడు తానే అన్ని కర్మలకు కర్తగా భావిస్తూ ఉంటాడు.

అల్పజ్ఞులైన మందమతులు ప్రకృతి యొక్క గుణములచేత మోహితులై పనులు చేయకుండా ఉంటారు. అలాంటి వారిని విద్వాంసులు కలత పెట్టకూడదు. అర్జునా! సమస్త కర్మలను ఆధ్యాత్మిక మనస్సుతో నాయందు ఉ ంచి ఆశ, మమకారము, దుఃఖము లేనివాడిపై యుద్ధము చేయుము. ఎవరైతే శ్రద్ధకలవారై, అసూయలేనివారై అభిప్రాయమును ఎల్లప్పుడూ అనుసరిస్తారో వారు కర్మల నుండి విడువపడతారు. ఎవరైతే అజ్ఞానంతో, అసూయతో, అవివేకంతో నా అభిప్రాయమును అనుసరించరో వారు చెడిపోయిన వాళ్ళుగా తెలుసుకో. జ్ఞానవంతుడు కూడా తన స్వభావానికి తగినట్లుగా ప్రవర్తిస్తాడు. ప్రాణులు తమ తమ స్వభావాలనే పొందుతూ ఉంటాయి.

ప్రతి ఇంద్రియమునకు దానికి సంబంధించిన ఇంద్రియ విషయముల యందు రాగ, ద్వేషములు ఏర్పడి ఉన్నాయి. ఆ రాగ, ద్వేషములకు వశపడకూడదు. అవి సాధకునికి శత్రువులు.














# మూడవ అధ్యాయము
# కర్మయోగము



చక్కగా ఆచరించబడే ఇతర ధర్మముకన్నా గుణము లేనిదైనా స్వధర్మమే మేలు. స్వధర్మము నందు మరణమైనా మంచిదే పరధర్మము భయాన్ని కలిగిస్తుంది.

**కామము, క్రోధము వలన కలిగే ఫలితాలు ఏమిటి?**


**అప్పుడు అర్జునుడు**

ఓ కృష్ణా! మానవుడు తనకు ఇష్టంలేకున్నా కూడా బలవంతంగా ఆజ్ఞాపించబడినట్లు పాపాలు చేస్తున్నాడు. మనిషిని అలా ప్రేరేపించేది ఏది?

**దానికి భగవానుడు ఇలా వివరిస్తున్నాడు.**

దానికి కారణం రజోగుణము. రజోగుణము వలన పుట్టినవే కామము, క్రోధము. అవి ఎన్నడూ తృప్తి చెందవు.పొగచేత అగ్ని, ధూళి చేత అద్దము, మావిచేత గర్భము నందలి శిశువు కప్పబడినట్లుగానే కామము, క్రోధము చేత జ్ఞానము కప్పబడి ఉంటుంది.






అమరనాథ్ అమర్

భగవద్గీత


# మూడవ అధ్యాయము
# కర్మయోగము



అర్జునా! కామము ఎన్నటికీ తీరనిది, అగ్నిలాగా తృప్తిచెందనిది. జ్ఞానికి నిత్య శత్రువు అయిన కామముతోనే జ్ఞానం కప్పబడిఉంది. ఈ కామానికి ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి నివాస స్థానములు. ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి చేత కామము జ్ఞానాన్ని కప్పి జీవుడికి మోహన్ని కలిగిస్తుంది. అందువలన మొదట ఇంద్రియాలను నియంత్రించుకొని జ్ఞాన, విజ్ఞానములను నాశనం చేసే పాప స్వభావం కలిగిన కామమును అవశ్యంగా విడిచిపెట్టు. దేహము కంటే ఇంద్రియములు గొప్పవి, ఇంద్రియముల కంటే మనస్సు గొప్పది, మనస్సుకంటే బుద్ధి గొప్పది, బుద్ధి కంటే గొప్పవాడు ఎవరో తెలుసా? ఆత్మ అని చెబుతారు. ఈ విధంగా ఆత్మను బుద్ధి కంటే శ్రేష్ఠమైనదిగా తెలుసుకొని, బుద్ధిని మనస్సుతో నిగ్రహించి, జయింప శక్యము కాని కామరూప శత్రువును సంహరించు.

ఈ విధంగా ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన శ్రీమద్భగవద్గీత యందు కర్మ యోగము అనే 3వ అధ్యాయము సమాప్తము.






అమరనాథ్ అమర్

శ్రీమద్భగవద్గీత

# నాలుగవ అధ్యాయము
# జ్ఞాన యోగము



**శ్రీ భగవానుడు ఇట్లు పలికెను.**

నేను శాశ్వతమైన ఈ యోగమును మొదట సూర్యునకు తెలిపితిని. సూర్యుడు తన పుత్రుడైన వైవస్వత మనువునకు దీనిని బోధించెను. ఆ మనువు తన కుమారుడైన ఇక్ష్వాకునకు ఉపదేశించెను. ఈ విధంగా పరంపరగా వస్తున్న ఈ యోగమును రాజర్షులు తెలుసుకున్నారు. కాని అనంతరము ఈ యోగము కాలక్రమమున భూలోకము నందు క్షీణించినది. ఈ యోగము ఉత్తమమైనది మరియు రహస్యముగా ఉంచదగినది. నీవు నా భక్తుడవు, స్నేహితుడవు కనుక మిక్కిలి పురాతనమైన ఈ యోగమును నేను నీకు తెలుపుచున్నాను

అది వినిన అర్జునుడు

కృష్ణా! నీ జన్మ ఇటీవలిది. సూర్యుని జన్మ కల్పాది యందు జరిగినది. అనగా అతి ప్రాచీనమైనది. నీవు సూర్యునకు ఈ యోగము ఉపదేశించావు అనేది నేను ఎట్లా నమ్మగలను? అని అడిగెను.

అప్పుడు శ్రీకృష్ణ భగవానుడు

ఓ అర్జునా! నాకును, నీకును పెక్కు జన్మలు గతించినవి. వాటినన్నింటిని నేను ఎరుగుదును. కాని నీవు ఎరుగవు. కారణం నేను జన్మ రహితుడను, నిత్యుడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను. అయినను ప్రకృతిని నా ఆధీనములో ఉంచుకొని నా మాయ చేతనే నేను అవతరిస్తున్నాను.

భగవానుడు ఎప్పుడు అవతరిస్తాడు?



# నాలుగవ అధ్యాయము
## జ్ఞాన యోగము






ధర్మమునకు హాని కలిగినప్పుడు, అధర్మము పెచ్చు పెరిగి పోతున్నప్పుడు సత్పురుషులను రక్షించి, దుష్టులను, పాపులను రూపు మాపుటకు మరియు ధర్మమును సుస్థిరమొనర్చుటకు ప్రతి యుగమునందు నేను అవతరిస్తూ ఉంటాను.

నా జన్మలు, కర్మలు దివ్యములని ఎరిగిన వారు మరణించిన తరువాత మరుజన్మ లేకుండా నన్నే చేరుతారు. ఇదివరలో కూడా ఎక్కువ మంది భక్తులు రాగ, భయ, క్రోధ రహితులై ధృడమైన భక్తి భావముతో నన్ను ఆశ్రయించి జ్ఞానరూప తపస్సుచే పవిత్రులై నా స్వరూపమును పొంది యుండిరి. భక్తులు నన్ను ఎట్లా సేవింతురో ఆ విధంగానే నేను కూడా వారిని అనుగ్రహింతును. మనుష్యులందరూ వివిధ రీతులలో నా మార్గమునే అనుసరింతురు. ఈ లోకంలో కర్మ ఫలమును ఆశించువారు ఇతర దేవతలను పూజింతురు. అలా చేయడం వలన వారికి సిద్ధి త్వరగా లభిస్తుంది. నాగుణ కర్మలను అనుసరించి నాలుగు వర్ణములను నేను సృష్టించితిని. అవి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణములు. ఈ సృష్టికి నేను కర్తను, శాశ్వతుడను అయినప్పటికి

శ్రీమద్భగవద్గీత

# నాలుగవ అధ్యాయము
# జ్ఞాన యోగము



నన్ను అకర్తగా తెలిసికొనుము. నాకు కర్మఫలాసక్తి లేదు. కావున కర్మలు నన్నంటవు. ఈ విధముగా నా తత్త్వమును తెలిసినవారు కర్మ బద్ధులు కారు. కర్మలు ఎన్ని రకాలు వాటి లక్షణాలు ఏమిటి?

అర్జునా! ప్రాచీనులైన ముముక్షువులు నా తత్త్వ రహస్యమును తెలిసికొని కర్మలను ఆచరించిరి. కావున నీవును ఆ పూర్వులవలెనే నిష్కామ భావముతో కర్మలను ఆచరింపుము. కర్మ అనగానేమి? అకర్మ అనగా నేమి? అనే విషయమును నిర్ణయించుటలో విద్వాంసులు కూడా భ్రాంతికి లోనగుచున్నారు. కావున కర్మ తత్త్వమును చక్కగా విశదపరచెదను. దానిని తెలుసుకొని నీవు కర్మ బంధము నుండి ముక్తుడవయ్యెదవు. దాని కన్నా ముందు నీకు అసలు కర్మతత్త్వము, అకర్మ స్వరూపము మరియు వికర్మ లక్షణములను కూడా తెలుసుకొనుట చాలా అవసరం. ఎందుకనగా కర్మ తత్త్వము అతి నిగూఢమైనది, తెలుసుకొనుట కష్టం. కర్మ యందు అకర్మను, అకర్మ యందు కర్మను దర్శించువాడు బుద్ధిమంతుడు. అతడు అన్ని పనులు చేయసమర్థత కలిగిన యోగి.

ఎవరి కర్మలు శాస్త్ర సమ్మతములై కోరిక, సంకల్పము లేకుండా ఉంటాయో, ఎవరి కర్మలు జ్ఞానాగ్నిలో భస్మమగునో అట్టి మహాపురుషుడిని పండితుడని అంటారు. చేసే ప్రతి కర్మయందు ఫలాపేక్ష వదిలి నిరాశ్రయుడై పరమాత్మయందే నిరంతరం సంతృప్తి కలిగినవాడు, అంతఃకరణమును శరీరేంద్రియములను జయించినవాడు, సమస్త భోగసామాగ్రిని పరిత్యజించినవాడు, కర్మల యందు పూర్తిగా లీనమైనప్పటికి అతడు పాపము పొందడు. వాస్తవముగా తాను చేసిన కర్మలకు అతడు కర్తకాడు. తాను కోరుకోకుండానే లభించిన దానితో సంతుష్టుడైనవాడు, అసూయ లేనివాడు, ద్వంద్వములు లేకుండా సమదృష్టి కలిగియుండు కర్మ యోగి కర్మలను ఆచరించినను వాటి బంధములలో చిక్కుకోడు. ఎలాగంటే ఆసక్తి, దేహాభిమానము, మమకారము లేకుండా పరమాత్మ యందే నిరంతరం మనస్సు నిల్పి, కేవలము యజ్ఞము కొరకే ఆచరించు కర్మలు అన్నియు దేవుని యందు లీనమగును.

యజ్ఞము నందు వినియోగించు సాధనములు, హోమము చేయబడు ద్రవ్యములు, అగ్నియు, యజ్ఞము ఆచరించు కర్త, హవన క్రియ కూడా బ్రహ్మము లోని అంతర్భాగములే. ఈ బ్రహ్మ కర్మ యందు స్థితుడై యుండు యోగి ద్వారా పొందదగిన యజ్ఞ ఫలముకూడా బ్రహ్మమే.

అమరానాథ్ అమర్

# శ్రీమద్భగవద్గీత

# నాలుగవ అధ్యాయము

# జ్ఞాన యోగము






కొందరు యోగులు యజ్ఞానికి ఫలితం ఆశించకుండా తాము కోరుకునే ఫలాన్ని బ్రహ్మాగ్నిలో హోమం చేస్తారు. కొందరు బ్రహ్మవేత్తలు బ్రహ్మ అనే అగ్నిలో ఆత్మ చేతనే హోమం చేస్తారు. నిష్ఠ కలిగిన యోగులు కొందరు మనో నిగ్రహము ద్వారా ఇంద్రియాలను అదుపుచేయుదురు. ఇంద్రియ క్రియలను, ప్రాణముల క్రియలను అన్నింటిని జ్ఞానముచే ప్రకాశితమైన ఆత్మసంయమ యోగ రూపాగ్నిలో హవనము చేయుదురు.

**యజ్ఞములు ఎన్ని రకాలు? వాటి ఉపయోగాలు ఏమిటి?**

కొందరు ద్రవ్య సంబంధ యజ్ఞములను, తపోరూప యజ్ఞములను, యోగరూప యజ్ఞములను, అహింస అనే తీవ్ర వ్రతమును, మరికొందరు స్వాధ్యాయమనే జ్ఞాన యజ్ఞమును ఆచరిస్తారు. కొందరు ఉచ్ఛ్వాసలను నిశ్వాసలలోను, నిశ్వాసలను ఉచ్ఛ్వాసలలోను అర్పిస్తారు. మరికొందరు ఉచ్ఛ్వాస నిశ్వాసలను బంధించి సమాధిలో నిలుస్తారు. కొందరు నియమిత ఆహారులై ప్రాణ వాయువును

# నాలుగవ అధ్యాయము
# జ్ఞాన యోగము



ప్రాణ వాయువు నందే హవనము చేస్తారు. ఈ సాధకులందరును పాపమును పోగొట్టుకొని యజ్ఞశేషమనే అమృతమును భుజించుచు పరమాత్మను పొందుచున్నారు. అసలు యజ్ఞమే చేయనివారికి ఈ లోకములో సుఖము లభించదు. ఇక పరలోక విషయము చెప్పనేల? ఇలాంటి అనేక రకములైన యజ్ఞములు వేదములలో విస్తృతముగా వివరించబడినవి. ఈ యజ్ఞములన్నియు త్రికరణ శుద్ధి (మనస్సు, వాక్కు, కర్మలు) గా ఆచరించినప్పుడే అవి ఫలితములు ఇస్తాయని తెలుసుకొని బంధముల నుండి విముక్తుడవు కావలయును. అర్జునా ద్రవ్యములతో ఆచరించబడు యజ్ఞము కంటె జ్ఞాన యజ్ఞము మిక్కిలి శ్రేష్ఠమైనది. కర్మలన్నియు జ్ఞానము నందే పరిసమాప్తమగును.














అమరానాథ్ అమర్

# శ్రీమద్భగవద్గీత

# నాలుగవ అధ్యాయము

# జ్ఞాన యోగము






జ్ఞానము పొందడం ఎలా ?

తత్త్వమును దర్శించిన జ్ఞానుల (గురువుల) దగ్గరకు వెళ్ళి వారికి ప్రణమిల్లి, సేవచేసి నియమముతో ప్రశ్నించుటవలన ఆ తత్త్వజ్ఞానమును నీవు తెలుసుకొనగలవు.

అర్జునా! ఈ తత్త్వజ్ఞానమును తెలుసుకున్న తరువాత మరలా మోహము పొందవు. ఆ జ్ఞాన ప్రభావముతో సమస్త ప్రాణులను నీయందు తరువాత పరమాత్మ అయిన నాయందును చూడగలవు. ఒక వేళ నీవు పాపాత్ములందరి కన్నా మహాపాపివి అయినప్పటికీ జ్ఞానము అనే నౌక సహాయంతో పాప సముద్రము దాటగలవు. మండుచున్న అగ్ని సమిధలను భస్మముచేసినట్లు జ్ఞానమను అగ్ని కర్మలనన్నింటిని భస్మమొనరించును. ఈ లోకములో జ్ఞానముతో సాటియగు పవిత్రమైనది మరొకటిలేదు. కర్మయోగ సాధనచేస్తూ ఉంటే కొంత కాలమునకు తన ఆత్మయందు అదే జ్ఞానమును సాధకుడు తనంతటతానే పొందగలడు.

జితేంద్రియుడుకి, సాధన చేసేవాడికి, శ్రద్ధకల వాడికి జ్ఞానము లభించును. ఆ జ్ఞానము కలిగిన వెంటనే అతడు పరమశాంతిని పొందును. అవివేకి, శ్రద్ధలేనివాడు అయిన సంశయాత్ముడు భ్రష్టుడై నశించును. అలాంటి సంశయాత్ములకు ఈ లోకములో కాని, పరలోకంలో కాని

అమరానాథ్ అమర్

# నాలుగవ అధ్యాయము
# జ్ఞాన యోగము




సుఖము ఉండదు. ధనుంజయా! చేయవలసిన కర్మలను ఆచరించుచు, కర్మ ఫలములన్నింటిని భగవంతుడికి అర్పణచేయుచు. వివేకము ద్వారా అనుమానములన్నింటిని తొలగించుకొనుచు, అంతఃకరణమును వశము నందుంచుకొనిన వానిని కర్మలు బంధించలేవు. కావున అర్జునా! నీ హృదయము నందు గల అజ్ఞానజనితమైన అనుమానములను వివేకజ్ఞానమను ఖడ్గముతో రూపుమాపి యోగము నందు స్థితుడవై యుద్ధము చేయుటకై లెమ్ము.

ఈ విధంగా ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన శ్రీమద్భగవద్గీత యందు జ్ఞాన కర్మ సన్యాస యోగము అనే 4 వ అధ్యాయము సమాప్తము.





భగవద్గీత

# ఐదవ అధ్యాయము
# కర్మసన్యాసయోగము



**అర్జునుడు భగవానునితో ఇలా అడుగుచున్నాడు.**

కృష్ణా! ఒకసారి కర్మ సన్న్యాసమును, మరియొకసారి కర్మ యోగమును ప్రశంశించుచున్నావు. ఇంతకి ఆ రెండింటిలో నాకు ఏది శ్రేయస్సు కలిగిస్తుందో దానిని నిశ్చయించి చెప్పుము.

**కర్మ, సన్న్యాస యోగములలో ఏది శ్రేష్ఠము?**

అప్పుడు భగవానుడు
అర్జునా! కర్మ సన్న్యాసము మరియు కర్మ యోగము అను ఈ రెండును పరమ కళ్యాణదాయకములే కాని ఈ రెండింటిలో కర్మ సన్న్యాసము కంటెను కర్మ యోగము శ్రేష్ఠము. ఎవ్వరినీ ద్వేషింపని, దేనిని కాంక్షింపని వానిని నిత్య సన్న్యాసిగా తెలుసుకొనుము. ఎందుకనగా రాగ ద్వేషాది ద్వంద్వములను అధిగమించినవాడు అవలీలగా సంసార బంధముల నుండి విముక్తుడవుతాడు.
మూర్ఖులు కొందరు, కర్మ సన్న్యాసము మరియు కర్మ యోగము వేరని చెబుతుంటారు. కాని పండితులు అలా పలకరు. ఎందుకంటే ఆ రెండింటిలో ఏ ఒక్క దానినైనా చక్కగా ఆచరించినవాడు ఈ రెండింటి ఫలమైన పరమాత్మను పొందుతాడు. జ్ఞాన యోగులు పొందు మోక్షమును కర్మ యోగులు కూడా పొందుదురు. జ్ఞాన, కర్మ యోగములను ఒక్కటిగా చూచువాడే నిజమైన ద్రష్ట (దార్శనికుడు). కాని అర్జునా! కర్మ యోగము తెలియకుండా మనస్సు, ఇంద్రియములు, శరీరము ద్వారా జరుగు కర్మలన్నింటిని సన్న్యసించుట కష్టము. భగవంతుని రూపమును నిరంతరము మననము చేయు కర్మ యోగి పరబ్రహ్మ యగు పరమాత్మను శీఘ్రముగా పొందగలడు.

**యోగి యొక్క లక్షణాలు ఏమిటి?**




అమరానాథ్ అమర్

భగవద్గీత

# ఐదవ అధ్యాయము
# కర్మసన్యాసయోగము



మనస్సును వశమునందు ఉంచుకొనినవాడు, ఇంద్రియములను జయించినవాడు, అంతఃకరణశుద్ధి కలవాడు, సర్వ ప్రాణులలో ఆత్మ స్వరూపుడైన పరమాత్మను తన ఆత్మగా భావించుకుంటూ ఉంటాడు. అతను కర్మ చేయుచున్నను దానిచే బంధించబడడు.

తత్త్వజ్ఞుడైన యోగి చూచుచు, వినుచు, తాకుచు, వాసన చూస్తూ, తినుచూ, నడుస్తూ. నిద్రిస్తూ, శ్వాస క్రియలను చేస్తూ, మాటలాడుచూ, గ్రహిస్తూ, కనులు తెరుచుచు, మూయుచు ఉన్నను ఇంద్రియములు తమతమ విషయములయందు ప్రవర్తించుచున్నను తానేమియు చేయుటలేదనియే భావించును.

కర్మలన్నింటిని భగవంతునకు సమర్పించి, ఫలాపేక్ష లేకుండా కర్మలను ఆచరించువానికి తామరాకుపై నీటి బిందువులవలె పాపములు అతనిని అంటవు.

కర్మ యోగులు ఆసక్తిని త్యజించి కేవలం ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, శరీరముల ద్వారా అంత:కరణ శుద్ధికై కర్మలను ఆచరింతురు.

నిష్కామ కర్మ యోగి కర్మ ఫలములను త్యజించి శాంతిని పొందును. ఎవరైతే కర్మ ఫలాసక్తులై కోరికలతో కర్మలను ఆచరించుదురో, వారు బంధింపబడును.

అంత:కరణమును వశమునందుంచుకొని కర్మలను ఆచరింపక, నవద్వారములుగల ఈ శరీరమునందు సమస్త కర్మలను మానసికంగా త్యజించి దేవునిపై మనస్సు నిలిపి సుఖమును అనుభవించును. అసలు పరమేశ్వరుడు మానవుల యొక్క పాపములలోగాని, పుణ్యములలోగాని భాగస్వామికాడు. జ్ఞానము అజ్ఞానముచే కప్పబడియుండుటవలన జీవులు మోహంలో పడుతున్నారు. కాని వారి అజ్ఞానము పరమాత్మ జ్ఞానప్రాప్తి ద్వారా తొలగిపోవును. అప్పుడు వారిలో జ్ఞానము సూర్యునివలె ప్రకాశిస్తుంది. పరమాత్మయందే నిరంతరము మనోబుద్ధికలవారై జ్ఞానసాధనతో, పాపరహితులై పునర్జన్మ రహితమైన పరమగతిని పొందెదురు.




అమరానాథ్ అమర్

# భగవద్గీత

# ఐదవ అధ్యాయము

# కర్మసన్యాసయోగము




## సమదర్శన యోగము

జ్ఞానులు విద్యావినయ సంపన్నుడైన బ్రాహ్మణుని యందును, గోవు, ఏనుగు, కుక్క మొదలగు జంతువుల యందును, చండాలుని యందును సమదృష్టినే కలిగి ఉందురు. ఎవరి మనస్సు సమభావస్థితి కలిగి ఉంటుందో వారు ఈ జన్మ యందే సంపూర్ణ జగత్తును జయించిన వారగుదురు. పరమాత్మ దోష రహితుడు, అందరిని సమానంగా చూచువాడు. జ్ఞానులు సచ్చిదానంద ఘన పరమాత్మ యందు స్థితులు. కనుక వారు త్రిగుణాతీతులు మరియు జీవన్ముక్తులు.

లాభం వచ్చినప్పుడు పొంగిపోనివాడు, నష్టము వచ్చినప్పుడు కృంగిపోనివాడు, నిశ్చలబుద్ధికలవాడు, మోహమునకు లోనుకాని వాడు అయిన బ్రహ్మవేత్త, పరమాత్మ యందు ఎల్లప్పుడు ఏకీభావస్థితి యందుండును. ప్రాపంచిక విషయములందు అనాసక్తుడై ఆత్మ స్థితిని పొంది సుఖమును పొందుచూ ఎల్లప్పుడు ధ్యాన నిమగ్నుడై ఉంటాడు. పరమాత్మను ధ్యానించడం చేత అతడు అనంత ఆనందాన్ని అనుభవిస్తాడు.

## నిజమైన సుఖం ఎలా ఉంటుంది?

ఇంద్రియముల ద్వారా లభించు భోగములు సుఖముగా అనిపించినను అవి నిస్సందేహముగా దుఃఖమునకు కారణము అవుతాయి. అవి ఆది, అంతము కలవి. అనగా అనిత్యములు. కావున అర్జునా! వివేకము కలవాడు వాటియందు ఆసక్తుడు కాడు. ఈ శరీరమును విడవక ముందే కామము, క్రోధము, ఉద్వేగములను అదుపులో ఉంచుకొనగల సాధకుడే నిజమైన సుఖి మరియు యోగి.



భగవద్గీత

# ఐదవ అధ్యాయము
# కర్మసన్యాసయోగము




అంతరాత్మ యందే సుఖించువాడును, ఆత్మ యందే రమించువాడును, ఆత్మ జ్ఞాని అయిన యోగి పరమాత్మ యందు ఏకీభావ స్థితుడై బ్రహ్మమును చేరుకుంటాడు.

పాప రహితులును, జ్ఞానముచే సమస్త సందేహములు తొలగినవాడును, సర్వప్రాణుల హితమును కోరువాడును, మనస్సును పరమాత్మ యందు లగ్నము చేసిన యోగి, బ్రహ్మ నిర్వాణమును పొందును. కామ, క్రోధములను వదిలి ఆలోచనలను జయించి పరమాత్మ సాక్షాత్కారము పొందిన జ్ఞానులకు అంతటా పరమాత్మయే కనిపిస్తూ ఉంటాడు.

బాహ్య విషయములను గురించి ఆలోచించక వాటిని పారద్రోలి దృష్టిని భ్రూ మధ్యము నందు స్థిరముగా నిలిపి ముక్కులో ప్రసరించుచున్న ప్రాణ వాయువును సమస్థితిలో ఉంచవలెను. ఈ ప్రక్రియల ప్రభావముచే మనస్సు, బుద్ధి, ఇంద్రియములు సాధకుని వశములోనికి వచ్చును. ఇట్టి సాధన ద్వారా మోక్ష పరాయణుడైన ముని సదా ముక్తిని పొందును.

భగవంతుడు యజ్ఞమునకు, తపస్సునకు భోక్త. సమస్త లోకమునకు అధిపతి. ఆ భగవంతుని సకల ప్రాణులకు ఆత్మీయుడుగా తెలిసికొనిన జ్ఞాని పరమశాంతిని పొందును




ఈ విధంగా ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన శ్రీమద్భగవద్గీత యందు కర్మ సన్న్యాస యోగము అనే 5 వ అధ్యాయము సమాప్తము.

# భగవద్గీత **ఆరవ అధ్యాయము**
# ఆత్మ సంయమ యోగము



**శ్రీ భగవానుడు ఇలా చెబుతున్నాడు.**

ఎవరైతే కర్మ ఫలమును ఆశించకుండా చేయవలసిన పనులను ఆచరించునో అతడే నిజమైన సన్యాసి మరియు యోగి. కాని కేవలము అగ్నికార్యమును, విధ్యుక్త కర్మలను త్యజించినంత మాత్రమున యోగికాడు.
అర్జునా! సన్యాసము అని పిలువబడు దానినే యోగము అని తెలిసికొనుము. ఎందుకనగా సంకల్పమును త్యాగము చేయనివాడెవ్వడును యోగి కాజాలడు.

**ఎలాంటి యోగి శ్రేష్ఠుడు?**

యోగ సాధకునికి కర్మ ఒక సాధనం. యోగంలో ఉత్తీర్ణుడైన వానికి సన్యాసం (కర్మలు చేయకుండా ఉండటం) సాధన అవుతుంది. ఇంద్రియ భోగముల యందును, కర్మల యందును ఆసక్తుడుగాక, సర్వ సంకల్పములను త్యజించిన త్యాగిని యోగి అని చెప్పుదురు. ప్రతి వ్యక్తియు ఈ సంసార సాగరము నుండి తమను తామే ఉద్ధరించు కొనవలెను, కాని అధోగతిపాలు కారాదు. ఎందుకనగా లోకములో వాస్తవముగ తమకు తామే మిత్రులు, తమకు తామే శత్రువులు. ఇంద్రియములను జయించిన జీవుడు తనకు తానే మిత్రుడు. అలా జయింపనివాడు తనకు తానే శత్రువు. ఇంద్రియములు శత్రువువలె ప్రవర్తించి లక్ష్యసాధనకు అవరోధములుగా నిలుచును.




అమరనధ్ అమర్

భగవద్గీత **ఆరవ అధ్యాయము**

# ఆత్మ సంయమ యోగము



శీతోష్ణములు, సుఖ-దు:ఖములు, మాన-అవమానముల యందు చలింపక, ఆత్మను స్వాధీనమునందు ఉంచుకొని పరమాత్మపై మనసు నిలిపిన వాని అంతఃకరణమునందు జ్ఞానవిజ్ఞానములు నిండియుండును. అతడు వికారరహితుడు, ఇంద్రియాదులను వశపరచుకొనిన వాడు. మట్టిని, రాతిని, బంగారమును సమానముగాచూచును. మిత్రులయందును, ఉదాసీనుల యందును, మధ్యస్థుల యందును, బంధువుల యందును, సత్పురుషుల యందును, పాపుల యందును సమభావము కలిగినవాడు మిక్కిలి శ్రేష్ఠుడు. శరీర, ఇంద్రియములను స్వాధీన పరచుకొనినవాడు, ఆశారహితుడు, భోగసామాగ్రిని ప్రోగుచేయనివాడు అయిన యోగి ఒంటరిగా నిర్జన ప్రదేశమున కూర్చొని ఆత్మను నిరంతరము పరమాత్మ యందు లగ్నము చేయవలెను.

## ధ్యానము ఎలా చేయాలి?

పరిశుభ్రమైన ప్రదేశమున దర్భాసనమును, జింక చర్మమును, వస్త్రమును ఒకదానిపై ఒకటి పరచి, మరీ ఎక్కువగా లేక మరీ తక్కువగా కాకుండా సమానమైన ఎత్తులో స్థిరమైన ఆసనముపై కూర్చొని మనస్సు, ఇంద్రియములను వశము నందుంచుకొని, ఏకాగ్రత గల మనస్సుతో అంతఃకరణ శుద్ధికై ధ్యాన యోగమును సాధన చేయవలెను. శరీరమును, మెడను, శిరస్సును నిటారుగా స్థిరముగా నుంచి చూపులను ఏ దిక్కునకును పోనీయక తన నాసికాగ్రము నందే దృష్టిని నిలుపవలెను. అలాంటి ధ్యాన యోగి శాంతిని పొందును.

అర్జునా! అతిగా భుజించు వానికిని, ఏ మాత్రము భుజింపని వానికిని, అతిగా నిద్రించువానికిని, పూర్తిగా మేల్కొని ఉండు వానికిని యోగి అవడానికి అవకాశం లేదు. ఆహారవిహారాదుల యందును, కర్మ ఆచరణముల యందును, జాగృత, స్వప్నాదుల యందును యథా యోగ్యముగా ప్రవర్తించు వానికి దుఃఖము నాశనమై ధ్యానము సిద్ధించును.

www.sanatanadharm.com

అమరానాథ్ అమర్






చిత్తమును పూర్తిగా వశమునందుంచు కొని ఎల్లప్పుడు పరమాత్మ యందే స్థిరముగా నిలిపినప్పుడు సర్వభోగముల యందును స్పృహ రహితుడగును. అప్పుడు ఆ పురుషుడు యోగయుక్తుడు అనబడును. గాలి లేనిచోట నిశ్చలముగా నుండు దీపమువలె పరమాత్మపై ధ్యానము నిలిపిన మనస్సు నిశ్చలముగా నుండును.

### యోగము అంటే ఏమిటి? యోగికి ఆనందము ఎప్పుడు కలుగుతుంది?

ధ్యాన యోగ సాధనచే నిగ్రహింపబడిన మనస్సు, ఆత్మను ధ్యానించుట ద్వారా ఆత్మను సాక్షాత్కరింప చేసికొని, ఆనందమును పొందునో, ఆ స్థితిలో యోగి తన ఆత్మ యందే సంతోషముగా ఉండును.

ఆ బ్రహ్మానందమును అనుభవించుచు, దానియందే స్థితుడైయున్న యోగి పరమాత్మ స్వరూపము నుండి ఏ మాత్రమూ విచలితుడు కానేరడు. భగవత్ సాక్షాత్కారమును పొందినవాడు మరే ఇతర విషయములను దానికంటే అధికంగా తలంచడు.

బ్రహ్మానంద స్థితిలో ఉన్న యోగిని ఎంతటి తీవ్రమైన దుఃఖము అయినను ఏమియూ

# భగవద్గీత **ఆరవ అధ్యాయము**
# ఆత్మ సంయమ యోగము



చేయలేదు. దుఃఖరూప సంసారబంధము నుండి విముక్తిని కలిగించు ఈ స్థితిని యోగము అని అందురు. అట్టి యోగమును పట్టుదలతోను, విసుగులేని మనస్సుతోనూ సాధన చేయవలెను.

సంకల్పముల వలన కలిగిన కోరికలనన్నింటిని త్యజించి, మనస్సుతో ఇంద్రియములను నిగ్రహించి, క్రమక్రమముగా సాధన చేయుచూ, ఆనందము పొందవలెను. ధైర్యముతో, బుద్ధి బలముతో మనస్సును ఆత్మ యందు నిలిపి, మరి ఏ ఇతర విషయమును ఏమాత్రమూ స్మరించరాదు. నిలకడలేని చంచలమైన మనస్సు ఏ విషయాలపై పరిభ్రమిస్తుందో వాటినుండి మనస్సును మరల్చి దానిని పరమాత్మ యందే స్థిరముగా నిల్పవలెను. ఎలాగంటే ప్రశాంతమైన మనస్సు కలవాడును, పాపరహితుడును, ప్రాపంచిక కార్యముల యందు ఆసక్తి తొలగిన వాడును, పరమాత్మ యందు ఏకీభావమును పొందినవాడును, పాపరహితుడైన యోగి నిరంతరము ఆత్మను పరమాత్మ యందే లగ్నమొనర్చి అపరిమితమైన ఆనందమును పొందును. స్థిరమైన యోగి తన ఆత్మను సర్వప్రాణుల యందు, ప్రాణులన్నింటిని తన ఆత్మ యందు చూచును. అన్నింటిని సమభావంతో స్వీకరిస్తాడు. నన్ను సర్వత్రా చూసేవాడికి, నా యందు సమస్తాన్ని చూసేవాడికి నేను కనపడతాను. నేను అతడిని చూస్తాను. సమస్త ప్రాణుల యందు స్థితమైయున్న ఆత్మగా నన్ను భజించునో, అట్టి యోగి ఎల్లప్పుడు నాయందే ఉంటాడు. అర్జునా! సర్వ ప్రాణులను తనతో సమానంగా చూచువాడు, సుఖమును, దుఃఖమును సమానంగా చూచువాడు పరమశ్రేష్ఠుడు.

*మనస్సు ఎలాంటిది? దానిని నిగ్రహించుట ఎలా సాధ్యము?*

**అప్పుడు అర్జునుడు.**

మధుసూదనా! మనస్సు సహజముగా చంచలముగా ఉండు కారణమున నీవు చెబుతున్న సమ భావ యోగము యొక్కస్థితిని నేను తెలుసు కోలేకున్నాను. మనస్సు చంచలమైనది, పీడించే స్వభావం కలది, దృఢమైనది,
మిక్కిలి బలమైనది. కనుక దానిని నిగ్రహించుట, గాలిని ఆపుటవలె మిక్కిలి కష్టమని భావిస్తున్నాను అని అర్జునుడు అడిగినప్పుడు..

అమరానాథ్ అమర్

# భగవద్గీత **ఆరవ అధ్యాయము**
# ఆత్మ సంయమ యోగము






శ్రీకృష్ణ భగవానుడు

**కౌంతేయా! నిస్సందేహముగా మనస్సు చంచలమైనదే. దానిని వశపరచుకొనుట మిక్కిలి కష్టము. కాని అభ్యాసము, వైరాగ్యముల ద్వారా దానిని వశపరచుకొనుట సాధ్యమే. మనస్సును వశపరచుకొనని వానికి యోగ సిద్ధి కలుగుట కష్టము, కానీ ప్రయత్నశీలునకు సాధన ద్వారా మనస్సును వశపరచుకొనుట సాధ్యమే అనేది నా అభిప్రాయము. యోగ సాధన మధ్యలో మరణించిన వారి పరిస్థితి ఏమిటి?**

**మరలా అర్జునుడు**

**ఓ కృష్ణా! శ్రద్ధగా యోగసాధన చేయుచు మనస్సును వశపరచుకొనని కారణమున అవసాన దశలో మనస్సు చలించి ఆత్మ సాక్షాత్కారము పొందకయే మరణించిన ఆ సాధకుని గతియేమగును? అతడు భగవత్ప్రాప్తి మార్గము నుండి జారినవాడై,**

అమరానాథ్ అమర్

# భగవద్గీత **ఆరవ అధ్యాయము**
# ఆత్మ సంయమ యోగము



ఆశ్రయరహితుడై ఉభయ భ్రష్టుడై ఛిన్నా భిన్నమైన మేఘమువలె అధోగతి పాలుకాడు గదా! నా ఈ సందేహము తీర్చగలవాడివి నీవు తప్ప ఇంకెవ్వరూ లేరు.

అర్జునుడు అడిగిన ప్రశ్నకు శ్రీకృష్ణ భగవానుడు ఇలా చెప్పెను

పార్థా! యోగసాధన చేసినవాడు ఈ లోకమునగాని, పరలోకమునగాని అధోగతి పాలుకాడు. ఎలాగంటే భగవంతుని కొరకు కర్తవ్య కర్మలను ఆచరించు వాడెవ్వడూ అధోగతి పాలుకాడు.

యోగభ్రష్టుడు అయినవాడు పుణ్యాత్ములు పొందు లోకములకు పోయి అక్కడ అనేక సంవత్సరాలు గడిపిన తరువాత సంపన్నుల ఇంటిలో తిరిగి జన్మించును లేదా పుణ్య లోకములకు వెళ్ళకుండా జ్ఞానులైన యోగుల కుటుంబములోనే జన్మించును. కాని లోకమునందు ఇట్టి జన్మ ప్రాప్తించుట మిక్కిలి దుర్లభము.

యోగి కుటుంబంలో పుట్టిన తరువాత తన పూర్వ జన్మలో చేసిన సాధనను అతడు సులభముగానే పొంది ఈ జన్మలో పరమాత్మ ప్రాప్తి కొరకు మునుపటి కంటె అధికముగా సాధనచేయును. శ్రీమంతుని ఇంటిలో జన్మించిన యోగభ్రష్టుడు పూర్వజన్మ సాధన ప్రభావమున నిస్సందేహముగా భగవంతుని వైపు ఆకర్షితుడగును.




అమరనధ్ అమర్

# భగవద్గీత ఆరవ అధ్యాయము
# ఆత్మ సంయమ యోగము



యోగి వేదములలో తెలుపబడిన సకల కర్మల ఫలమును అధిగమించును. కాని ప్రయత్న పూర్వకముగా యోగసాధన చేసిన యోగి అనేక జన్మల సంస్కారము ప్రభావమున ఈ జన్మ యందే సిద్ధిని పొంది సంపూర్ణముగా పాపరహితుడై వెంటనే పరమపదము పొందును.

యోగి తాపసుల కంటె, శాస్త్రజ్ఞానుల కంటె, మంచి కర్మలను ఆచరించువారి కంటె శ్రేష్ఠుడుగా భావింపబడును. కావున అర్జునా నీవు యోగివి కమ్ము.


యోగులందరిలోనూ శ్రద్ధగా అంతరాత్మతో నన్నే నిరంతరము భజించు యోగి నాకు పరమ శ్రేష్ఠుడు అని భావింపబడును.

ఈ విధంగా ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన శ్రీమద్భగవద్గీత యందు ఆత్మ సంయమ యోగము అనే 6 వ అధ్యాయము సమాప్తము.

అమరనధ్ అమర్





భగవద్గీత

# ఏడవ అధ్యాయము
# విజ్ఞానయోగము




### అప్పుడు భగవానుడు

అర్జునా! అనన్య భక్తితో నాయందే మనస్సు కలిగినవాడవై వుండుము. నీవు సర్వ విధాల శరణాగతుడవై యోగసాధన చేస్తూ నన్ను తెలుసుకోవడమెట్లాగో చెబుతాను విను. దేనిని ఎరిగిన తరువాత ఇక నీవు తెలుసుకోవలసినది ఏదియు మిగలదో అలాంటి విజ్ఞాన సహితమైన తత్వజ్ఞానమును నీకు సంపూర్ణంగా నేను తెలిపెదను.

### పరమాత్మను తెలుసుకోవడం ఎలా?

వేలకొలది మనుషులలో ఎవడో ఒకడు మాత్రమే నన్ను తెలుసు కొనుటకు ప్రయత్నించును. అట్లు ప్రయత్నించిన వారిలోనూ ఒకానొకడు మాత్రమే నన్ను యథార్థంగా తెలుసుకొనగలడు. భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారము అని ప్రకృతి ఎనిమిది విధములుగా కలదు.



# ఏడవ అధ్యాయము
# విజ్ఞానయోగము



అది 'అపరా' ప్రకృతి. దీనికి భిన్నమైనది 'పరా' ప్రకృతి. అదే ప్రాణాధారమై ఈ జగత్తును భరిస్తోంది. అర్జునా! సమస్త ప్రాణులు ఈ రెండు ప్రకృతుల నుండియే ఉత్పన్నము అవుతున్నవి. ఈ సమస్త జగత్తు యొక్క సృష్టి, ప్రళయము నేనే అని తెలుసుకో.




అమరానాథ్ అమర్

# ఏడవ అధ్యాయము
# విజ్ఞానయోగము



ధనుంజయా! నాకంటే శ్రేష్ఠమైనది వేరొకటిలేదు. దారానికి మణులు గ్రుచ్చినట్లు ఈ సమస్త జగత్తు నా యందే కూర్చబడియున్నది. నీటిలోని రసాన్ని, సూర్య చంద్రులలో ప్రకాశాన్ని, వేదములలోని ఓంకారమును, ఆకాశము నందు శబ్దమును, మనుషులలోని పౌరుషమును, భూమి యందు సుగంధమును, అగ్నియందు తేజస్సును, సమస్త ప్రాణులలో జీవశక్తిని, తాపసులలో తపస్సును నేనే.

పార్థా! సమస్త భూతములకును నన్ను శాశ్వత బీజముగా భావించు. ప్రజ్ఞావంతులలో ప్రజ్ఞను, తేజోవంతులలో తేజస్సును నేనే. బలవంతులలో కామ, రాగ రహితమైన బలమును నేను. సమస్త ప్రాణుల యందు ధర్మమునకు విరుద్ధము కాని కామమును నేనే. సాత్త్విక, రాజస, తామస భావములన్నియును నా నుండియే కలుగుచున్నవని తెలుసుకొనుము. కాని యథార్థముగా వాటిలో నేను గాని, నాలో అవికాని లేవు అనగా నేను త్రిగుణాతీతుడను. ఈ సమస్త జగత్తు ఆ మూడు గుణముల ప్రభావముతో మోహితమగుచున్నది. కనుక త్రిగుణములకు అతీతుణ్ణి, శాశ్వతుడను అయిన నన్ను, నా స్వరూపాన్ని ఈ జగత్తు తెలుసుకొనలేకున్నది.

### భక్తులు ఎన్ని రకాలు?

నా మాయ త్రిగుణాత్మకమైనది, అలౌకికమైనది, ఇది అధిగమించుటకు సాధ్యము కానిది. కాని నిరంతరము నన్నే భజించువారు, ఈ మాయనుండి బయటపడగలరు. మాయలో చిక్కుకున్న అజ్ఞానులు, అసుర స్వభావము కలవారు, నరులలో అధములు, మూఢులు, దుష్కర్మలను ఆచరించువారు నన్ను పూజించరు.




అమరనధ్ అమర్



# ఏడవ అధ్యాయము
# విజ్ఞానయోగము

భరతశ్రేష్ఠా! సుఖసంపదలను కోరుకొనువారు, బాధలలో ఉన్నవారు, భగవంతుడిని పొందాలనుకునే జిజ్ఞాసువులు మరియు జ్ఞానులు అను నాలుగు విధములైన భక్తులు నన్ను భజింతురు. ఈ నాలుగు రకాల భక్తులలో నిరంతరము ఏక నిష్ఠతో అనన్యమైన భక్తి కలిగిన జ్ఞాని నాకు అత్యంత ప్రియుడు. నా తత్త్వమును ఎరిగిన జ్ఞానికి నేను అత్యంత ఇష్టుడను మరియు అతడు నాకు ఇష్టుడు.


ఈ నాలుగు రకాల భక్తులూ ఉదారులే. కాని జ్ఞానియైన వాడు నా స్వరూపమే అని నా అభిప్రాయము. ఎందుకంటే అలాంటి భక్తుడు తన మనస్సును, బుద్ధిని నాయందే స్థిరముగా నిలిపి నన్ను ఆశ్రయించుకొని ఉంటాడు. అనేక జన్మల పిదప జ్ఞాని సర్వము వాసుదేవమయమే అని భావించి నన్ను శరణు పొందును. అట్టి మహాత్ముడు లభించుట దుర్లభము.

## ఇతర దేవతలను ఎలాంటి వారు పూజిస్తారు?

అనేక విధములైన కోరికలతో కూరుకు పోయిన వారి జ్ఞానము హరింపబడును. వారు తమ తమ స్వభావమునకు అనుగుణముగా ఇతర దేవతలను ఆరాధిస్తారు. భక్తులు ఏ దేవతా స్వరూపమును భక్తిశ్రద్ధలతో పూజించినను వారికి ఆయా దేవతల యందే భక్తిశ్రద్ధలను స్థిరముగా కుదురుకొనునట్లు నేను చేయుదును.

అట్టి సకామ భక్తుడు తగిన శ్రద్ధతో ఆ దేవతనే ఆరాధించును. నా అనుగ్రహము వలననే ఆ దేవత ద్వారా తన కోరికలను అతడు తప్పక పొందును.

కాని అలాంటి అల్పబుద్ధులు పొందెడి ఫలము కూడా అశాశ్వతమే. అన్య దేవతలను పూజించువారు ఆ దేవతలనే చేరుదురు. కాని నా భక్తులు ఏ విధముగా ఆరాధించినను చివరకు నన్నే పొందుదురు. శాశ్వతము, అత్యుత్తమము, పరమ పవిత్రమును అయిన నన్ను బుద్ధిహీనులు గ్రహింపక నన్ను కూడ ఒక సాధారణ మానవునిగా తలంచెదరు. యోగమాయచే కప్పబడిన నేను అందరికి గోచరింపను. కనుక అజ్ఞానులు నన్ను జన్మ రహితునిగా, శాశ్వతునిగా తెలుసుకొనలేరు.




అమరానాథ్ అమర్

www.sanatanadharm.com

భగవద్గీత

# ఏడవ అధ్యాయము

# విజ్ఞానయోగము






అర్జునా! గతించిపోయిన, ప్రస్తుతం జరుగుతున్న, రాబోవు కాలంలో జరగనున్న ప్రతి విషయము మరియు సర్వ ప్రాణుల గురించి నాకు తెలియును. కాని నాయందు శ్రద్ధ లేనివాడు నన్ను తెలుసుకొనలేడు. ఈ ప్రపంచంలోని ప్రాణులన్నియును రాగ ద్వేషముల లన కలిగిన ద్వంద్వములలో పడి అంతులేని మోహములో చిక్కుకొనుచున్నవి. కాని పుణ్యకర్మలను ఆచరించు
మానవుల పాపములు నశించిపోవును. అట్టివారు రాగ ద్వేష జనితమైన ద్వంద్వముల నుండి విముక్తులై, దృఢనిశ్చయము కలవారై నన్ను భజింతురు. నన్ను ఆశ్రయించి జరా, మరణముల నుండి విముక్తికై ప్రయత్నించువారు ఆ పరబ్రహ్మను తెలిసికొందురు. అధిభూత, అధిదైవ, అధియజ్ఞములతో పాటు, అందరికిని ఆత్మరూపుడైన నన్ను అంత్యకాలము నందైనను తెలిసికొనువారు నిశ్చలబుద్ధితో నన్నే చేరుకొందురు.
ఈ విధంగా ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన శ్రీమద్భగవద్గీత యందు జ్ఞాన విజ్ఞాన యోగము అనే 7 వ అధ్యాయము సమాప్తము.

అమరానాథ్ అమర్

భగవద్గీత

# ఎనిమిదవ అధ్యాయము

# అక్షరపరబ్రహ్మయోగము.



**అధిభూతము,అధిదైవము,అధియజ్ఞము అంటే ఏమిటి?**

**అర్జునుడు అడుగుతున్నాడు.**

**పురుషోత్తమా! బ్రహ్మ అనగానేమి? అధ్యాత్మము అనగా నేమి? కర్మ అనగా నేమి? అధిభూతము అని దేనికి పేరు? అధిదైవము అని దేనిని అందురు? అధియజ్ఞము అనగానేమి? అధియజ్ఞము ఈ శరీరము నందు ఎట్లుండును? అంత్యకాలమున మనస్సు పరమాత్మ యందు లగ్నముచేసిన యోగులు నిన్నెట్లు తెలిసికొనగలరు?**

**అపుడు శ్రీ కృష్ణభగవానుడు!**

**సర్వశ్రేష్ఠుడు, శాశ్వతుడిని బ్రహ్మ అంటారు. జీవాత్మను అధ్యాత్మము అంటారు. సకల ప్రాణుల ఉత్పత్తి, అభ్యుదయములకు కారణమైన క్రియలను కర్మ అందురు. ఉత్పత్తి, వినాశ శీలములైన పదార్థములు అన్నియును అధిభూతములు అనబడును. హిరణ్మయుడైన పురుషుడు అధిదైవము. అర్జునా! ఈ శరీరములలో అంతర్యామిగా ఉన్న నేనే అధియజ్ఞమును. ఎవడు అంత్య కాలము నందైనను నన్నే స్మరించుచు, దేహ త్యాగమును చేస్తాడో అతడు నన్నే పొందును. ఈ విషయములో ఎటువంటి సందేహం లేదు.**




అమరానాథ్ అమర్

# భగవద్గీత

# ఎనిమిదవ అధ్యాయము

# అక్షరపరబ్రహ్మయోగము.






కౌంతేయా! మనుష్యుడు దేహాన్ని వదలి వెళ్ళే సమయంలో ఏ భావాన్ని కలిగి వుంటాడో, మరుజన్మలో ఆయా స్వరూపములనే పొందును. కావున అర్జునా! నీవు సర్వదా నన్నే స్మరిస్తూ యుద్ధము చేయుము. ఈ విధముగా నీ మనోబుద్ధులను నాయందే నిల్పియున్నచో నిజముగా నన్నే పొందెదవు. మనస్సును ఎటూ పోనీయక, నిరంతరము పరమేశ్వరుని ధ్యాన రూప యోగమునే సాధనచేయు మనుష్యుడు దివ్య పురుషుడైన పరమాత్మనే చేరును.

పరమాత్మ ఎలా ఉంటాడు? పొందడం ఎలా?

సర్వజ్ఞుడును, సనాతనుడును, అందరిని శాసించు వాడును, అణువు కన్నా కూడా సూక్ష్మమైన వాడును, అందరిని పోషించు వాడును, సూర్యునివలె నిత్యచేతన ప్రకాశరూపుడును, అజ్ఞానాంధకారమును పారద్రోలు వాడును ఐన పరమాత్మను అనుక్షణం స్మరించు పరమ భక్తుడు అంత్యకాలము నందు యోగబలము

అమరనాథ్ అమర్

# ఎనిమిదవ అధ్యాయము
# అక్షరపరబ్రహ్మయోగము.



చేత్ర భృకుటి మధ్యప్రాణమును స్థిరముగా నిలిపి నిశ్చలమైన మనస్సుతో ఆ పరమ పురుషుడిని పొందును.
వేద కోవిదులైన విద్వాంసులు దేనిని శాశ్వతునిగా వర్ణిస్తారో, సన్న్యాసులు ఏ పరమాత్మను పొందగోరి బ్రహ్మచర్యవ్రతమును ఆచరించుచున్నారో ఆ పరబ్రహ్మగురించి నీకు సంక్షిప్తముగా చెప్పెదను.
అన్ని ఇంద్రియాల్ని నిగ్రహించి, మనస్సును హృదయము నందే స్థిరముగా నిలిపి ప్రాణమును భ్రూ మధ్యములో నిలిపి పరమాత్మ యందే నిమగ్నుడై, అక్షర బ్రహ్మస్వరూపమైన ఓంకారమును ఉచ్చరించుచు, ఆ ఓంకారమునకు అర్థస్వరూపుడను, నిర్గుణబ్రహ్మను అయిన నాగురించి ఆలోచించుచు దేహత్యాగము మొనర్చువాడు మోక్షమును పొందును.




అమరానాథ్ అమర్



# ఎనిమిదవ అధ్యాయము
# అక్షరపరబ్రహ్మయోగము.

పార్థా! ఎవరైతే నిత్యము, నిరంతరము అనన్య భక్తి భావముతో మనస్సు నా యందే నిలిపి నన్నే స్మరించునో అట్టి యోగికి సహజముగానే నేను లభిస్తాను. పరమసిద్ధిని పొందిన మహాత్ములు నన్ను చేరిన పిదప, దు:ఖములకు నిలయమైన క్షణభంగురమైన పునర్జన్మను పొందరు. బ్రహ్మలోక పర్యంతము ఉన్న సమస్త లోకములు పునరావృతములు. అయితే నన్ను పొందుట వలన పునర్జన్మ ఉండదు.

## బ్రహ్మ యొక్క జీవిత కాలము ఎలా నిర్ణయిస్తారు?

వెయ్యి యుగాల కాలము బ్రహ్మకు ఒక పగలు, అంతే కాలము ఆ బ్రహ్మకు ఒకరాత్రితో సమానమని తెలిసిన యోగులు కాలతత్త్వమును ఎరిగినవారు. బ్రహ్మ పగటి కాలమున సమస్త జగత్తు ప్రారంభమగును. బ్రహ్మ యొక్క రాత్రి కాలమున సమస్త జగత్తు లీనమగును.

పార్థా! ఆ ప్రాణసమూహములు పగటియందు జన్మించి, రాత్రియందు లయమగును. మరలా పగలు అవటంతోనే ఉత్పన్నమగుచుండును. సమస్త ప్రాణులు నశించినను ఆ పరమ పదము నశించదు. సమస్త ప్రాణులు ఆ పరమాత్మ యందే అంతర్గతములై యున్నవి. ఏ పరమాత్మ చేత ఈ జగత్తు వ్యాప్తమై ఉన్నదో ఆ పురుషోత్తముడు అనన్య భక్తితో మాత్రమే లభించును.

## ఏ కాలములో మరణిస్తే ఎలాంటి ఫలితము కలుగుతుంది?

ఏ కాలము నందు దేహత్యాగము చేసిన యోగులు తిరిగిరాని లోకము చేరుదురో మరియు ఏ కాలము నందు దేహ త్యాగము చేసినవారు తిరిగివచ్చు లోకము పొందుదురో ఆ రెండు మార్గములను తెలిపెదను వినుము.

బ్రహ్మ వేత్తలైన యోగులు జ్యోతిర్మయ మార్గము ద్వారా బ్రహ్మపదప్రాప్తి లో ఉంటారు. దానికి అధిదేవత అగ్ని. దేహత్యాగము చేసిన ఆ యోగులను క్రమముగా పగలు, శుక్ల పక్షము, ఉత్తరాయణమున అభిమాన దేవతలు తీసుకొనిపోయి పరమ పదమును చేర్చుదురు. అట్లే సకామ యోగులను రాత్రి, కృష్ణపక్షము, దక్షిణాయనమున అభిమాన దేవతలు స్వర్గానికి తీసుకు వెళతారు. అక్కడ తమ పుణ్యఫలములను అనుభవించి తిరిగి భూలోకము చేరుదురు.

ఈ రెండు మార్గములను శుక్ల, కృష్ణ మార్గములనియు లేక దేవయాన, పితృయాన మార్గములనియు వ్యవహరిస్తారు. ఇవి నిత్యము ఉండేవి. దేవయాన మార్గమున వెళ్ళువారు పరమగతిని పొంది తిరిగిరారు. పితృయాన మార్గమున వెళ్ళువారు తిరిగి వచ్చి జనన మరణ చక్రంలో చిక్కుకుంటారు. ఈ రెండు మార్గములను తెలిసికొనిన యోగి మోహమునకు గురికాడు.

అమరానాథ్ అమర్


# ఎనిమిదవ అధ్యాయము
# అక్షరపరబ్రహ్మయోగము.






అర్జునా! సర్వకాలముల యందును సమబుద్ధి కలిగిఉండుము. ఈ తత్త్వ రహస్యము ఎరిగిన యోగి వేదపఠనము, యజ్ఞ, దాన, తపస్సుల వలన కలుగు పుణ్యములను అధిగమించి, సనాతన పరమ పదము అయిన నన్నే పొందును.

ఈ విధంగా ఉపనిషత్తు,బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన శ్రీమద్భగవద్గీత యందు అక్షర పరబ్రహ్మ యోగము అనే 8 వ అధ్యాయము సమాప్తము.



Editing
C. AMARANATH AMAR
AMR
సవరణ
అమరనాథ్ అమర్

www.sanatanadharm.com

అమరానాథ్ అమర్

# తొమ్మిదవ అధ్యాయము
# రాజవిద్యా రాజగుహ్యయోగము



## ప్రాణులకు ఆది, అంతము ఎలా సంభవిస్తున్నాయి?

శ్రీ భగవానుడు ఇలా చెబుతున్నాడు.

ఓ అర్జునా! నీవు అసూయలేనివాడివి. అందుకనే అతిరహస్యము, విజ్ఞాన సహిత జ్ఞానమును నీకు మళ్ళీ చెబుతున్నాను. దీనిని తెలుసుకుని నీవు సంసార బంధము నుండి బయటపడుము. ఈ విజ్ఞాన సహిత జ్ఞానము అన్ని విద్యలకును తలమానికము, సమస్త రహస్య విషయములకును శిరోభూషణము, అతి పవిత్రము, ఉత్తమము, ప్రత్యక్ష ఫలదాయకము మరియు ధర్మ రూపమైనది. సాధన చేయుటకు మిక్కిలి సులభము, శాశ్వతము.

ఓ పరంతపా! ఈ ధర్మ మార్గము నందు విశ్వాసము, శ్రద్ధలేని వాళ్ళు నన్ను పొందలేక జనన మరణాలలో పడి పరిభ్రమించుచుందురు. నేను అవ్యక్తంగా ఉన్నాను. ఈ ప్రపంచమంతా నేనే వ్యాపించిఉన్నాను. ప్రాణులన్నియును నా సంకల్పము ఆధారముగా నా యందే అంతర్గతములైయున్నవి. కాని నేను వాటిలో లేను. ప్రాణులన్నియును నాలో స్థిరముగా లేవు. నా యోగ మహిమను దర్శించిన ప్రాణులను సృష్టించి, పోషించునది నేనే. అయినను నా ఆత్మ వాటియందు స్థితమై ఉండదు.




అమరానాథ్ అమర్



# తొమ్మిదవ అధ్యాయము

# రాజవిద్యా రాజగుహ్యయోగము

అంతటా సంచరించునట్టి సర్వవ్యాపి అయిన గాలి ఎలా ఆకాశంలో ఉంటుందో, అలాగే సమస్త భూతములు నాలోనే ఉంటాయని తెలుసుకొనుము. ఓ కౌంతేయా! కల్పాంతములో ప్రాణులన్నియు నా ప్రకృతిలోనే కలిసిపోతాయి. కల్పము మొదలుకాగానే వాటిని నేనే తిరిగి సృష్టిస్తూ ఉంటాను. ఈ సమస్త ప్రాణిసముదాయములు ప్రకృతి ఆధీనము కనుక అస్వతంత్రములు.

నేను నా ప్రకృతిని వశపరచుకొని ఈ ప్రాణులను వాటి కర్మానుసారము మళ్ళీ మళ్ళీ పుట్టిస్తూ ఉంటాను. ఆ కర్మల యందు ఆసక్తి రహితుడనై మరియు ఉదాసీనునివలె ఉన్నట్టి నన్ను ఆ కర్మలు బంధించవు. నన్ను అధ్యక్షునిగా పెట్టుకొని ఈ చరాచర జగత్తును ప్రకృతి సృష్టిస్తూ ఉంది. ప్రపంచం క్రమ పద్ధతిలో నడవడానికి ఇదే కారణం. లోక కళ్యాణమునకై అవతరించిన నన్ను సామాన్య మానవునిగా భావించి తక్కువగా ఊహింతురు. వ్యర్ధములైన ఆశలతో, కర్మలతో వ్యర్థమైన జ్ఞానంతో నిక్షిప్తములైన మనస్సుగల అజ్ఞానులు రాక్షస స్వభావంతో అసుర ప్రకృతితో మోహంలో కూరుకుపోతారు.

## భగవంతుడుని భక్తులు ఎలా సేవిస్తారు?

అర్జునా! దైవ స్వభావముగల మహాత్ములు నన్ను సకల ప్రాణులకు మూల కారణముగాను, నశించనివానిగా తెలుసుకొని నిశ్చలమైన మనస్సు కలిగి నిరంతరము నన్నే భజింతురు. నా నామ గుణములను వాద్య బృందముతో కీర్తింతురు.

నియమాలను పాటిస్తూ నన్ను చేరుటకు ప్రయత్నిస్తూ ఉంటారు. భక్తితో నాకు నమస్కరిస్తూ నా యందే మనస్సు నిలిపి నన్ను సేవిస్తూ ఉంటారు. మరికొందరు నన్ను జ్ఞాన యజ్ఞము ద్వారా, కొందరు ఏకాంతంగా, కొందరు అనేక రూపాలలో మరియు విరాట్ స్వరూపముతో నన్ను ఆరాధిస్తారు.

నేనే క్రతువును, నేనే యజ్ఞమును, నేనే ఔషధమును, నేనే మంత్రమును, నేనే ఘృతమును (నెయ్యి), నేనే అగ్నిని, నేనే హోమమును. ఈ జగత్తుకు తండ్రిని, తల్లిని, రక్షకుడను నేనే, పితామహుడను నేనే, తెలిసికొన దగినవాడనూ, పవిత్రుడను, ఓంకారమును, వేదములను నేనే, పరమగతియైన పరమధామమును, భర్తను, ప్రభువును, సాక్షిని నేనే. అందరికి నివాస స్థానమును, శరణు పొందదగినవాడను నేనే. మిత్రుడను, ఉత్పత్తి, ప్రళయమునకు హేతువును, వారి స్థితికి ఆధారమును, పెన్నిధిని, శాశ్వత కారణము నేనే. నేనే సూర్యుడినై తపించుచూ సముద్రము నుండి నీటిని గ్రహించి వర్ష రూపమున కురిపిస్తున్నాను. అమృతమును, మృత్యువును కూడా నేనే, సత్తు (శాశ్వతమైన ఆత్మను), అసత్తు (నశ్వరమైన వస్తుజాలము) ను గూడా నేనే.

భగవద్గీత

# తొమ్మిదవ అధ్యాయము
# రాజవిద్యా రాజగుహ్యయోగము






## శ్రీకృష్ణ భగవానుని పూజించడం వలన ఎలాంటి ఫలితము లభిస్తుంది?
## ఇతర దేవతలను ప్రార్థించడం వలన కలిగే ఫలితము ఏమిటి?

వేదములచే సకామ కర్మలు చేయువారును, సోమరసపానము చేయువారును, యజ్ఞాలచేత నన్ను సేవించి పాపాలు పోగొట్టుకొని స్వర్గం కోసం ప్రార్థిస్తారు. పుణ్యప్రదమైన స్వర్గలోకాన్ని పొంది అక్కడ భోగాలను అనుభవించి పుణ్యము క్షీణించగానే తిరిగి మానవ లోకములో పుడతారు. ఈ విధముగా వేదోక్తమైన కోరికలు తీర్చుకొనుటకు పనులుచేసే వారు జనన మరణ చక్రమములలో పడి తిరుగుతూ ఉంటారు. నన్నే నిరంతరము అనన్య భక్తితో చింతనచేయుచూ ఉండే భక్తుల యోగ క్షేమములను నేనే వహించుచుందును. శ్రద్ధతో ఇతర దేవతలను ఆరాధించే భక్తులు కూడా వాస్తవానికి నన్ను ఆరాధిస్తున్నట్లే. కానీ వారి పూజలు అజ్ఞానముతో కూడినవి. ఎందుకనగా సకల యజ్ఞములకును భోక్తను, స్వామిని గూడా నేనే. వారు నా పరమేశ్వర తత్త్వమును గుర్తించలేరు. అందుకే పతనమగుదురు. దేవతలను పూజించువారు దేవ లోకములను పొందుదురు, పితరులను సేవించువారు పితృలోకములకు వెళ్ళుదురు, భూతప్రేతములను అర్చించువారు భూతప్రేత రూపములను పొందుదురు, నన్ను ఆరాధించు భక్తులు నన్నే పొందుదురు. అట్టి నా భక్తులకు పునర్జన్మ ఉండదు.

అమరానాథ్ అమర్

భగవద్గీత

# తొమ్మిదవ అధ్యాయము

## రాజవిద్యా రాజగుహ్యయోగము



నిర్మల బుద్ధితో నిష్కామ భావముతో పరమ భక్తి పూర్వకముగా సమర్పించు ఆకునుగాని, పుష్పమునుగాని, ఫలమునుగాని, జలమునుగాని నేను స్వయముగా తృప్తిగా ఆరగింతును.




ఓ కౌంతేయా! నీవు ఆచరించు కర్మను, భుజించెడి ఆహారమును, హోమముచేయు హవనమును, అర్పించు దానమును, ఆచరించు తపస్సును నాకే సమర్పించుము. ఈ విధముగా సమస్త కర్మలను భగవంతుడినైన నాకు అర్పిస్తే, శుభాశుభ ఫలరూప కర్మ బంధముల నుండి విముక్తుడవై చివరకు నన్నే చేరగలవు.

**దుర్మార్గుడైనా భగవంతుడిని సేవిస్తే ఫలితము ఏమిటి?**

నేను సకల ప్రాణుల యందును సమదృష్టి కలవాడిని. నాకు ప్రియుడు గాని, అప్రియుడు కాని ఎవ్వడును లేడు. కాని నన్ను భక్తితో భజించువారు నాయందే యుందురు. నేనును వారి యందు ప్రత్యక్షముగా ఉంటాను. ఎంత పాపి, దుర్మార్గుడైనను అనన్య భక్తితో నన్ను సేవించినచో అతనిని సత్పురుషునిగానే భావిస్తాను ఎలాగనగా యథార్థముగా అతడు నిశ్చయబుద్ధి కలవాడు. అతడు తొందరగా ధర్మాత్ముడగును. శాశ్వతమైన పరమ శాంతిని పొందును. నా భక్తుడెన్నడును నష్టమునకు గురికాడు. అను విషయమును నిశ్చయముగా ఎఱుంగుము. పాప సంజాతులు ఎవరైనా సరే నన్ను ఆశ్రయిస్తే చాలు ఉత్తమ గతిని పొందుతారు. ఇక

అమరానాథ్ అమర్

# తొమ్మిదవ అధ్యాయము
# రాజవిద్యా రాజగుహ్యయోగము



పుణ్యాత్ములు, రాజర్షులు, భక్తులు నన్ను శరణుపొందినచో ఇక ప్రత్యేకముగా చెప్పేదేముంటుంది. ప్రస్తుత శరీరము క్షణభంగురము, సుఖ రహితము కనుక నిరంతరము నన్నే భజింపుము. నీ మనస్సును నాయందే ఉంచు, నా భక్తుడివిగా నన్నే పూజించుచు నాకు నమస్కరించు. ఈ విధంగా ఆత్మను నా యందే నిలిపినచో నీవు నన్నే పొందగలవు.




ఈ విధంగా ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన శ్రీమద్భగవద్గీత యందు రాజవిద్యా రాజగుహ్య యోగము అనే 9 వ అధ్యాయము సమాప్తము.



Editing
C. AMARANATH AMAR
AMR
సవరణ
అమరనాథ్ అమర్

www.sanatanadharm.com

అమరానాథ్ అమర్

భగవద్గీత


# పదవ అధ్యాయము
# విభూతి యోగము



**భగవంతుడి తత్త్వము ఎలా ఉంటుంది? శ్రీ భగవానుడు చెబుతున్నాడు.**

మహాబాహో! నీవు నా మీద ప్రేమ గలవాడవు. కావున నీ మేలు కోరి నేను మరల చెప్పుచున్నాను. నా మాటలనే వినుము. నా పుట్టుక గురించి దేవతలు గాని, మహర్షులుగాని తెలుసుకొన లేరు. ఎందుకనగా నేను ఆ దేవతలకును, మహర్షులకును మూల కారణమైన వాడను. నన్ను జన్మ రహితునిగా, అనాదియైన వానిగా మరియు సకలలోక మహేశ్వరునిగా తెలుసుకున్నవాడు మానవులలో జ్ఞాని. అట్టివాడు పాపముల నుండి విముక్తుడగును. బుద్ధి, జ్ఞానము, మోహరాహిత్యము, క్షమ, సత్యము, ఇంద్రియ నిగ్రహము, మనో నిగ్రహము, సుఖము, దుఃఖము, పుట్టుక, వినాశనము, భయము, అభయము, అహింస, సమానత, సంతోషము, తపస్సు, దానము, కీర్తి, అపకీర్తి ఈ విధమైన వేరువేరు భావాలు నా వల్లనే ప్రాణులకు కలుగుతున్నాయి.

సప్త ఋషులు, వారి కంటే పూర్వులు అయిన సనకాది మహామునులు, మనువులు మొదలగు వీరందరూ నా భక్తులే. నా సంకల్పము వలననే జన్మించిరి. ఈ జగత్తు నందలి సమస్త ప్రాణులును వీరి సంతానమే. విస్తారమైన నా విభూతిని ఎవడైతే యథార్థముగా తెలుసుకుంటాడో అతడు యోగంలో చలించకుండా నిశ్చలంగా, స్థిరంగా ఉంటాడు. ఇందు ఏ మాత్రము సందేహము లేదు. నేనే ఈ సమస్త జగత్తు యొక్క ఉత్పత్తికి మూలకారణము. నా వలననే ప్రపంచం నడుస్తుంది. ఈ విధంగా నన్ను తెలుసుకున్న వారు భక్తి శ్రద్ధలతో నిరంతరము నన్నే సేవింతురు.



# పదవ అధ్యాయము
# విభూతి యోగము



వారి మనస్సు, ప్రాణములు నాయందే ఉంటాయి. వాళ్ళు పరస్పరము నా ఆలోచనలతోనే ఉంటారు, నా గురించే చెప్పుకుంటూ ఉంటారు, నా తత్త్వంలోనే రమిస్తూ ఉంటారు, నిత్యము సంతోషముగా ఉంటారు, నిరంతరము ధ్యానాదుల ద్వారా నాయందే మనస్సు ఉంచుతారు, ప్రీతితో నన్నే సేవిస్తూ ఉంటారు, వారికి నేను బుద్ధి యోగమును ప్రసాదించెదను. దాని ద్వారా వారు నన్నే పొందెదరు. వారిని అనుగ్రహించుట కొరకు నేను వాళ్ల బుద్ధిలో స్థిరముగా ఉంటాను. నేను ప్రకాశించే జ్ఞాన దీపంచేత వారిలో అజ్ఞానం సృష్టించిన అంధకారాన్ని పారద్రోలెదను.

అర్జునుడు పలికెను.

నీవు పరబ్రహ్మవు, పరంధాముడవు, పరమపవిత్రుడవు. నీవు సనాతనుడవని, దివ్యపురుషుడవని, ఆది దేవుడవని, పుట్టుకలేనివాడివని, సర్వవ్యాపివని నిన్ను కీర్తిస్తూ ఉంటారు ఋషులందరూ. దేవర్షి నారదుడు, అసితుడు, దేవలుడు, వేదవ్యాసుడు మొదలగు వారందరూ అలాగే చెబుతున్నారు. నీవు కూడా నాకు ఆ విధంగానే తెలుపుచున్నావు.

ఓ కేశవా! నీవు చెప్పునది అంతయును సత్యమే హే భగవాన్! నీ యొక్క స్వరూపము దేవతలుగాని, దానవులుగాని తెలిసి కొనజాలరు. ఓ పురుషోత్తమా! జగత్ ఉత్పత్తికారకా! భూతేశా! దేవదేవా! జగన్నాథా! నీ తత్త్వమును నీవే స్వయంగా ఎఱుంగుదువు. సమస్త లోకములందును నీ దివ్య విభూతుల ద్వారా వ్యాపించి, స్థితుడవై ఉన్నావు. వాటి గురించి చెప్పడం నీకొక్కడికే సాధ్యం. యోగేశ్వరా! నిరంతరము ధ్యానం చేయుచూ నిన్ను నేను తెలుసుకొనేదెలా? హే భగవాన్! ఏయే భావములతో నిన్ను ధ్యానించాలి? ఓ జనార్ధనా! నీ యోగశక్తిని గూర్చియు నీ విభూతి వైభవములను గురించియు విస్తృతముగా ఇంకను తెలుపుము. ఎందుకంటే నీ అమృత వచనములు ఎంతగా విన్నను తనివి తీరడం లేదు.

భగవానుడు తనను ఎవరితో పోల్చుకున్నాడు? అప్పుడు శ్రీ భగవానుడు అర్జునా! నీవు లెస్సగా పలికితివి. నా దివ్య విభూతుల వ్యాప్తికి అంతమే లేదు. వాటిలో ప్రధానమైన వాటిని కొన్నింటిని నీకు తెలుపుచున్నాను. సమస్త ప్రాణుల హృదయముల యందున్న ఆత్మను నేనే. సకల ప్రాణుల ఆది, మధ్య, స్థితి, అంతము నేనే. అదితి యొక్క 12మంది పుత్రులైన ఆదిత్యులలో విష్ణువును, జ్యోతులలో కిరణాలు గల సూర్యుడిని, 49 మంది వాయు దేవతలలో మరీచిని, నక్షత్రాలలో చంద్రుడిని నేనే. వేదాలలో సామవేదాన్ని, దేవతలలో ఇంద్రుడిని, ఇంద్రియములలో మనస్సును,


భగవద్గీత

# పదవ అధ్యాయము

# విభూతి యోగము



ప్రాణులలోని చైతన్యమును నేను. 11మంది రుద్రులలో శంకరుడను, యక్ష రాక్షసులలో కుబేరుడను, అష్ట వసువులలో అగ్నిని, పర్వతములలో మేరుపర్వతాన్ని, పురోహితులలో ముఖ్యుడైన బృహస్పతిని, సేనాధిపతులలో కుమారస్వామిని, జలాశయములలో నేను సాగరమును. మహర్షులలో భృగువును, శబ్దములలో ఏకాక్షరమైన ఓంకారమును, యజ్ఞములలో జప యజ్ఞమును, స్థావరములలో హిమాలయమును నేను. వృక్షములలో నేను అశ్వత్థ వృక్షాన్ని (రావిచెట్టు), దేవర్షులలో నారదుడిని, గంధర్వులలో చిత్రరథుడిని, సిద్ధులలో కపిల మహర్షిని నేను. గుఱ్ఱములలో పాలసముద్రము నుండి అమృతముతో పుట్టిన ఉచ్చై:శ్రవమును, ఏనుగులలో ఐరావతమును, నరులలో రాజును, ఆయుధములలో నేను వజ్రాయుధమును. పాడి ఆవులలో కామధేనువును, పుట్టించేవారిలో మన్మథుడిని, పాములలో వాసుకిని, నాగులలో నేను అనంతుడి (ఆదిశేషు)ని, జలదేవతలలో వరుణుడిని, పితృదేవతలలో అర్యముడను, శాసించువారిలో యమధర్మరాజును, రాక్షసులలో ప్రహ్లాదుడను, గణించువారిలో కాలమును, మృగములలో సింహమును, పక్షులలో గరుత్మంతుడను, పవిత్రం చేసే వాటిలో వాయువును, శస్త్రధారులలో శ్రీరాముడిని, మత్స్యజాతులలో మొసలిని, నదులలో గంగానదిని నేనే.




అమరనధ్ అమర్

భగవద్గీత

# పదవ అధ్యాయము

# విభూతి యోగము




సృష్టికి ఆది, మధ్య, అంతములు నేనే, విద్యలలో ఆధ్యాత్మిక విద్యను, పరస్పర వాదవివాదములలో వాదము నేను, అక్షరాలలో అకారమును, సమాసములలో ద్వంద్వ సమాసమును నేను, క్షయ మెరుగని కాలాన్ని, విశ్వతో ముఖుడైన విరాట్ పురుషుడను, ధరించువాడును, పోషించువాడును నేనే. అన్ని ప్రాణులను హరించే మృత్యువును, సమస్త ప్రాణుల ఉత్పత్తి హేతువును, స్త్రీలలో కీర్తి, సంపద, వాక్కు, స్మృతి, మేధా, ధైర్యము, క్షమా అను వారందరును నేనే. గానము చేయుటకు అనువైన శ్రుతులలో బృహత్సామమును, ఛందస్సులలో గాయత్రీ ఛందస్సును, నెలలలో మార్గశిరమును, ఋతువులలో వసంత ఋతువును, మోసగాళ్ళలో జూదమును, తేజోవంతులలో తేజస్సును, విజేతలలో జయమును, సాత్త్వికులలో సత్త్వ గుణమును, యాదవులలో వాసుదేవుడను, పాండవులలో అర్జునుడిని, మునులలో వ్యాసుడిని, కవులలో శుక్రాచార్యుడిని, శిక్షించువారిలో దండమును, జయముకోరే వారిలో నీతిని, రహస్యములలో మౌనమును, జ్ఞానులలో తత్వజ్ఞానమును నేను. సర్వప్రాణుల ఉత్పత్తికి కారణమైన బీజమును నేనే.

ఈ చరాచర ప్రపంచంలో నేను లేని వస్తువులేదు.

పరంతపా! నా దివ్య విభూతులకు అంతమే లేదు. నా విభూతుల యొక్క విస్తృతిని గురించి సంక్షిప్తంగా చెప్పినాను. వైభవము, కాంతివంతము, శక్తివంతమైన వస్తువేదైనను అది నా తేజస్సులోని అంశమేనని తెలుసుకో. అర్జునా! ఇంతకంటే విస్తృతంగా తెలుసుకొని ప్రయోజనమేమి? ఈ సంపూర్ణ జగత్తును నేను కేవలము ఒక అంశతోనే ధరించి యున్నాను.

ఈ విధంగా ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన శ్రీమద్భగవద్గీత యందు విభూతి యోగము అనే 10 వ అధ్యాయము సమాప్తము.



Editing
C. AMARANATH AMAR
AMR
సవరణ
అమరనాథ్ అమర్

www.sanatanadharm.com

అమరానాథ్ అమర్

భగవద్గీత

# పదకొండవ అధ్యాయము

# విశ్వరూపసందర్శన యోగము



## అర్జునుడు విశ్వరూపాన్ని చూపించమని అడగడం!

అర్జునుడు ఇలా ప్రార్థిస్తున్నాడు.

ఓ కృష్ణా! నన్ను అనుగ్రహింపదలచి అతి రహస్యమైన ఆధ్యాత్మిక విషయములను నాకు బోధించితివి. దానివలన నా మోహము తొలగి పోయినది. సకల ప్రాణుల ఉత్పత్తి, ప్రళయముల గురించి విస్తారముగా విన్నాను, శాశ్వతమైన నీ మహిమ గురించి ఆలకించాను. నీవు చెప్పినదంతయు సత్యమే. ఓ పురుషోత్తమా! నీ యొక్క ఐశ్వర్య సంపన్నమైన దివ్య నీ రూపమును చూడాలని నేను ఆరాట పడుచున్నాను. నీ దివ్య రూపమును చూడటం నాకు సాధ్యమని నీకనిపిస్తే, శాశ్వతమైన నీ రూపాన్ని నాకు చూపించుము.

విశ్వరూపం చూడడానికి దివ్య దృష్టి ప్రసాదించడం! అప్పుడు శ్రీ భగవానుడు అర్జునా! అసంఖ్యాకములైన, బహువిధములైన, పెక్కు రకములైన ఆకృతులు గల నా అలౌకిక రూపమును చూడుము. ఆదిత్యులను, వసువులను, రుద్రులను, అశ్విని దేవతలను నాయందు చూడుము. అంతేగాక మునుపెన్నడును చూడని అపూర్వమైన, ఆశ్చర్యకరములైన రూపములను చూడుము. నా దేహము నందు ఒకేచోట స్థితమైయున్న సమస్త చరాచర విశ్వమును చూడుము. కాని సాధారణ నేత్రాలతో నా రూపమును నీవు చూడలేవు. అందుకని నీకు దివ్య దృష్టిని ప్రసాదించుచున్నాను. వాటితో నా ఈశ్వరీయమైన యోగశక్తిని చూడుము.

## భగవంతుని విశ్వరూపం ఎలా ఉంది?

### అప్పుడు సంజయుడు ధృతరాష్ట్రునితో

రాజా! శ్రీకృష్ణుడు ఇలా పలికిన అనంతరం ఈశ్వర సంబంధమైన తన దివ్య రూపాన్ని అర్జునుడికి చూపించాడు. ఆ విశ్వరూపంలో ముఖములు అనంతము, నేత్రములు అసంఖ్యాకములు, అందలి దృశ్యములు అద్భుతములైనవి. ఆ రూపము అనేక దివ్య ఆభరణములతో శోభిస్తున్నది. అమహా మూర్తి అనేక దివ్య ఆయుధములు చేపట్టియున్నాడు. దివ్యమైన మాలలు, వస్త్రములు ధరించి యున్నాడు. ఆ దివ్య శరీరము నుండి దివ్యచందన పరిమళములు అన్ని వైపులా గుబాళించుచుండెను. ఆ రూపము ఆశ్చర్యకరము, ఆనందము, సర్వతోముఖము, ఆకాశమున వేలకొలది సూర్యులు ఒకేసారి ఉదయించినచో వచ్చుకాంతి ఎలా ఉంటుందో ఆ మహాత్ముని యొక్క ప్రకాశం అలా వెలువడుతున్నది.

అమరానాథ్ అమర్



# పదకొండవ అధ్యాయము
# విశ్వరూపసందర్శన యోగము

ఆ సమయమున అర్జునుడు ఆ దేవాది దేవుని శరీరమందు అసంఖ్యాకములైన వేర్వేరుగా ఉండే వివిధ బ్రహ్మాండములను ఒకేచోట కేంద్రీకృతమైయున్నట్లు చూచి ఆశ్చర్యచకితుడై పులకించి పోయెను. ఆ విశ్వ రూపమునకు భక్తిశ్రద్ధలతో శిరస్సువంచి నమస్కరించి, చేతులు జోడించి అర్జునుడు ఇట్లు పలికెను.



# పదకొండవ అధ్యాయము
# విశ్వరూపసందర్శన యోగము



## విశ్వరూపమును వర్ణించుచున్న అర్జునుడు.

ఓ దేవాదిదేవా! నీ యొక్క దేహమునందు సకల దేవతలను, నానావిధ ప్రాణికోటిని, కమలాసనుడైన బ్రహ్మను, శంకరుని, సమస్త ఋషులను, దివ్య సర్పాలను చూస్తున్నాను. అనేక బాహువులు, ఉదరములు, ముఖాలు, నేత్రాలు గల నీ అనంత రూపము సర్వతోముఖముగ శోభిస్తున్నది. నీకు ఆది ఎక్కడో, అంతమెక్కడో నాకు కనిపించడం లేదు. కిరీటమును, గదను, చక్రమును ధరించి తేజోవంతంగా ప్రకాశిస్తున్నావు. ప్రజ్వరిల్లుతున్న జ్యోతిర్మయుడైన సూర్య తేజము వంటి కాంతితో అప్రమేయంగా శోభిస్తున్న నిన్ను దర్శిస్తున్నాను. నీవు అక్షరమైన పరబ్రహ్మావు కనుక తెలిసికొనదగినవాడవు. ఈ విశ్వానికి మూలకారణం మరియు శాశ్వత ధర్మరక్షకుడవు, నాశరహితుడవు, సనాతన పురుషుడవు నీవు అని నా విశ్వాసము. నీకు ఆది, మధ్య, అంతాలు లేవు. నీ పరాక్రమానికి అంతం లేదు. నీ బాహువులు అనంతములు, సూర్యచంద్రులు నీ నేత్రములు, ప్రజ్వలిస్తున్న అగ్ని నీ ముఖం. నీ తేజస్సుతో ఈ ప్రపంచాన్నంతా తపింపచేస్తున్న నిన్ను నేను దర్శిస్తున్నాను. ఓ మహాత్మా! దివి నుండి భూమి వరకు గల అంతరిక్షము అంతటను అన్ని దిక్కులలో నువ్వే ప్రకాశిస్తున్నావు.

అద్భుతమైన నీ భయంకర రూపమును చూచి ముల్లోకాలు గడగడలాడుచున్నవి. దేవతలు అందరూ నీలో ప్రవేశిస్తున్నారు. కొందరు భయంతో నమస్కరిస్తూ నీ నామ గుణములను కీర్తించుచున్నారు. మహర్షులును, సిద్ధులును స్వస్తి వచనములతో, స్తోత్రములతో నిన్ను ప్రార్థిస్తున్నారు. రుద్రులు, ఆదిత్యులు, వసువులు, సాధువులు, విశ్వదేవతలు, అశ్వనీదేవతలు, పితృదేవతలు, గంధర్వ, యక్ష, అసుర, సిద్ధ సమూహాలు అందరూ ఆశ్చర్యంతో నిన్నే దర్శించుచున్నారు.
మహాబాహో! అసంఖ్యాకములైన ముఖాలను, నేత్రాలను, చేతులను, ఊరువులను, పాదములను, ఉదరములను, కోరలను కలిగియున్న మిక్కిలి భయంకరమైన నీ రూపమును చూచి అందరును చలించి పోతున్నారు. నేను కూడా భయంతో వణికి పోవుచున్నాను. నీవు ఆకాశాన్ని తాకుచున్నావు. అనేక రంగులతో శోభిస్తున్నావు. కాంతులను విరజిమ్ముచున్న విశాల నేత్రములతో, విస్తరించిన ముఖములతో అద్భుతముగా కనిపిస్తున్నావు.

అమరానాథ్ అమర్

# పదకొండవ అధ్యాయము
# విశ్వరూపసందర్శన యోగము






నిన్ను చూచి భయపడి పోతున్నాను. ధైర్యాన్ని కోల్పోతున్నాను, శాంతి లేకుండా ఉన్నాను. భయంకరమైన కోరలతో, ప్రళయ కాలాగ్ని వలె ప్రజ్వలించుచున్న ముఖాలను చూచి దిగ్భ్రాంతిచెందుతున్న నాకు దిక్కుతోచకున్నది. ఓ దేవదేవా! నాకు ప్రసన్నుడవు కమ్ము!

ధృతరాష్ట్ర పుత్రులు, ఇతర రాజులు, నా పక్షములోని ప్రముఖ వీరులు, భీష్మ పితామహుడు, ద్రోణుడు, కర్ణుడు మొదలగు వారందరూ భయంకరములైన కోరలతో గూడిన నీ ముఖముల యందు అతివేగముగా ప్రవేశిస్తున్నారు. కొందరి తలలు నీ పళ్ల సందులలో చిక్కి వ్రేలాడుచున్నవి. నదీజలాలు నానా విధాలుగా ప్రవహించి సముద్రానికి అభిముఖంగా పయనించి సాగరంలో ఎలా ప్రవేశిస్తున్నాయో అలాగే మానవలోకంలోని వీరులందరూ నీలోనికి ప్రవేశిస్తున్నారు. మిడతలు మోహ




# పదకొండవ అధ్యాయము
# విశ్వరూపసందర్శన యోగము

వశమున మండుచున్న అగ్నివైపు అతి వేగముతో సమీపించి నశించిపోయినట్లు ఈ వీరులందరును తమ నాశనమునకై అతి వేగముగా పరిగెత్తి నీ ముఖములలో ప్రవేశించి నశించి పోతున్నారు.

విష్ణుదేవా! మండుచున్న నీ ముఖములలో ప్రవేశిస్తున్న సమస్త లోకములను చప్పరించుచూ ఆస్వాదిస్తున్నావు. భయంకరమైన నీ తేజస్సు ఈ ప్రపంచాన్నంతటినీ తపింపచేస్తున్నది. పరమాత్మా! నీకు నా అనేక నమస్కారములు, నాకు ప్రసన్నుడవు కమ్ము. భయంకరమైన రూపం కలిగిన నువ్వెవరు? దయతో నాకు తెలుపుము. ఆది దేవుడవైన నిన్ను తెలుసుకోవాలనుకుంటున్నాను. ఎందుకంటే నీ యొక్క ప్రవృత్తి నాకు అంతుపట్టడంలేదు.

అప్పుడు శ్రీ భగవానుడు ఇలా చెబుతున్నాడు.

అర్జునా! నేను లోకాలనన్నింటిని తుదముట్టించుటకై విజృంభించిన కాలుడిని. కనుక నీవు యుద్ధము చేయకున్ననూ ప్రతిపక్షములో ఉన్న ఈ వీరులెవ్వరూ మిగలరు. అందువలన నీవు లెమ్ము, శత్రువులను జయించి కీర్తిని పొందుము. సర్వ సంపదలతో తులతూగుతున్న రాజ్యమును అనుభవించు. నా చేతిలో వీరందరూ మునుపే చంపబడిరి.





# పదకొండవ అధ్యాయము
# విశ్వరూపసందర్శన యోగము

నువ్వు కేవలం నిమిత్త మాత్రుడవు కమ్ము. ఇప్పటికే నాచే చంపబడిన భీష్మ, ద్రోణ, జయద్రథ, కర్ణాది యుద్ధ వీరులందరిని నీవు సంహరింపుము, భయపడకుము. రణ రంగమున శత్రువులను నీవు తప్పక జయింపగలవు కనుక యుద్ధము చేయుము.

శ్రీకృష్ణుని మాటలు విన్న సంజయుడు ఇలా పలికెను

రాజా! శ్రీకృష్ణపరమాత్మ యొక్క ఈ మాటలను విని అర్జునుడు వణుకుచు చేతులు జోడించి నమస్కరించి మిక్కిలి భయంతో గద్గద స్వరముతో తడబడుచు ఇలా పలికెను

ఓ హృషీకేశా! నీ వైభవాన్ని చూచి లోకము మురిసి పోతున్నది. అనురాగంతో పొంగిపోవుచున్నది. భయగ్రస్తులైన రాక్షసులు నలు దిక్కులకును పారిపోవుచున్నారు. సిద్ధ పురుషులు నమస్కరిస్తున్నారు. నీవు సర్వ శ్రేష్ఠుడవు. బ్రహ్మదేవుని కంటే ముందు నువ్వే ఆదికర్తవు, అక్షర స్వరూపుడవు. ఎవరైనా నీకు నమస్కరించకుండా ఎలా ఉండగలరు? అనంతరూపా! నీవు ఆది దేవుడవు, పురాణ పురుషుడవు, ఈ విశ్వమునకు పరమాశ్రయుడవు, సర్వజ్ఞుడవు, పరంధాముడవు. ఈ సమస్త జగత్తు నీ తోనే నిండివుంది, నీవే వాయు దేవుడవు, యముడవు, అగ్నివి, వరుణుడవు, చంద్రుడవు, బ్రహ్మ దేవుడవు, బ్రహ్మకు కూడా జనకుడవు, నీకు వేల కొలది నమస్కారములు మళ్ళీ మళ్ళీ నమస్కారములు.

అనంతమైన సామర్థ్యం గలవాడా! నీకు ముందు నుండి వెనుక నుండి నమస్కారములు, అన్ని వైపుల నుండి నీకు నమస్కారములు, నీవు జగత్తు అంతటను వ్యాపించియున్నవాడవు. అన్ని రూపములు నీవే. నీ మహిమ తెలియక చనువుతో నిన్ను నేను మిత్రమా! కృష్ణా! యాదవా! సఖా! అంటూ పూర్వం పిలిచేవాడిని ఆహార విహారాలలో, ఆసన, శయనాలలో పరిహాసానికి అపహాస్యం చేసి యుండవచ్చు. అందుకు నన్ను క్షమించుమని వేడుకొంటున్నాను. ఈ చరాచర ప్రపంచానికి నీవే తండ్రివి, పూజ్యుడివి, గురువువి, దేవుడవు. ముల్లోకములలో నీకు సాటి అయిన వారెవ్వరునూ లేరు. ఇక నీకంటె అధికుడెట్లుండును? అందుచేత నా శరీరమును నీ పాదములవద్ద అర్పించుచూ నిన్ను ప్రార్థిస్తున్నాను. కుమారుడిని తండ్రి, మిత్రుడిని మిత్రుడు, భార్యను భర్త క్షమించునట్లు నా అపరాధములను నీవు క్షమింపుము. గతంలో ఎన్నడూ చూడని నీ విశ్వరూపాన్ని చూచి పరవశించి పోవుచున్నాను. కాని భయంతో నా మనస్సు చలించిపోయింది. దేవదేవా! వెనుకటి నీ సాధారణ రూపంతోనే నాకు దర్శనమిచ్చి నన్ను అనుగ్రహించు. గద, కిరీటాలతో, చక్రధారిగా

అమరానాథ్ అమర్

# పదకొండవ అధ్యాయము
# విశ్వరూపసందర్శన యోగము



శోభించే రూపంతోనే నిన్ను చూడాలను కుంటున్నాను. సహస్రబాహో! నీ చతుర్భుజ రూపంతోనే నన్ను అనుగ్రహించు.

**అప్పుడు శ్రీకృష్ణ భగవానుడు**

అర్జునా! నా విశ్వరూపము తేజోమయము అనంతమైనది. నీపై గల అనుగ్రహము వలన నా యోగ శక్తి ప్రభావముతో నీకు నా విరాట్ రూపమును చూపించితిని. దీనిని నీవు తప్ప ఇంతకు ముందు మరి యెవ్వరును చూచియుండలేదు. మానవ లోకంలో వేదాలను, యజ్ఞ విద్యలను అధ్యయనం చేసిన వారుగాని, దానాలు ఆచరించిన వారు గాని, తపస్సు తదితర పుణ్యకర్మల చేత కాని ఈ విశ్వ రూపాన్ని దర్శించలేరు. ఈ విధమైన భయంకర రూపమును చూచి నీవు భయపడనవసరం లేదు. మోహమునకు గురి కావద్దు. నిర్భయముగా ప్రసన్నంగా ఉండు. ఇదిగో నువ్వు కోరినట్లు నా పూర్వ రూపాన్ని దర్శించు.



# పదకొండవ అధ్యాయము
# విశ్వరూపసందర్శన యోగము




సంజయుడు ఇలా పలికెను
వాసు దేవుడు ఈ విధముగా పలికి అర్జునుడికి తన పూర్వ రూపాన్ని దర్శింపచేశాడు. మహాత్ముడైన శ్రీకృష్ణుడు తన సౌమ్య రూపమును చూపి భయపడుచున్న అర్జునునకు ధైర్యము చెప్పెను. అప్పుడు అర్జునుడు జనార్ధనా! మానవరూపంలో ఉన్న సౌమ్యమైన నీ రూపాన్ని చూచి ఇప్పుడు నేను శాంతిని పొందాను, స్థిమిత పడ్డాను. నా మనస్సు ప్రసన్నంగా ఉంది. శ్రీ భగవానుడు ఇలా చెప్పెను.

సులభ సాధ్యం గాని నా దివ్య రూపాన్ని నువ్వు దర్శించావు. ఈ దర్శనం కోసం దేవతలు కూడా నిత్యము పరితపిస్తూ ఉంటారు. నీవు గాంచిన నా చతుర్భుజ రూపమును దర్శించుట వేదములచేత గాని, తపస్సు చేత గాని, దానములచేత గాని, యజ్ఞముచేత గాని, సాధ్యపడదు. విశ్వ రూపుడనైన నన్ను యథాతథంగా తెలుసుకోవాలన్నా, దర్శించాలన్నా లేదా నాలో ప్రవేశించాలన్నా అనన్య భక్తి వలననే నన్ను పొందగలరు.

ఈ విధంగా ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన శ్రీమద్భగవద్గీత యందు విశ్వరూప సందర్శన యోగము అనే 11 వ అధ్యాయము సమాప్తము.





భగవద్గీత

# పన్నెండవ అధ్యాయము
# భక్తి యోగము



## నిరాకారాన్ని ధ్యానించాలా? విగ్రహాలను పూజించాలా?

అర్జునుడు అడుగుతున్నాడు.

శ్రీ కృష్ణా! నిరంతరము నీయందే మనస్సు ఉంచి కొందరు భక్తులు సగుణ (విగ్రహ) రూప పరమేశ్వరుడివైన నిన్నే ఉపాసిస్తూ ఉంటారు. మరి కొందరు నాశరహితము, అవ్యక్తము (కనిపించని) అయిన పర బ్రహ్మమును ధ్యానిస్తూ ఉ ంటారు. ఈ ఇద్దరిలో ఉత్తమ యోగి ఎవరు?





అందుకు శ్రీ భగవానుడు

అర్జునా! మనస్సును నా యందే నిలిపి, నిరంతరము దైవచింతనా పరులై, మిక్కిలి శ్రద్ధతో విగ్రహ రూపంలో నన్ను పూజించేవారు ఉత్తమ యోగులని నా అభిప్రాయము. కాని ఇంద్రియములను వశపరచు కొనినవారు, సకల భూతములకును హితమునే కోరువారు, సర్వప్రాణులను సమ భావముతో చూసేవారిని యోగులు అంటారు. మనోబుద్ధులకు అతీతుడను, సర్వం వ్యాపించిన వాడను, నిత్యుడను, నిశ్చలుడను, నిరాకారుడను, నాశ రహితుడను ఐన నా కొరకు నిరంతరము ధ్యానము చేయువారు కూడా నన్నే పొందుదురు. అమరానాథ్ అమర్



# పన్నెండవ అధ్యాయము
# భక్తి యోగము

మనస్సును నా యందు స్థిరముగా ఉంచే సామర్థ్యము లేకపోతే అభ్యాస యోగంతో నన్ను పొందేందుకు ప్రయత్నించు. అభ్యాసములో కూడా అసక్తుడవైతే నా కొరకు పనులు చేస్తూ ఉంటూ నా నిమిత్తం కర్మలను ఆచరించుట ద్వారా కూడా నన్నే పొందెదవు. అది కూడా చేయలేక పోతే నా యోగమును ఆశ్రయించి, మనస్సును నియంత్రించు కొని, సకల కర్మ ఫలములను త్యజింపుము. అభ్యాసము కంటె జ్ఞానము శ్రేయస్కరము, జ్ఞానము కంటె ధ్యానము విశిష్టము. ధ్యానము కంటె కర్మ ఫల త్యాగము శ్రేష్ఠము. త్యాగము వలన పరమ శాంతి లభించును. ఎలాంటి భక్తుడు భగవంతుడికి ఇష్టుడు?







ఏ ప్రాణియందును ద్వేషభావము లేనివాడు, మైత్రి (స్నేహము), దయ కలవాడు, మమకారము, అహంకారములు లేనివాడు, సుఖ దు:ఖాలలో సమభావంతో ఉండేవాడు, ఓర్పు కలవాడు, నిత్య సంతోషి, యోగ యుక్తుడు, మనోనిగ్రహం కలవాడు, దృఢమైన నిర్ణయము కలవాడు, నా యందే మనస్సును, బుద్ధిని అర్పణచేసిన నా భక్తుడు నాకు ప్రియుడు. లోకమున ఎవరికిని క్షోభ కలిగింపనివాడును. ఎవరి వలనను తాను ఉత్తేజితుడు కానివాడును, హర్షము, ఈర్ష్య, భయము, ఉద్వేగము మున్నగు వికారములు లేనివాడును అట్టి భక్తుడు నాకు ప్రియుడు. కోరిక లేనివాడు, పరిశుద్ధుడు, దక్షుడు, పక్షపాత రహితుడు, ఎట్టి దు:ఖములకును

# పన్నెండవ అధ్యాయము
# భక్తి యోగము




చలింపనివాడును, సమస్త కర్మలను పరిత్యజించిన వాడు అగు భక్తుడు నాకు ప్రియుడు. దేనికి సంతోషించని, దేనిని ద్వేషించని, దేనికి దు:ఖించని, ఏదీ ఆశించని, మంచి, చెడులను త్యజించినవాడు నాకు ప్రియుడు. శత్రువులు-మిత్రులు, మానము-అవమానము, శీతలము-ఉష్ణము, సుఖము-దు:ఖము, నింద-స్తుతి మొదలగు ద్వంద్వములను సమానముగా స్వీకరించువాడు మరియు ఆసక్తిరహితుడు, మనన శీలుడు, లభించిన దానితో తృప్తి చెందేవాడు, స్థిర నివాసముల యందు ఆసక్తి లేనివాడు, నిశ్చల హృదయుడు నాకు ఇష్టుడు. పైన పేర్కొనబడిన ఉత్తమ గుణములను కలిగియుండి, ఎవరైతే నిష్కామభక్తి శ్రద్ధలతో ధర్మ రూపమైన అమృతమును సేవిస్తారో వాళ్ళు నాకు అత్యంత ప్రీతి పాత్రులు.

ఈ విధంగా ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన శ్రీమద్భగవద్గీత యందు భక్తియోగము అనే 12 వ అధ్యాయము సమాప్తము.






# భగవద్గీత
# పదమూడవ అధ్యాయము
# క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము



జ్ఞానము అంటే ఏమిటి? భగవానుడు అర్జునునితో
కౌంతేయా! ఈ శరీరము క్షేత్రము, దాని గురించి తెలుసుకొనేవాడు క్షేత్రజ్ఞుడు అని జ్ఞానులు చెబుతుంటారు. అన్ని శరీరముల యందున్న క్షేత్రజ్ఞుడను అనగా జీవాత్మను నేనే. జ్ఞానము అంటే క్షేత్ర, క్షేత్రజ్ఞులకు (శరీరము, ఆత్మలకు) సంబంధించిన జ్ఞానము అని నా అభిప్రాయము.




ఏది క్షేత్రమో, అది ఎట్లుండునో, దాని వికారములు ఏవో, ఆ వికారములు దేనినుండి ఏర్పడినవో, అలాగే క్షేత్రజ్ఞుడు అనగా ఎవరో, అతని ప్రభావమేమిటో అన్ని సంక్షిప్తముగా తెలిపెదను విను. ఈ విషయాన్ని గురించి ఋషులెల్లరును అనేక విధములుగా వివరించారు. వేదాలు వివిధ రీతుల్లో చెప్పాయి. హేతుబద్ధంగా, శాస్త్రోక్తంగా బ్రహ్మసూత్రాలు బహువిధాల నిశ్చయించాయి.
పంచ మహాభూతములు, అహంకారము, బుద్ధి, మూల ప్రకృతి, పది ఇంద్రియములు, మనస్సు, ఐదు ఇంద్రియ విషయములు (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు) కోరిక, ద్వేషము, సుఖము, దు:ఖము, దేహము, చైతన్యము, ధృతి అను వికారములతో కూడిన

# భగవద్గీత
# పదమూడవ అధ్యాయము
# క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము



సమస్తము క్షేత్రమని (శరీరమని) సంక్షిప్తంగా చెప్పబడింది. అభిమానము, డాంబికము లేకుండుట, అహింస, క్షమించుగుణము, మనస్సు, వాక్కు నందు సరళత్వము, శ్రద్ధా భక్తులతో గురుజనులను సేవించుట, శుభ్రత, అంత:కరణ స్థిరత్వము, ఆత్మనిగ్రహము, ఇంద్రియ విషయముల యందు వైరాగ్యము, అహంకార రాహిత్యము, జన్మ, మృత్యు, ముసలితనము, వ్యాధుల యందు దుఃఖ దోషములను పదే పదే దర్శించుట, భార్య, పుత్రులు, ఇల్లు సంపదలు మున్నగు వాని యందు ఆసక్తి లేకపోవడం, ఇష్టమైనది, ఇష్టం లేనిది ప్రాప్తించినా సమచిత్తంతో మెలగడం. ఇతర ఆలోచనలు లేని భక్తి, ఏకాంత ప్రదేశమున జీవనము, ప్రజల యెడల ఆసక్తి లేక పోవడం, ఆధ్యాత్మిక జ్ఞానము నందు నిత్యము స్థిరంగా ఉండటం, తత్త్వజ్ఞానార్థ దర్శనము, దీనినే జ్ఞానము అంటారు. దీనికి విపరీతమైనది అజ్ఞానము. భగవంతుడు ఎలా ఉంటాడు? ఎక్కడ ఉంటాడు?

దేనిని తెలుసుకోవడం వలన మోక్షం లభిస్తుందో దాని గురించి చెబుతాను. అతడిని తెలుసుకొనుట వలన మానవుడు పరమానందమును పొందును. అతడు సత్, అసత్లకు అతీతుడు. ఆయన చేతులు, పాదాలు, నేత్రములు, చెవులు, శిరస్సులు ముఖములు అన్నిచోట్ల వ్యాపించి ఉన్నాడు. అతడు సర్వమును ఆవరించి యున్నాడు. సర్వేంద్రియాల గురించి తెలిసినవాడు. కాని వాస్తవానికి ఇంద్రియాదులకు అతీతమైనవాడు, ఆసక్తిరహితుడు, సమస్త జగత్తును ధరించి పోషించువాడు, నిర్గుణుడు, గుణానుభవములను అనుభవించువాడు. అతడు ప్రాణుల వెలుపల మరియు లోపల ఉన్నాడు. కదలడు, కాని కదులుతూ కూడా ఉంటాడు. అతిసూక్ష్మ రూపుడు, కనుక తెలిసికొనశక్యం కాదు. అతిదూరము మరియు అతి సమీపమున కూడా ఉంటాడు. పరమాత్మ ఆకాశమువలె విభజించుటకు వీలులేని ఒకే రూపములో ఉన్నాడు. అతడు సృష్టికర్తయైన బ్రహ్మగా, పోషకుడైన విష్ణువుగా, లయకారకుడైన రుద్రునిగా ఉంటాడు.

వెలుగులకు వెలుగు, అంధకారానికి అతీతము, జ్ఞాన స్వరూపుడు జ్ఞాన గమ్యము, సర్వ ప్రాణుల హృదయంలో స్థిరమై ఉంటాడు. ఇంతవరకు క్షేత్రము, జ్ఞానము, జ్ఞేయముల గురించి సంక్షిప్తముగా వివరించితిని. దీనిని చక్కగా గ్రహించిన నా భక్తుడు నన్నే పొందుతాడు.

**పునః జన్మలు ఎందుకు కలుగుతున్నాయి?**

ప్రకృతి, పురుషుడు ఇద్దరూ ఆది లేనివారు. రాగద్వేషాది వికారములు,



త్రిగుణాత్మకములు ప్రకృతి నుండి ఉ త్పన్నములైనవి. కార్యము-కారణములను ఉత్పన్నము చేయుటలో ప్రకృతియే కారణము. సుఖ దుఃఖములను అనుభవించుటలో జీవాత్మయే హేతువు. పురుషుడు ప్రకృతిలో ఉండి, ప్రకృతి నుండి ఉత్పన్నములైన గుణాలను అనుభవిస్తున్నాడు. ఈ గుణముల సాంగత్యము వలన జీవాత్మకు ఉత్తమ, నీచ జన్మలు కలుగుతున్నాయి.

**పునః జన్మ లేకుండా మోక్షం పొందడం ఎలా?**

ఈ దేహంలో ఉన్న ఆత్మ వాస్తవముగా పరమాత్మే. అతడే ఉపద్రష్ట, భర్త, భోక్తా, మహేశ్వరుడు అని పిలవబడుచున్నాడు. ఈ విధముగా పురుషుని, ప్రకృతి స్వరూపమును తెలుసుకొన్నవాడు అన్ని విధములగు కర్తవ్య కర్మలను ఆచరించుచున్నప్పటికిని, పునర్జన్మను పొందడు. కొందరు ఆత్మను ధ్యాన యోగము ద్వారా తమ హృదయంలో దర్శిస్తారు. మరికొందరు జ్ఞాన యోగము ద్వారా, ఇంకొందరు కర్మ యోగము ద్వారా ఆత్మను దర్శిస్తారు. ఈ సాధనా మార్గముల గురించి తెలియని కొందరు ఇతరుల నుండి విని సాధన కొనసాగిస్తుంటారు. ఇలాంటి వారు కూడా మృత్యువు నుండి నిస్సందేహముగా బయటపడుదురు. ఓ అర్జునా! చరాచరాత్మకమైన ప్రాణి ఏదైతే పుట్టుచున్నదో అది క్షేత్ర, క్షేత్రజ్ఞుల కలయిక వల్లనే పుడుతున్నదని తెలుసుకో! దేహాలు నశిస్తున్నా పరమేశ్వరుడు నాశరహితుడు. ఆ దివ్యాత్మను ఎవడు చూస్తాడో వాడే నిజమైన చూపుగలవాడు.

అన్ని ప్రాణులలో సమంగా ఉండే పరమేశ్వరుని దర్శించేవాడు తనను తాను హింసించుకోడు. అందువలన అతడు పరమ గతిని పొందును. సకల కర్మలు ప్రకృతి ద్వారానే జరుగుచున్నవి. ఆత్మ కర్త కాదు అని ఎరిగినవాడు వాస్తవముగా సత్యాన్ని చూచేవాడు. వేరు వేరుగా కనిపిస్తున్న ప్రాణులన్నియు ఒకే ఆత్మయందు ఉన్నాయి. అట్లే అవి అన్నియును ఆ పరమాత్మ నుండియే విస్తరించుచున్నవి. ఇలా దర్శించే వాడు బ్రహ్మమే అవుతున్నాడు. ఆత్మ అనాది, నాశనం లేనిది. ఎట్టి కర్మలకు కర్త కాదు. కనుక ఆత్మకు కర్మలు అంటుకొనవు. సర్వత్ర వ్యాపించియున్న ఆకాశము ఆత్మ దృష్టిలో సూక్ష్మమగుట వలన వాటి గుణదోషములు ఆత్మకు అంటవు. అలాగే ఆత్మ అన్ని దేహములలో ఉన్నప్పటికి, గుణ దోషములు దానికి అంటవు. ఒక్క సూర్యుడే ఈ సమస్త జగత్తును ప్రకాశింపచేస్తున్నట్టు ఒకే ఆత్మ అన్నిప్రాణులలో ఉండి వాటన్నింటిని ప్రకాశింప చేయుచున్నది.

అమరానాథ్ అమర్

# భగవద్గీత
# పదమూడవ అధ్యాయము
# క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము






**ఈ విధముగా క్షేత్ర - క్షేత్రజ్ఞుల యొక్క భేదమును మరియు ప్రకృతి నుండి విముక్తులగుటకు ఉపాయములను జ్ఞాన నేత్రముల ద్వారా ఎరింగిన మహాత్ములు పరమగతిని పొందుదురు.**

ఈ విధంగా ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన శ్రీమద్భగవద్గీత యందు క్షేత్ర - క్షేత్రజ్ఞ విభాగ యోగము అనే 13 వ అధ్యాయము సమాప్తము.



Editing
C. AMARANATH AMAR
AMR
సవరణ
అమరనాథ్ అమర్

భగవద్గీత



# పదునాలుగవ అధ్యాయము గుణత్రయ విభాగ యోగము.

శ్రీ భగవానుడు అర్జునుడితో ఇలా పలికెను దేనిని తెలుసుకొని మునులందరూ సర్వోత్తమమైన స్థితిని పొందిరో, ఏ జ్ఞానము అన్నింటిలోను ఉత్తమమైన జ్ఞానమో, దానిని గురించి మరల చెప్పెదను. ఈ జ్ఞానమును ఆశ్రయించినవారు నా సాన్నిధ్యమును పొందుదురు. వారు సృష్టి ప్రారంభం అయినప్పుడు పుట్టరు, మరల ప్రళయ కాలమున మృతి చెందరు.

## ప్రాణుల పుట్టుకకు కారణం ఏమిటి?

ఆ గర్భమునందు నేను బీజమును బ్రహ్మ రూపమైన నా మూల ప్రకృతి సర్వ ప్రాణులకు జన్మ స్థానము. ఉంచుచున్నాను. అది సర్వజీవుల జననమునకు కారణమౌతుంది. అనేక యోనులయందు జన్మించు ప్రాణులను తన గర్భమున ధరించు మూల ప్రకృతియే ఆ ప్రాణులకు తల్లి. బీజస్థాపనచేయుచున్న నేను వాటికి తండ్రిని అనగా సర్వ ప్రాణులకు ప్రకృతి తల్లి, నేను తండ్రిని.



భగవద్గీత



# పదునాలుగవ అధ్యాయము
# గుణత్రయ విభాగ యోగము.

## గుణములు మానవుడిని ఎలా బంధిస్తాయి?


ప్రకృతి నుండి ఉత్పన్నములైన సత్త్వ, రజ, తమో గుణములు నాశనములేని ఆత్మను శరీరమున బంధించును. ఈ మూడు గుణములలో సత్త్వగుణము నిర్మలమైనది, ప్రకాశవంతమైనది మరియు వికారము లేనిది. కాని అది సుఖము మరియు జ్ఞానము చేత జీవుడు బంధించబడతాడు.

రజో గుణము రాగాత్మకము. అది కోరికలు, కామము వలన ఉత్పన్నమగును. దీని కారణమున జీవాత్మ కర్మ సాంగత్యముతో బంధించబడును. తమో గుణము అజ్ఞానముచే పుట్టినది. అది జీవాత్మను ఏమరుపాటు, సోమరితనము, నిద్రలతో బంధించును.

సత్త్వగుణము జీవుడిని సుఖములలో బంధిస్తుంది. రజో గుణము కర్మల యందు, తమో గుణము జ్ఞానమును కప్పివేసి ప్రమాదమునందు బంధించును. ఒక్కోసారి రజో, తమో గుణములను జయించి సత్త్వ గుణము వృద్ధిచెందును. ఒక్కోసారి సత్త్వ, తమో గుణములను అణచి రజో గుణము వృద్ధి చెందును, మరికొన్ని సమయాలలో సత్త్వ, రజో గుణములను అణచి తమో గుణము వృద్ధి అగును.

## ఏ గుణముల వలన ఎలాంటి ప్రభావం కలుగుతుంది?

ఏ దేహములో అన్ని ద్వారములు జ్ఞానముచే ప్రకాశించి చైతన్యం ఉత్పన్నమవుతుందో అప్పుడు అతనిలో సత్త్వగుణము వృద్ధి చెందినదని తెలుసుకొనవచ్చు. రజో గుణము వృద్ధి అయినప్పుడు లోభము మరియు ప్రాపంచిక కర్మల యందు ఆసక్తి, స్వార్థ బుద్ధితో కర్మలు ఆచరించడం, అశాంతి, కోరికలు ఉత్పన్నమగును.




అమరానాథ్ అమర్



# పదునాలుగవ అధ్యాయము
# గుణత్రయ విభాగ యోగము.

తమో గుణము అధికమైనప్పుడు చైతన్యం లేకుండుట, చేయవలసిన కర్మలు చేయకుండుట, సోమరితనము, మోహములు వ్యక్తమగును. సత్త్వ గుణము వృద్ధిచెందినప్పుడు జీవి మరణిస్తే అతడు ఉత్తమ కర్మలను ఆచరించువారు చేరెడి పవిత్ర లోకములను పొందును. రజో గుణమునందు మరణించినచో, అతడు కర్మల యందు ఆసక్తి గలవారిలో జన్మించును. తమో గుణమందు మరణిస్తే పశు, పక్షి, క్రిమి, కీటకాది జాతులలో జన్మించును.

శ్రేష్టమైన కర్మలు ఆచరించుట వలన సాత్త్విక ఫలము, రాజస కర్మలను ఆచరించుట వలన ఫలము దుఃఖము, తామస కర్మలను ఆచరించుట వలన ఫలము అజ్ఞానము. సత్త్వ గుణము వలన జ్ఞానము, రజో గుణము వలన లోభము, అలాగే తమో గుణము నుండి అజ్ఞానము కలుగును.

సత్త్వగుణం కలవారు ఊర్ధ్వ లోకములకు పోవుదురు. రజో గుణం కలవారు మధ్య (మానవ) లోకమునందే ఉ ందురు. తామస గుణం కలవారు అధోగతి పాలగుదురు. త్రిగుణములకు అతీతముగానున్న సచ్చిదానంద పరమాత్మ తత్వమును తెలుసుకున్నవాడు నా సాన్నిధ్యమునే పొందును. భౌతిక శరీరమునకు కారణమైన ఈ మూడు గుణములను అధిగమించిన వాడు జన్మ, మృత్యు, ముసలితనము, దుఃఖముల నుండి విముక్తుడై అమృత తత్త్వమును పొందును.

**మూడు గుణాలకు అతీతమైన వాని లక్షణాలు ఏమిటి?**

అర్జునుడు అడిగెను

ప్రభో! ఈ మూడు గుణములకు అతీతుడైనవాని లక్షణములు ఏవి? అతని ప్రవర్తన ఎట్లుంటుంది? జీవుడు ప్రకృతి గుణములను ఎలా అతిక్రమించగలడు?

శ్రీ భగవానుడు ఇలా చెబుతున్నాడు.

ఓ అర్జునా! ప్రకృతి గుణాలను అతిక్రమించినవాడు వికాసము (సత్త్వం), ఆసక్తి (రజో) మోహము (తమో) కలిగినప్పుడు వాటిని ద్వేషించడు. అవి తొలగిపోయినప్పుడు కాంక్షింపడు. ప్రకృతిలోని గుణములే ప్రవర్తించుచున్నవని భావించి, అతడు ఉదాసీనుడై (సాక్షిగా) ఆధ్యాత్మిక భావనలోనే నిమగ్నుడై ఉంటాడు. ఆ స్థితి నుండి ఎన్నడును చలింపడు. అతడు తన ఆత్మ యందే నిరంతరం స్థితుడై ఉంటాడు. సుఖదు:ఖములను సమానంగా భావిస్తాడు. మట్టిని, రాయిని, బంగారమును సమదృష్టితో చూస్తాడు. ప్రియము - అప్రియములకు, నిందా - స్తుతులకు, మాన - అవమానములకు తొణకడు. మిత్రులను, శత్రువులను సమానంగా




చూచును. కర్మాచరణముల యందు కర్తృత్వాభిమానము లేనివాడు త్రిగుణాతీతుడనబడును.

అనన్య భక్తి యోగముతో నన్నే నిరంతరము భజించు వాడును, మూడు గుణములను అధిగమించిన వాడును అయిన జీవుడు బ్రహ్మస్థితికి అర్హుడగును. ఏలనన అట్టి శాశ్వత పరబ్రహ్మకును, అమృతత్త్వమునకును, సనాతన ధర్మమునకును, అఖండానందమునకును నేనే ఆధారమై యున్నాను.

ఈ విధంగా ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన శ్రీమద్భగవద్గీత యందు గుణత్రయ విభాగ యోగము అనే 14 వ అధ్యాయము సమాప్తము.






www.sanatanadharm.com

అమరానాథ్ అమర్

భగవద్గీత

# పదునైదవ అధ్యాయము


# పురుషోత్తమ ప్రాప్తియోగము



## పరమేశ్వర తత్త్వమును తెలుసుకొనుట ఎలా?

**శ్రీ కృష్ణభగవానుడు ఇలా చెప్పెను**

**వేళ్లు పైకి ఉండి, కొమ్మలు క్రిందివైపు ఉన్నది, వేదములే ఆకులుగా కలిగి, శాశ్వతమైన అశ్వత్థ వృక్షము (రావిచెట్టు) ఒకటి ఉన్నదని చెబుతుంటారు. ఆ వృక్షము గురించి తెలిసినవాడు నిజముగా వేదములను ఎరిగినవాడు.**




ఆ వృక్షమును త్రిగుణములు అనెడి జలములు తడుపుచుండును. అలా పెరిగిన కొమ్మలు క్రిందికి, పైకి వ్యాపించును. చిగురాకులు విషయ భోగములు, ఈ వృక్షమునకు క్రిందికి పోవు వేళ్ళు మానవ సమాజం యొక్క మంచి పనులతో బంధించబడుచుండును. ఈ వృక్షమును బాగా పరిశీలించినప్పటికి నిజమైన రూపము లభించదు. ఎందుకంటే అది ఎక్కడ ప్రారంభమగునో, ఎక్కడ అంతమగునో ఎవరూ గ్రహించలేరు. కాని దృడ నిశ్చయముతో వైరాగ్యమనే అస్త్రముతో ఆ వేళ్ళను చేధించిన అనంతరము ఎక్కడికి చేరుకుంటే మళ్ళీ తిరిగిరారో, అట్టి పరమేశ్వర తత్త్వమును చేరుకుంటారు.

అమరానాథ్ అమర్

# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



అనాది కాలము నుండి ఎవని వలన సర్వమును ఆరంభమైనదో, ఎవరివలన సర్వము వ్యాపించెనో ఆ పరమేశ్వరుడిని శరణు పొందవలెను. దురభిమానము, మోహము, ఆసక్తిని, దోషములను జయించినవారు శాశ్వత తత్త్వమును తెలుసుకున్న వారు మరియు సుఖ-దు:ఖములు అనే ద్వంద్వముల నుండి విముక్తులైన జ్ఞానులు, ఆ పరమపదమును చేరుదురు.




స్వయం ప్రకాశవంతమైన నా పరంధామమును సూర్యుడు గాని, చంద్రుడు గాని, అగ్నిగాని ప్రకాశింపచేయలేవు. దానిని చేరిన పుణ్యాత్ములు మరలా ఈ ప్రపంచంలో తిరిగి జన్మించరు. ఈ లోకములో ఉన్న జీవులన్ని నా శాశ్వత అంశములే. అవి ప్రకృతి యందు ఉన్న మనస్సు, ఇంద్రియములు, శబ్దాది విషయముల ద్వారా తనవైపు ఆకర్షించును.

**ఆత్మ క్రొత్త శరీరములో ప్రవేశించినట్లు తెలుసుకోవడం ఎలా?**

వాయువు వాసనలను ఒక చోటినుండి మరియొక చోటికి తీసికొని పోవునట్లు జీవాత్మ ఒక శరీరమును త్యజిస్తున్నప్పుడు మనసు, ఇంద్రియములను గ్రహించి వాటితో మరొక శరీరములోనికి ప్రవేశించును. ఈ జీవుడు మరొక శరీరము గ్రహించి


అమరనాథ్ అమర్


# పదునైదవ అధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తియోగము



మనస్సుతో కూడిన చెవి, కన్ను, జిహ్వ (నాలుక), ముక్కు, స్పర్శ శక్తిని పొందును. వాటి ద్వారా శబ్దాది విషయములను అనుభవించును. జీవాత్మ పాత శరీరము త్యజించి, కొత్త శరీరంలోకి ప్రవేశించినప్పుడు, భోగాలను అనుభవించినప్పుడు అజ్ఞానులు తెలుసుకోలేరు. కాని జ్ఞానులు తమ జ్ఞాన నేత్రముల ద్వారా వాటన్నింటిని చక్కగా తెలుసుకోగలరు. ఆధ్యాత్మిక సాధనయందు నిమగ్నులై ఆత్మ సాక్షాత్కారమునందు ప్రయత్నశీలురైన యోగులు వీటన్నింటిని తెలుసుకొనగలరు. కాని అంత:కరణ శుద్ధి లేని అజ్ఞానులు ఎంత ప్రయత్నించినప్పటికి ఈ ఆత్మను తెలుసుకొనలేరు.

### మానవ శరీరములో భగవంతుడు ఎక్కడ ఉంటాడు?

ఈ సమస్త జగత్తును ప్రకాశింపచేయు సూర్య, చంద్ర, అగ్ని తేజస్సు నా నుండియే ఉత్పన్నమగుచున్నది. నేను పృథ్వి యందు ప్రవేశించి నా శక్తిచేత సకల ప్రాణులను ధరించి పోషించుచున్నాను. నేను చంద్రుడినై ఔషధులన్నింటికి జీవరసమును సమకూరుస్తున్నాను.



భగవద్గీత

# పదునైదవ అధ్యాయము

# పురుషోత్తమ ప్రాప్తియోగము




నేను జీవుల యొక్క శరీరముల యందు జఠరాగ్నిగా ఉండి, నాలుగు విధములైన ఆహారములను జీర్ణము చేయుచున్నాను. నేను ప్రతి ప్రాణి యొక్క హృదయములో ఉంటాను. నా నుండియే స్మృతి, జ్ఞానము, సంశయములు కలుగును. వేదముల ద్వారా తెలిసికొనదగిన వాడను నేనే. వేదాంత కర్తను, వేదములను తెలిసిన వాడను నేనే.

**జీవులు ఎన్ని రకాలు?**

ఈ లోకములో నశ్వరుడు, అనశ్వరుడు అనే రెండు రకాల జీవులు కలరు. భౌతిక ప్రపంచమున ప్రతి జీవియు నశ్వరమే(నాశనం అవుతుంది). ఆధ్యాత్మిక ప్రపంచమున ప్రతిజీవి నాశరహితుడు. ఈ ఇద్దరి కంటే శ్రేష్ఠుడైన పురుషుడు వేరొకడు కలడు. అతడే ముల్లోకముల యందును ప్రవేశించి, పోషిస్తున్న పరమేశ్వరుడు. ఎలాగంటే నశ్వరమైన, అనశ్వరమైన దానికంటే నేను అతీతుడను. నాశరహితమైన జీవాత్మ కంటే ఉత్తముడు అగుటచేత నేను లోకమునందును, వేదముల యందును పురుషోత్తమునిగా ప్రసిద్ధికెక్కితిని.

ఓ అర్జునా! ఎవడు సందేహము లేకుండా నన్ను పురుషోత్తమునిగా తెలుసుకుంటాడో అతడు భక్తితో నిరంతరము నన్నే పరమేశ్వరునిగా భజించును. అత్యంత రహస్యమైన ఈ శాస్త్రమును నీకు తెలిపితిని. దీనిని తెలుసుకున్న బుద్ధిమంతుడు జ్ఞానియై కృతార్థుడుకాగలడు.

ఈ విధంగా ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన శ్రీమద్భగవద్గీత యందు పురుషోత్తమ ప్రాప్తి యోగము అనే 15 వ అధ్యాయము సమాప్తము.




www.sanatanadharm.com

అమరానాథ్ అమర్

భగవద్గీత

# పదహారవ అధ్యాయము

## దైవాసుర సంపద్విభాగ యోగము




### దైవీ గుణములు ఏవి?

శ్రీ భగవానుడు అర్జునుడితో ఇలా చెబుతున్నాడు.
భయం లేనివాడు, అంత:కరణశుద్ధి, జ్ఞాన సముపార్జన, దానము, ఇంద్రియ నిగ్రహము, యజ్ఞము చేయుట, వేదశాస్త్రముల పఠనము, తపస్సు, సరళత్వము, అహింస, సత్యము, కోపం లేకుండుట, త్యాగము, శాంతి, ఇతరుల దోషములను ఎంచకుండుట, దయ, లోభం లేకుండుట, కోమలత్వం, సిగ్గు, వ్యర్థ చేష్టలు చేయకుండుట, తేజస్సు, ఓర్పు, ధైర్యము, శుచిత్వము, ఎవ్వరిపైనా శత్రుభావన లేకుండుట, అందరు తనను గౌరవించాలనే కోరిక లేకుండుట. ఈ లక్షణములు దైవీసంపద కలవారి యందు ఉంటాయి.

### మానవులు ఎన్ని రకాలు?

పార్థా! కపటము, మొండితనము, అహంకారము, క్రోధము, పరుషత్వం (కఠినత్వం) అజ్ఞానము మొ//వి. అసుర ప్రవృత్తి కలవారి లక్షణాలు. దైవగుణాలు ముక్తిదాయకము, అసురీ గుణాలు బంధము కలిగించును.

ఓ అర్జునా! నీవు దైవీసంపదతో పుట్టిన వాడవు కావున శోకింపకుము. ఈ లోకములోని మానవులు రెండు రకాలుగా ఉంటారు. దైవీ లక్షణాలు కలవారు కొందరు, రాక్షస లక్షణాలు కలవారు మరికొందరు, దైవీ లక్షణాలు విస్తృతముగా చెప్పితిని, ఇప్పుడు ఆసుర లక్షణముల గురించి వివరంగా చెబుతాను విను.




అమరానాథ్ అమర్

భగవద్గీత

# పదహారవ అధ్యాయము

# దైవాసుర సంపద్విభాగ యోగము



## ఆసుర లక్షణాలు ఏవి?

ఆసుర స్వభావం కలవారు దేనిని చేయాలో, దేనిని చేయకూడదో ఎరుగరు. వారిలో శుభ్రత కాని, సదాచారముగాని, సత్యముగాని ఉండవు. ఈ జగత్తుకు ఆధారం లేదని, అసత్యమని, దేవుడు లేడని, కేవలం కామము వలన జీవులు పుడుతున్నారని, కావున సృష్టికి మూలము కామము తప్ప మరొక కారణము లేదని చెబుతుంటారు. ఇలాంటి దృష్టితో ఉ న్నవారు ఆత్మను నమ్మరు. వారు అల్పబుద్ధులై అందరికి అపకారము చేస్తారు వారి శక్తి సామర్థ్యములు ప్రపంచ నాశనము కొరకు వినియోగిస్తారు.

తీరని కోరికలు కలవారై, గర్వము, దురహంకారము, మదము కలిగి అశాశ్వత విషయములను అంగీకరించి అపవిత్రమైన పనులు చేస్తుంటారు. మరణించు వరకు వారు అధిక బాధలలోనే మునిగిపోతారు. కామము, భోగములను అనుభవిస్తూ అదియే శాశ్వత సుఖమని భావిస్తారు. వారు ఆశ అనే పాశముతో ఎల్లప్పుడు బంధింప బడుచుందురు. కామ, క్రోధములకు లోనై ఇంద్రియ తృప్తి కొరకు వారు అక్రమ మార్గములలో డబ్బు సంపాదిస్తూ ఉంటారు.

ఆసుర ప్రవృత్తి కలవారు అజ్ఞానముతో ఇలా అనుకుంటూ ఉంటారు. నేను ఇప్పటికే చాలా పొందితిని. ఇంకా నా కోరికలు తీర్చుకోగలను. ఇప్పటికే నా దగ్గర ఎంతో ధనము ఉంది, భవిష్యత్తులో ఇంకా సంపాదించగలను. నేను నా శత్రువులను చంపితిని, ఇతర శత్రువులను కూడా చంపగలను, నేను సర్వమునకు అధిపతిని, అన్నింటిని అనుభవిస్తాను. నేను పరిపూర్ణుడను, నేను బలవంతుడను, సౌఖ్యవంతుడను, నేను భాగ్యవంతుడను, గొప్ప బంధు వర్గము కలవాడను, నాతో సమానుడు ఎవ్వరూ లేడు, నేను యజ్ఞములు చేయగలను, దానములు చేయగలను. యథేచ్ఛగా ఆనందించగలను. అని అనుకుంటూ అజ్ఞానములో, భ్రాంతిలో జీవిస్తూ ఘోరనరకముల యందు పడిపోతుంటారు. వారు స్వయం సంతుష్టులు, గర్వితులు, ధనము చేత దురాభిమానముతో కన్ను, మిన్ను గానక, శాస్త్ర విరుద్ధముగా నియమ, నిబంధనలను అనుసరించ కుండా పేరుకు మాత్రమే యజ్ఞములను ఆచరిస్తూ ఉంటారు.

అహంకారము, బలము, దర్పము, కామము, క్రోధములకు వశులై తమ శరీరములోను ఇతర శరీరములలోను, ఉన్న నన్ను ద్వేషిస్తూ ఉంటారు. అలాంటి పాపాత్ములను, క్రూరులను, నరాధములను నేను ఎల్లప్పుడు ఆసురీ యోనులలోనే పడవేయుచుందును. ఈ విధంగా ఆసురీ యోనులలో మళ్ళీ మళ్ళీ జన్మిస్తూ ఉన్న

# పదహారవ అధ్యాయము

## దైవాసుర సంపద్విభాగ యోగము



ఆసురులు నన్ను పొందజాలరు. క్రమముగా అంతకంటే హీనమైన జన్మలను పొందుతారు.

**నరకానికి ద్వారములు ఎన్ని? అవి ఏవి?**


కామము, క్రోధము, లోభము అను ఈ మూడు గుణాలు నరక ద్వారములు. అవి ఆత్మ నాశనమునకు కారణములు. అందువలన ఈ మూడింటిని త్యజించవలెను. కావున అర్జునా ఈ మూడింటి నుండి బయట పడినవాడు ఆత్మోన్నతికి అనుకూలమైన పనులుచేస్తూ నన్నే పొందుతారు.

శాస్త్రములు చెప్పింది చేయకుండా ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించువాడు సిద్ధిని (పరిపూర్ణతను), పరమగతిని, చివరికి సుఖమును కూడ పొందలేడు. నీవు చేయవలసినది ఏది? చేయకూడనిది ఏది? అని చెప్పడానికి నీకు శాస్త్రమే ప్రమాణము. అందుకని శాస్త్రములో ఉన్న నియమాలను, కర్మలను బాగా తెలుసుకొని ఆచరించుము.

**ఈ విధంగా ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన శ్రీమద్భగవద్గీత యందు దైవాసుర సంపద్విభాగ యోగము అనే 16 వ అధ్యాయము సమాప్తము.**










అమరానాథ్ అమర్

# పదునేడవ అధ్యాయము
# శ్రద్ధాత్రయ విభాగ యోగము



అర్జునుడు ఇలా అడిగెను
ఓ కృష్ణా! శాస్త్రవిధితో, భక్తిశ్రద్ధలతో కొందరు యజ్ఞములు, దైవపూజలు, చేస్తుంటారు కదా! వారి నిష్ఠ సాత్వికమా?
రాజసమా? తామసమా?
మానవులను ఎన్ని విధాలుగా విభజించవచ్చు?
భగవానుడు ఇలా చెప్పెను.
ప్రకృతిని అనుసరించి మానవులను సాత్వికులు, రాజసికులు, తామసికులు అనే మూడు విధములుగా విభజించవచ్చు. తన అంతఃకరణకు తగినట్లు మనిషి జీవన విధానం ఉంటుంది. వారిలో సత్త్వ గుణము కలవారు దేవతలను, రజో గుణము కలవారు రాక్షసులను, తామస గుణం కలవారు భూత, పిశాచములను పూజిస్తారు. గర్వముతో, అహంకారముతో, కోరికలపై ఆసక్తి కలిగి, శాస్త్ర విరుద్ధముగా ఘోర తపస్సు ఆచరిస్తూ పంచ భూతములతో నిర్మాణమయిన ఈ శరీరమును, అందులో అంతర్యామిగా ఉన్న పరమాత్మను కూడా బాధించు వారిని రాక్షసులు అంటారు.
ఏ గుణమువారు ఎలాంటి ఆహారము తింటారు?



భగవద్గీత

# పదునేడవ అధ్యాయము

# శ్రద్ధాత్రయ విభాగ యోగము



ప్రతి వ్యక్తి తినే ఆహారమును అనుసరించి మూడు విధాలుగా ఉంటారు.
సత్త్వ గుణమువారు తిను ఆహారము ఆయుష్షు, బుద్ధి, బలము, ఆరోగ్యము, సుఖములను వృద్ధి చేస్తుంది. ఉదా:- రస (పాలు, చక్కెర) స్నిగ్ధ (వెన్న, నెయ్యి) పదార్థములు మరియు సహజంగా మనస్సుకు ప్రీతికరమైన పదార్థములు సత్త్వ గుణం వారికి ప్రియమైనవి. చేదు, పులుపు, ఉప్పు, కారము, మిక్కిలి వేడి వస్తువులు, మాడిన పదార్థములు, దాహం కలిగించేవి, దుఃఖము, చింత, రోగము కలిగించే ఆహార పదార్థములు రాజస గుణం గలవారికి ఇష్టము.
సరిగ్గా ఉడకనివి, పండనివి, రుచిహీనమైనవి, చెడు వాసన వచ్చేవి, పాసిపోయినవి, ఎంగిలి వస్తువులు, నిషిద్ధ మరియు అపవిత్రమైన పదార్థములు మొదలగునవి తామస గుణం వారికి ఇష్టమైనవి.

**యజ్ఞములు ఎన్ని రకాలు?**

శాస్త్రోక్తముగా ప్రతిఫలాపేక్ష లేకుండా కర్తవ్యముగా భావించి చేయబడిన యజ్ఞము సాత్త్విక యజ్ఞము. నిష్ఠ లేకుండా ఆడంబరం కొరకు, ఫలితము ఆశించి చేయబడు యజ్ఞము రాజస యజ్ఞము. శాస్త్రవిరుద్ధముగా, అన్న దానము లేకుండా మంత్ర విహీనమైనది, దక్షిణ లేకుండా, శ్రద్ధ లేకుండా చేసే యజ్ఞము తామస యజ్ఞము.

**తపస్సు ఎన్ని రకాలు?**

దేవతలను, బ్రాహ్మణులను, గురుజనులను, జ్ఞానులను సేవించుట, పవిత్రము, నిరాడంబరము, బ్రహ్మచర్యము, అహింస అనునవి శారీరక తపస్సు. ఉద్వేగము కలిగింపనిది, ప్రియమైనది, సత్యము, లాభము కలుగునది, యథార్థమైన మాటలు, అలాగే వేద శాస్త్రములు పఠించడము, నామ జపము మొదలైనవి వాక్కునకు సంబంధించిన తపస్సు. మానసిక ప్రశాంతత, శాంత స్వభావము, మౌనము, ఆత్మనిగ్రహము, అంతఃకరణశుద్ధి మొదలైన వాటిని మానసిక తపస్సు అంటారు. ఫలాపేక్ష లేకుండా మిక్కిలి శ్రద్ధతో శారీరక, వాక్కు, మానసిక తపస్సులను ఆచరించుటను సాత్త్విక తపస్సు అంటారు.
ఇతరుల నుండి గౌరవము, సత్కారము, పూజలు అందుకొనుటకు, స్వార్థ ప్రయోజనము ఆశించి చేసేది రాజస తపస్సు. ఇది శాశ్వతము కాదు. మొండితనంతో తన మనస్సు, వాక్కు, శరీరములను బాధ కలిగించునది, ఇతరులకు కూడా కీడు కలిగించేది అయిన తపస్సు తామస తపస్సు అంటారు.

భగవద్గీత

# పదునేడవ అధ్యాయము

# శ్రద్ధాత్రయ విభాగ యోగము



### దానము ఎలా చేయాలి?


ప్రతిఫలము ఆశించకుండా మంచి ప్రదేశములో సరియైన కాలములో తగిన వ్యక్తికి ఇచ్చిన దానము సాత్త్విక దానము. ప్రతిఫలము ఆశించి, ఒత్తిడికిలోనై, బాధపడుచు, విసుగుతో చేయబడిన దానము రాజస దానము. దానం పుచ్చుకొను వారి యెడల గౌరవం లేకుండా తృణీకార భావంతో, దేశము, కాలము అనే ఆలోచన లేకుండా అయోగ్యులకు చేయబడిన దానము తామస దానము.

### ఓం, తత్, సత్ అనే పదాలను ఎప్పుడు ఉపయోగించాలి?

ఓం, తత్, సత్ అను పదములు పరబ్రహ్మను సూచించును. ఆ పరబ్రహ్మ నుండే సృష్టి ప్రారంభంలో వేదాలు, బ్రాహ్మణులు, యజ్ఞములు ఏర్పాటు చేయడం జరిగింది. అందుకని వేదమంత్రములు పఠించువారు యజ్ఞము, దానము, తపములను నియమానుసారం చేసేవారు ఎల్లప్పుడు "ఓమ్" అను పరమాత్మ నామమును ఉచ్చరిస్తూ ప్రారంభిస్తారు. మోక్షం కావాలనుకునే వారు ఫలాపేక్ష లేకుండా యజ్ఞము, తపస్సు, దానములన్నీ పరమాత్మవే అనే భావముతో "తత్" అను నామము ఉచ్చరించుచు చేయుదురు.

సత్య భావము, శ్రేష్ఠభావము మరియు ఉత్తమ కర్మలను ఆచరించే ముందు "సత్" అను శబ్దము వినియోగిస్తారు. పరమాత్మ కొరకు చేయు యజ్ఞ, దాన, తపః క్రియలన్నింటిని "సత్" అని అంటారు. శ్రద్ధ లేకుండా చేయబడిన యజ్ఞ, దాన, తపములను "అసత్" అని అంటారు. దాని వలన జీవితకాలంలో కాని మరణించిన తరువాత గాని ఉపయోగము ఉండదు.

ఈ విధంగా ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన శ్రీమద్భగవద్గీత యందు శ్రద్ధాత్రయ విభాగ యోగము అనే 17 వ అధ్యాయము సమాప్తము.



భగవద్గీత

# పదునెనిమిదవ అధ్యాయము
# మోక్ష సన్యాస యోగము



**అర్జునుడు ఇలా అడిగెను.**

ఓ మహాబాహో! నేను త్యాగము మరియు సన్న్యాసముల యొక్క ప్రయోజనములను వేరు వేరుగా తెలుసుకొన కోరుచున్నాను.

శ్రీకృష్ణ భగవానుడు ఇలా చెబుతున్నాడు. కోరికలతో కూడిన పనులను వదులుకొనుటయే సన్న్యాసమని కొంతమంది పండితులు చెబుతారు. సర్వకర్మ ఫలములను త్యజించుటయే త్యాగమని బుద్ధిమంతులు తెలుపుతారు. కొందరు అన్ని కర్మలు దోషములతో ఉన్నవి, కాబట్టి అన్ని కర్మలను త్యజించాలంటారు. కాని యజ్ఞ, దాన, తపః కర్మలు వదల కూడదు అని మరికొందరు అంటారు.

**ఎలాంటి త్యాగము వలన ఎలాంటి ప్రయోజనము కలుగుతుంది?**

మొదట త్యాగము గురించి చెబుతాను. అది సత్త్వ, రజ, తమో గుణాలనే మూడు విధములుగా ఉంటుంది. యజ్ఞము, దానము, తపము అనే కర్మలు మహాత్ములను పవిత్రము చేయును. కావున వాటిని విడవకుండా తప్పకుండా చేయాలి. ఆసక్తి లేకుండా, ఫలాపేక్ష లేకుండా కర్మలన్నింటిని చేయవలెను. అదే ఉత్తమమని నా అభిప్రాయము. నిర్దిష్ట కర్మలను విడువరాదు.




అమరానాథ్ అమర్

# పదునెనిమిదవ అధ్యాయము
# మోక్ష సన్యాస యోగము



ఒకవేళ మోహావేశమున వాటిని త్యజించటాన్ని తామస త్యాగము అంటారు. కర్మలన్నియు దుఃఖ కారణములు, శరీరమునకు / కష్టము కలిగించును అని భయపడి కర్తవ్య కర్మలను త్యజించుట రాజస త్యాగము అంటారు. అట్టి త్యాగము వలన ఎట్టి ఫలితము లభించదు.
శాస్త్రములో చెప్పబడిన కర్మలను కర్తవ్యముగా భావించి, వాటి యందు ఫలాసక్తి త్యజించి కర్మలు చేయటమే సాత్త్విక త్యాగము. అశుభ కార్యములను ద్వేషించకుండా, సుఖమైన పనుల యందు ఆసక్తి లేకుండా, సదా సత్త్వ గుణమునందుండు బుద్ధిమంతుడే త్యాగి. ప్రతి శరీరధారికి కర్మలన్నింటిని త్యజించడం సాధ్యము కాదు. కావున కర్మ ఫలములను త్యజించిన వాడే నిజమైన త్యాగి అని అంటారు. కర్మ ఫలత్యాగము చేయని వారికి మంచి, చెడు, మిశ్రమ అను మూడు ఫలితాలు ఉంటాయి. వాటిని మరణము తరువాత కూడా అనుభవించవలసిందే. కాని కర్మ ఫల త్యాగము చేసిన కర్మ యోగులు తమ కర్మ ఫలమును అనుభవించ వలసిన అవసరం లేదు.

### కర్మలు చేయటానికి కారణాలు ఏమిటి?

వేదాంతమును అనుసరించి సర్వ కార్యముల సిద్ధికి ఐదు కారణములు కలవు. అవి
1. అధిష్ఠానము (దేహము), 2. కర్త, 3. సాధనములు, 4. వివిధ ప్రయత్నములు
5. దైవము
మానవుడు మనస్సు, వాక్కు, శరీరముతో మంచి చేసినా, చెడు చేసినా దానికి పైన చెప్పిన ఐదు కారణమౌతాయి. అలా కాకుండా ఆత్మను సర్వ కర్మలకు కర్తగా భావించేవాడు అజ్ఞాని. అలాంటి వాడు యథార్థమును గ్రహించలేడు.



# పదునెనిమిదవ అధ్యాయము
# మోక్ష సన్యాస యోగము



అంతఃకరణము నందు కర్తృత్వ భావము లేని వాని బుద్ధి ప్రాపంచిక విషయముల యందు, కర్మల యందు అంటుకొనదు. అలాంటి మానవుడు ఈ లోకములో ఎందరిని చంపినా ఆ హత్యలకు అతడు బద్ధుడు కాడు. అతనికి పాపము అంటదు.

## కర్మలు చేయడానికి ప్రేరేపించేది ఏది?

జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాత అను మూడూ కర్మలు చేయడానికి ప్రేరేపించును. కర్త, కార్యము, ఇంద్రియములు అను మూడు కర్మ సంగ్రహము నందలి అంశములు. ప్రకృతి గుణముల భేదములను అనుసరించి జ్ఞానము, కర్మ, కర్త అనునవి మూడు విధములుగా ఉండును. వాటి గురించి వివరిస్తాను.

## జ్ఞాని అంటే ఎవరు? జ్ఞానము ఎన్ని రకాలు?

ఈ ప్రపంచంలోని ప్రాణులు వేరు వేరుగా కనిపిస్తున్నప్పటికి ఆ జీవుల యందు నివసించు పరమాత్మ ఒక్కడే అని ఎవరు తెలుసుకుంటారో అతను జ్ఞాని. అలాంటి పురుషుని జ్ఞానమును సాత్విక జ్ఞానము అంటారు. సమస్త ప్రాణుల యందును వేరు వేరు జీవము ఉన్నదని భావించు వారి జ్ఞానమును రాజస జ్ఞానము అంటారు. శరీరమునే సమస్తముగా భావించి దానియందు ఆసక్తి కలిగించే పనులు చేస్తూ ఉండే అల్పమయిన జ్ఞానమును తామస జ్ఞానము అంటారు.

## కర్మలు ఎన్ని రకాలు?




అమరానాథ్ అమర్

# పదునెనిమిదవ అధ్యాయము

# మోక్ష సన్యాస యోగము




క్రమ బద్ధమైనది, రాగ ద్వేషములు లేనిది, ఫలాపేక్ష లేకుండా చేయబడు కర్మను సాత్విక కర్మ అంటారు. కోరికలు తీర్చుకొనుటకు అహంకారము చేత, మిక్కిలి శ్రమతో, ప్రయాసతో చేసే కర్మలను రాజస కర్మలు అంటారు. భవిష్యత్తులో జరుగు హాని, హింస, నాశనమును చూసుకోకుండా తన వ్యక్తిగత స్వార్థము కొరకు చేయు కర్మలు తామస కర్మలు అంటారు.

### కర్త ఎన్ని రకాలు?

ఆసక్తి వదిలి, అహంకారము లేకుండా ధైర్యము ఉత్సాహముతో జయ- అప జయములను చూడకుండా స్వధర్మమును నిర్వహించువాడు సాత్త్విక కర్త. పనియందు, దాని ఫలితము యందు ఆసక్తి కలవాడు లోభి, అపవిత్రముగా ఇతరులను కష్టపెట్టువాడు, ఆనందము, శోకమునకు లోనగువాడు రాజస కర్త. శాస్త్ర విరుద్ధ పనులు చేస్తూ మొండితనంతో, వంచనతో ఇతరుల పనులను చెడగొడుతూ ఉండేవాడు, సోమరి, ఎల్లప్పుడు దిగులుగా ఉంటూ ప్రతి పని ఆలస్యముగా చేసేవాడు తామస కర్త. ఓ ధనంజయా! ఇప్పుడు నీకు బుద్ధి, ధారణశక్తి యొక్క మూడు గుణములను గురించి చెబుతాను విను.

### బుద్ధి ఎన్ని రకాలు?

శాస్త్రము చెప్పినట్లు చేయుట. కర్తవ్యము చేయకుండుట, అకర్తవ్యము, భయము, అభయము, అలాగే బంధము, మోక్షమును గురించిన యథార్ధమును బుద్ధితో తెలుసుకొని ఆచరించేది సాత్వికఔ బుద్ధి. ధర్మ- అధర్మములను, కర్తవ్యము-అకర్తవ్యముల యొక్క భేదము తెలుసుకోలేని బుద్ధిని రాజస బుద్ధి అంటారు. అజ్ఞానముతో ధర్మమును అధర్మముగా, అధర్మమును ధర్మముగా భావించి ఎల్లప్పుడూ తప్పు త్రోవలో పోవు బుద్ధిని తామస బుద్ధి అంటారు.




అమరానాథ్ అమర్

భగవద్గీత

# పదునెనిమిదవ అధ్యాయము
# మోక్ష సన్యాస యోగము



## ధృతి ఎన్ని రకాలు?

చలించని ధారణా శక్తితో, ధ్యాన యోగముతో మనస్సు, ప్రాణము ఇంద్రియాల యొక్క కార్యకలాపములను నిగ్రహించేది సాత్త్విక ధృతి. ఫలితములపై ఆసక్తితో ధర్మము, అర్థము, కామములను చేయు శక్తిని రాజస ధృతి అంటారు. నిద్ర, భయము, శోకము, విషాదము, గర్వము మొదలగు వాటిని అధిగమించలేక మందబుద్ధితో కూడినది తామస ధృతిఅంటారు.

సుఖముల గురించి చెప్పెదను విను మొదట విషమువలె కష్టముగా ఉన్నప్పటికి, తరువాత అమృతతుల్యమైన సుఖమును కలిగించి ఆత్మ సాక్షాత్కారమునకు ఏది మార్గము చూపునో, అది సాత్త్విక సుఖము. ప్రారంభంలో ఇంద్రియములకు తాత్కాలిక సుఖము కలిగించి తరువాత విషతుల్యముగా ఉండే సుఖమును రాజస సుఖము అంటారు. ఆత్మ సాక్షాత్కారమునకు వ్యతిరేకంగా నిద్ర, సోమరితనము, మోహము వలన కలుగు సుఖమును తామస సుఖము అంటారు. సమస్త లోకములలో ప్రకృతి నుండి ఉత్పన్నమైన ఈ మూడు గుణములు లేకుండా ఏ ప్రాణియు లేదు.

## మానవుల వర్ణ విభజన దేని ఆధారంగా చేశారు? వారి లక్షణాలు ఏమిటి?

ఓ పరంతపా! బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుల కర్మలను వారివారి స్వభావములను, గుణములను బట్టి విభజించడం జరిగింది. శాంతి, ఆత్మ నిగ్రహము, తపస్సు, శుభ్రత, సహనము, ధర్మ ప్రవర్తన, జ్ఞానము భగవంతుని యందు విశ్వాసము అను గుణములు కలవారు బ్రాహ్మణులు. శౌర్యము, తేజస్సు, ధైర్యము, దక్షత, యుద్ధము చేయుట, దానములు ఇవ్వడం, నాయకత్వం అనునవి క్షత్రియ గుణములు. వ్యవసాయం, గోరక్షణ, వర్తకము వైశ్యుల సహజ కర్మలు. అలాగే అన్ని వర్ణముల వారిని సేవించుట, పరిశ్రమ చేయుట శూద్రుల సహజ కర్మలు. స్వీయ గుణములను అనుసరించి ప్రతి వ్యక్తి కర్మలు చేయుట వలన పరమ సిద్ధిని పొందును. అది ఎలా జరుగునో వివరిస్తాను విను.



అమరానాథ్ అమర్

# పదునెనిమిదవ అధ్యాయము
# మోక్ష సన్న్యాస యోగము



## ఆత్మ సాక్షాత్కారము ద్వారా పరమ సిద్ధిని పొందడం ఎలా?

సర్వ జీవులకు మూలకారణమును, సర్వ వ్యాపకుడను అయిన భగవంతుడిని తన స్వాభావిక కర్మలను ఆచరిస్తూ, పూజిస్తూ ఉండే మానవుడు పరమ సిద్ధిని పొందును. ఇతరులు ఆచరించే పరధర్మము ఎంత బాగున్నను స్వధర్మమును ఆచరించుటయే శ్రేష్ఠము. స్వభావమును అనుసరించి కర్మలు చేయుటవలన మనుష్యునికి ఎట్టి పాపములు అంటవు.

దోషముతో ఉన్నప్పటికి తన సహజ కర్మలను వదిలి వేయరాదు. ఎందుకంటే అగ్ని పొగతో ఆవరించినట్లు అన్ని కర్మలును ఏదేని ఒక దోషము కలిగి ఉన్నవి. ప్రాపంచిక విషయములపై ఆసక్తి లేకుండా, అనాసక్తుడు, అంతః కరణములను జయించినవాడు అయిన వ్యక్తి సన్యాస స్వభావముచే కర్మ ఫలాసక్తి లేని సిద్ధిని పొందును. జ్ఞాన యోగము ద్వారా సిద్ధి పొందు విధానము మరియు దాని ద్వారా బ్రహ్మమును ఎలా పొందగలడో చెబుతాను విను.

పరిశుద్ధమైన బుద్ధి కలిగి సాత్త్విక ఆహారం మితంగా తింటూ, మనస్సును నిగ్రహించి పరిశుభ్రమైన ప్రదేశంలో ఏకాంతంగా నివసిస్తూ, మనస్సు, వాక్కు, ఇంద్రియములను అదుపులో ఉంచుకొని రాగము, ద్వేషము ఎల్లప్పుడు వదిలి, అహంకారము, బలము, దర్పము, కామము, కోపము, మోహము వదిలిపెట్టి నిరంతరము ధ్యానయోగము నందు సాధన చేసే వాడికి ఆత్మసాక్షాత్కార స్థితి తప్పక కలుగుతుంది.




అమరనాథ్ అమర్


# పదునెనిమిదవ అధ్యాయము
# మోక్ష సన్యాస యోగము



పరబ్రహ్మమును, ఆత్మ సాక్షాత్కారమును పొందిన యోగి దేనిని ఆశించకుండా, దేనికి శోకింపకుండా, ప్రతి జీవియందు సమభావముతో ఉంటాడు. అట్టి యోగి నా పరాభక్తిని పొందును. ఆ పరాభక్తితో నా యథార్థ తత్త్వమును తెలిసికొనును. ఆవిధంగా భక్తితో నన్ను పూర్తిగా తెలుసుకొన్న వెంటనే అతడు నాలో లీనమగును. కర్మలన్నింటిని ఎల్లప్పుడు చేయుచు, ఆయా కర్మల ఫలితములైన సమస్త భోగములను త్యజించి నన్నే ఆశ్రయించిన కర్మ యోగి నా అనుగ్రహము చేత సనాతనమైన, శాశ్వతమైన పరమ పదమును పొందును.

## ఎవరి వలన ఆనందము, శాంతి లభిస్తుంది?

అన్ని కర్మలను నిండుమనస్సుతో నాకే సమర్పించుము, నన్నే నీ గమ్యముగా పెట్టుకొని పనిచేయుము, నాయందు మనస్సు పెట్టినచో నా అనుగ్రహము వలన అన్ని సమస్యల నుండి సునాయాసముగా బయటపడగలవు. అలా కాకుండా అహంకారంతో నా మాటలు వినకుండా పెడచెవిన పెట్టినచో నష్టములు పొంది నశించి పోతావు. అర్జునా! నీవు అహంకారంతో నేను ఈ యుద్ధము చేయను అని నీవు నిర్ణయించుకుంటే అది వృధా అగును. ఎందుకంటే నీ స్వభావము నిన్ను యుద్ధము చేయుటకు పురికొల్పుతుంది. మోహము వలన నీవు కర్మ చేయుటకు ఇష్టపడవు, కాని నీ స్వభావ జనితమైన కర్మచే నియుక్తుడవైన నీవు దానిని తప్పక చేయుదువు. పరమేశ్వరుడు అందరి హృదయాలలో అంతర్యామిగా ఉండి తన మాయచేత జీవులందరి సంచారములను నిర్దేశిస్తూ ఉన్నాడు. కనుక ఆ భగవంతుడిని శరణుపొందు.అతని కృపవలన నీవు పరమశాంతిని మరియు శాశ్వతమైన ఆనందమును  పొందగలవు. ఈ విధంగా అత్యంత రహస్యమైన జ్ఞానమును నేను నీకు అందించితిని.  దీనిని పూర్తిగా విశ్లేషించుకుని నీ కిష్టమైనట్లు చేయుము.




అమరానాథ్ అమర్



# పదునెనిమిదవ అధ్యాయము
# మోక్ష సన్యాస యోగము

అన్ని జ్ఞానములలో మిక్కిలి రహస్యమైన నా దివ్య ఉపదేశమును మరల వినుము. నీవు నాకు అత్యంత ప్రియుడవు అగుట వలన నీకు హితము కలుగు వచనములు మరల చెప్పెదను. నాయందు మనస్సు నిలుపు, నా భక్తుడవు కమ్ము. నన్నే పూజించుము, నాకు నమస్కరించుము. ఇట్లు చేయుట వలన నన్నే పొందగలవు అని నీకు వాగ్దానము చేయుచున్నాను. అన్ని ధర్మములను విడిచి కేవలం నన్నే శరణు పొందుము. అన్ని పాపముల నుండి నిన్ను నేను విముక్తి కలిగింతును నీవు శోకించకు.

## గీతను చదవడం, వినడం వలన కలిగే లాభం ఏమిటి?

భక్తి రహితులకు, తపస్సంపన్నులు కాని వారికి, వినవలెనని ఉత్సాహం లేనివారికి, నా యందు అసూయ కలవారికి ఎన్నడును ఈ గీతా జ్ఞానము చెప్పకూడదు. నా యందు పరమ భక్తి కలిగి ఈ గీతా రహస్యమును హృదయములో పదిల పరచుకున్నవాడు నన్నే పొందును. ఇందులో ఏ మాత్రము సందేహము లేదు. అతడిని మించిన భక్తుడు మరెవడు నాకు లేడు. అతని కంటే ప్రియమైన వాడును ఇంకొకడు ఉండబోడు. మన ఈ పవిత్ర సంవాదమైన గీతా శాస్త్రమును అధ్యయనము చేయువాడు జ్ఞాన యజ్ఞము ద్వారా నన్ను పూజించిన వాడని నేను ప్రకటించుచున్నాను. విశ్వాసముతో అసూయ లేకుండా గీతా శాస్త్రమును, వినుటవలన కూడా పాప విముక్తుడై పుణ్యాత్ములు వెళ్ళు ఉత్తమ లోకములను పొందును.

ఓ పార్థా! నీవు ఈ శాస్త్రమును ఏకాగ్రచిత్తముతో మనస్సు పెట్టి విన్నావా? నీ అజ్ఞానము, మోహము తొలగినదా? అప్పుడు అర్జునుడు


కృష్ణా! నీ అనుగ్రహముచే నా అజ్ఞానముతో కూడిన మోహము పూర్తిగా తొలగినది. నా సందేహములు తొలగినవి. కనుక నీ ఆజ్ఞను తలదాల్చెదను.



భగవద్గీత

# పదునెనిమిదవ అధ్యాయము
# మోక్ష సన్యాస యోగము






సంజయుడికి ఆనందము ఎందుకు కలుగుతున్నది? సంజయుడు పలికెను.
ఈ విధముగా శ్రీ కృష్ణ భగవానునికి, అర్జునుడుకి మధ్య జరిగిన సంవాదము వింటిని. అది అద్భుతమైనది మరియు నా శరీరము పులకింపచేసినది. వేదవ్యాసుల కృప వలన దివ్య దృష్టిని పొంది శ్రీ కృష్ణ భగవానుడు స్వయంగా అర్జునునకు చెప్పుచుండగా నేను ప్రత్యక్షముగా వింటిని. ఓ రాజా! శ్రీ కృష్ణ భగవానునకు, అర్జునునకు మధ్య జరిగిన రహస్యమైన ఈ సంవాదము పుణ్య ప్రదమైనది, అత్యద్భుతమైనది. ఈ సంవాదమును స్మరించిన కొలది నేను నిరంతరము ఆనందము పొందుతున్నాను.
అద్భుతమైన శ్రీకృష్ణుని రూపము స్మరించిన కొలది నేను అధికాధికంగా ఆశ్చర్యమును పొందుచు మాటి మాటికిని ఆనందించుచున్నాను.
యోగేశ్వరుడైన శ్రీ కృష్ణుడు, గాండీవము ధరించిన అర్జునుడు ఎక్కడ ఉంటారో అక్కడ సంపదలు, విజయము, సకల ఐశ్వర్యములు నీతి తప్పక ఉండును. అని నా అభిప్రాయము.


అమరానాథ్ అమర్

# పదునెనిమిదవ అధ్యాయము
# మోక్ష సన్యాస యోగము




ఈ విధంగా ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగ శాస్త్రము, శ్రీ కృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు మోక్ష సన్యాస యోగము అను 18 వ అధ్యాయము సమాప్తము.

ఓం తత్ సత్ !






www.sanatanadharm.com

రామాయణము, మహాభారతము, భాగవతాములను నేటి తరానికి అందించటమే ప్రథమ లక్ష్యము




www.sanatanadharm.com

# భగవద్గీత పరిచయము







